

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

వరంగల్

fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 129 పేజీలు: 8+16 వెల: 6.50

కాల్పులు ఆపండి.. ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక

5

హార్మూజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు: ఇరాన్

మృగశిర వేళ.. చేప ప్రసాదం

వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన ఆస్తమా వ్యాధిగ్రస్తులు

చేప ప్రసాదాన్ని ప్రారంభిస్తున్న విహెచ్

హైదరాబాద్ (గోషామహల్), జూన్ 8 ప్రభాతవార్త: ప్రతియేటా మృగశిర కార్తె బత్తిని కుటుంబీకులు ఆస్తమావ్యాధి గ్రస్తులకు ఉచితంగా పంపిణి చేసే చేప ప్రసాదానికి సోమవారం భారత దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి భారీ సంఖ్యలో తరలిరావడం కనిపించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడంతో చేపప్రసాదం >>2

వచ్చేసింది.. 'నైరుతి'

గద్వాల జిల్లాలోకి ప్రవేశించిన రుతుపవనాలు

సూర్యాపేట జిల్లాలో 11 సెం.మీ వర్షపాతం

హైదరాబాద్, జూన్8, ప్రభాతవార్త: తెలంగాణలో నైరుతి రుతుపవనాలు పలకరించాయి. గద్వాలజిల్లాలో రుతుపవానాలు ప్రవేశించడంతో సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్,పరిసర గ్రామాలలో భారీవర్షం కురిసింది. ఈశాన్య అరేబియా సముద్రం, ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన రెండు తుఫాను ఆవర్తనాలు నైరుతి రుతుపవనాల కదలికకు సానుకూలంగా మారాయి. >>2

పెళ్లికి ముందు లైంగిక సంబంధం నేరం కాదు..

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో 'సుప్రీం' తీర్పు

ఉద్యోగంలోకి తీసుకోవాలని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8: మేజర్ల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణపోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు కీలక ఆదేశాలుజారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం, పిటిషన్‌దారుడు (తెలంగాణలో గాజుల తిరుపతి అనే వ్యక్తి ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. బోర్డు పోస్టింగ్ ఇవ్వలేదు) తనపొరుగింటి యువతితోకొన్నేళ్లపాటు ప్రేమసంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. 2014లో వివాహం చేసుకుంటానని మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది. అయితే తర్వాత ఇరువురు >>2

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

సోమవారం సైబరాబాద్ సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

ప్రజాసౌకర్యాల మెరుగుకే 3 కార్పొరేషన్లు

గాజుల రామారంలో వంద ఎకరాల్లో బస్ టెర్మినల్

నగరంలో పేదల కోసం లక్ష గృహాల నిర్మాణం

సైబరాబాద్‌లో రూ.1,675 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

ఖానామెట్‌లో సిఎంసి భవనానికి శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్

అభివృద్ధిని అడ్డుకోవద్దని కిషన్‌రెడ్డిపై మరోమారు మండిపాటు

ముఖ్యమంత్రి సభకు హాజరైన ప్రజలు

సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 8, ప్రభాతవార్త: హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం కట్టుబడివుందని,తెలంగాణ రాష్ట్రానికి ఎవరేంచేశారో అసెంబ్లీలో చర్చించేందుకు తాను సిద్ధంగావున్నాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్ ప్రాంతంలోని ఖానామెట్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)కార్యాలయ భవనంతోపాటు శేరిలింగంపల్లి, కుతుబుల్లాపూర్ నియోజకవర్గాల్లో దాదాపు 1,675 కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టనున్న పలుఅభివృద్ధిపనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనచేశారు. రూ.161 కోట్లతో సీఎంసీ భవనం,రూ.530కోట్లతో మియాపూర్ ఫ్లైఓవర్, రూ.308 కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబి వంటి పనులకు శంఖుస్థాపనతోపాటు బాచుపల్లిలో 65కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన >>2

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాద దృశ్యం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోరకలి

9 మంది సజీవదహనం

లిక్విడ్ స్టీల్ తరలిస్తుండగా భారీపేలుడు

మరుగుతున్న స్టీల్ పడడంతో ప్రమాదం

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని, ఎపి సిఎం

మృతుల కుటుంబాలకు రూ2 లక్షల సాయం ప్రకటించిన మోడీ

విశాఖపట్నం(గాజువాక),జూన్ 8,ప్రభాతవార్త: విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్1) విభాగంలో జరిగిన భారీ పేలుడు కారణంగా తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స >>2

హౌసింగ్ భూమి స్వాహా

డి. కలెక్టర్ రామునాయిక్ సస్పెన్షన్

సహకరించిన మరో ఇద్దరు ఉద్యోగులపైనా వేటు

ఇందిరమ్మ ఇళ్లస్థలం పరిశీలనలో వెలుగులోకి దందా

అక్రమ సేల్‌డీడ్‌ల రద్దుకు మంత్రి పొంగులేటి ఆదేశం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్8: చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులే కంచే చేను మేసినట్లుగా ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని ఆటువంటి వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను అంగుళం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే వాటిని దోచుకునే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాము నాయిక్, 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్‌పై హౌసింగ్ బోర్డులో ల్యాండ్ అక్విషన్ ఆఫీసర్ (ఎల్.ఎ.ఓ)గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలో అనేక భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో తక్షణమే రాము నాయిక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. హైదరాబాద్, క్యూర్ పరిధిలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల గుర్తింపు కోసం హౌసింగ్ బోర్డు భూములను పరిశీలిస్తున్న సమయంలో

రాము నాయిక్ భూలీలలు బయటకు వచ్చాయని తెలిపారు. బహిరంగ మార్కెట్లో గజం రెండు లక్షల రూపాయిలకు పైగా విలువ చేసే హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయిక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడింది. దీనిపై లోతైన విచారణ జరుపగా రాము నాయిక్ భూదందాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.రామునాయిక్ హౌసింగ్ బోర్డు ఎల్.ఎ.ఓగా.. గతంలో హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగం నుంచి తొలగింపబడిన ఇఫ్తెకర్ అహ్మద్ భార్య సుబియా సుల్తానా పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయగా ఆ డబ్బులు కూడా నేటి వరకు బోర్డుకు జమకాలేదు.ఈ భూమికి సంబంధించిన పత్రాలను బోర్డు అనుమతులను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన నాటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్ పై కూడా విచారణకు ఆదేశించామని మంత్రి తెలిపారు.ఇదిలాఉండగా కాలక్రమంలో 2025 ఏప్రిల్‌లో >>2

సోమవారం ఇండియా కూటమి భేటీలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే. చిత్రంలో రాహుల్, మమత, అఖిలేష్, ఒమర్ అబ్దుల్లా తదితరులు

ఎన్‌డియేపై 'ఇండియా' ఐక్యపోరు!

సర్, ఎన్నికల అక్రమాలపై సిజెఐకి లేఖ

విద్యామంత్రి ధర్మేంద్ర రాజీనామాకు డిమాండ్

ధరల పెరుగుదలపై అఖిలపక్షానికి డిమాండ్

ఇండియా కూటమి భేటీలో 5 కీలక నిర్ణయాలు

మీడియాకు వెల్లడించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 8: బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేయాలని ఇండియా కూటమి పక్షాలు నిర్ణయించాయి. అలాగే ఎన్నికల,రాజకీయ వ్యూహాలను పునఃరూపకల్పన చేయడంపై విస్తృత ఏకాభిప్రాయం కుదిరింది. ప్రత్యేకసమగ్ర సవరణ (ఎస్ఐఆర్), పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, దేశంలో నెలకొన్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితులతో సహా అనేక కీలక అంశాలపై ఎన్‌డియే ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రచారాన్ని, వ్యూహాన్ని పదును పెట్టేందుకు కూటమి మిత్రపక్షాలు ఐదు కీలక నిర్ణయాలను ఖరారు చేశాయి. కీలక నిర్ణయాలలో భాగంగా, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల జాబితాల సవరణలో ఆరోపించబడుతున్న అవకతవకలు, ఎన్నికల నిష్పాక్షికతపై ఉన్న తీవ్ర ఆందోళనల గురించి భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)కి లేఖ రాయాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయి. త్వరలోనే సిజెఐకి నిరసన లేఖను రాసి అందజేయడంపై పార్టీలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఇండియా కూటమి సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఖర్గే, మమత, అఖిలేష్ తదితరులు వివరాలు వెల్లడించారు. ఇటీవలి నీట్ పేపర్ లీక్‌ల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న వేదన, నిరాశల అంశంపై రెండవ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వహణలో జరిగిన లోపాలపై పలువురు నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయన రాజీనామా డిమాండ్ >>2

నాజీ సిద్ధాంతం కాదు..

హిట్లర్ పట్టుదలనే సిఎం చెప్పారు

- మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్,జూన్8ప్రభాతవార్త: పట్టుదలతో ఏదైనా పనిసాధించే వారిని హిట్లర్‌తో పోల్చుతారని ఏ పనైనా పట్టుదలతో హిట్లర్‌లా సాధిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారే కానీ నాజీ సిద్ధాంతంకు రేవంత్ మద్దతు ప్రకటించలేదని భారీ పరిశ్రమలు, ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం >>2

సింగూరు డెడ్‌స్టోరేజ్

ప్రస్తుతం నీటి నిల్వ 5.374 టిఎంసిలు

ప్రత్యామ్నాయాలపై వాటర్ బోర్డు దృష్టి

జలాల పంపింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్-సికింద్రాబాద్‌కు తాగునీటి గండం

పుల్‌కల్, జూన్ 8, ప్రభాతవార్త: జంట నగరాలైన హైద్రాబాద్- సికింద్రాబాద్‌లకు తాగునీటి గండం ఏర్పడనుంది. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టు ఆనకట్ట మరమ్మత్తుల నేపథ్యంలో జలాశయంలోని నిల్వ నిటీని మూడు నెలల క్రితమే దొగువన ఉన్న మంజీర జలాశయం, ఘనపురం ఆనకట్టలకు వదిలి పెట్టారు. ప్రాజెక్టులో నీటి మట్టాన్ని తగ్గిస్తేనే

మరమ్మత్తుపనులు ముందుకు సాగుతాయని రాష్ట్ర డ్యాం సేఫ్టీ అధికారుల బృందం సూచినల మేరకు నీటిని దిగువకు వదిలేయడంతో ప్రాజెక్టులో ప్రస్తుతం జలాశయం డెడ్ స్టోరేజ్‌కి చేరుకుంది. జంగనగరాలకు అనునిత్యం సంగారెడ్డి సమీపంలోని కలబ్‌గూర్‌వద్ద నిర్మించిన మంజీర రిజర్వాయర్ నుంచి ఫేజ్ 1,2 సింగూరు ప్రాజెక్టు వద్ద నుంచి ఫేజ్ 3,4ల ద్వారా మంజీర జలాలు సరఫరా అవుతున్నాయి. వేసవి కాలాన్ని అధిగమించిన మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. జలాశయంలో నీటి మట్టం కనిష్ట స్థాయికి పడిపోతే ఫేజ్ 3,4ల పైప్‌లైన్‌కు గ్రావిటీ ద్వారా నీటి సరఫరరా తగ్గిపోవడంతో పాటు ఈ ఏడాది ఎలినినో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు లేవని వాతావరణశాఖ సూచించింది. ఇందులో భాగంగానే >>2

క్వారంటైన్‌లో నీట్ ప్రశ్న పత్రాల తయారీదారులు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్8: నీట్-2026 రీటెస్ట్ నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసాధారణ భద్రతా చర్యలను చేపట్టింది. గత మేలో జరిగిన పేపర్ లీక్ ఉదంతం నేపథ్యంలో, 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కఠినమైన నిబంధనలను అమలు చేస్తున్నారు. ప్రశ్నపత్రాల తయారీ, మోడరేషన్, అనువాద ప్రక్రియలో పాల్గొనే నిపుణులందరినీ బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఒక రహస్య ప్రదేశంలో >>2

ఎబోలా అలర్ట్!

విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా

ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్‌పై మంత్రి దామోదర సమీక్ష

హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 8: డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎమర్జన్సీ రెస్పాన్స్ సిస్టమ్ తదితర అంశాలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటేరియట్‌లో సమీక్ష >>2

సోమవారం వెస్ట్ బ్యాంక్ నగరమైన జెరికో సమీపంలో పడిపోయిన ఇరాన్ క్షిపణి శిథిలాలను పరిశీలిస్తున్న ఒక వ్యక్తి

ఎన్‌డియేపై 'ఇండియా' ఐక్యపోరు!

>> చేయాలని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్, సిబిఎస్ఇ పరీక్షలకు హాజరైన లక్షలాది మంది యువతకు అన్యాయం జరిగిందని, వారిని గాలికి వదిలేశారని వారు పేర్కొన్నారు. కాబట్టి బాధ్యతాయుత పదవిలో ఉన్నవారిని దీనికి జవాబుదారీని చేయాలని అన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రస్తుత తీవ్ర ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు, ఇతర ప్రజా ప్రయోజన అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.

ఈ ఇండియా బ్లాక్ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, సీనియర్ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, ఎన్‌సిపిఎస్‌పి నాయకురాలు సుప్రియా సూలే హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న విభేదాల కారణంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి.

పెళ్లికి ముందు లైంగిక సంబంధం

నేరం కాదు..

>> పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్) ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సింగూరు డెడ్‌స్టోరేజ్

>> గతంలో జలాశయం నుంచి జాకీ వెల్ వరకు మూడు ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ మూడు ప్రత్యేక పైప్‌లన్‌లకు 17 పైపులను అమర్చి భారీ సామర్థ్యం గల ఎలక్ట్రిక్ మోటార్ల సహాయంలో నీటిని పంపింగ్ చేసే ప్రక్రియకు చకచక ఏర్పాట్లు చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా పైపులు, మోటార్లు అమర్చే పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు 17 భారీ ఎలక్ట్రిక్ మోటార్లకు అమర్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ గుండా జాక్‌వెల్ వరకు పంపింగ్ చేసేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. రేయింబవళుల కార్మికులకు నియమించి పనుల నిర్వాహణను వేగవంతం చేశారు. జలాశయం అట్టడుగు వరకు నిల్వ ఉన్న నీటిని తడి పంపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఇదే తరహాలో ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ మోటార్లను అమర్చి మంజీర జలాలను పంపింగ్ చేశారు. వారం రోజులుగా కొనసాగుతున్న పనులను కొద్ది రోజుల్లో పూర్తి చేసి పంపింగ్ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఎలక్ట్రిక్ మోటార్లు వర్షానికి తడవకుండా ఉండేందుకు ప్రత్యేకంగా మరో షెడ్డును సైతం నిర్మించారు. సింగూరు ప్రాజెక్టు మరమ్మత్తు పనుల నిర్వహణ కోసం ప్రభుత్వం నిల్వ నీటిని దిగువకు వదిలాపెట్టడంతోనే ప్రస్తుతం నీటి కటకట ఏర్పడింది. జూన్ నాటికి మరమ్మత్తు పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహ పలు పర్యాయాలు సమీక్షా సమావేశాలు సైతం నిర్వహించారు. తాగునీటి సరఫరాను అధిగమిస్తామని ప్రకటనలు చేస్తున్నప్పటికి క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. శుక్రవారం నాటికి ప్రాజెక్టులో 29917 టీఎంసీలకు 5374 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. అయితే ప్రత్యేక పైప్‌లైన్‌లకు మోటార్లు బిగించనప్పటికి ప్రాజెక్టులో నీటి గ్రావిటీ తగ్గితే పంపింగ్ ప్రారంభిస్తామని హెచ్ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బీ అధికారులు పేర్కొంటున్నారు.

క్వారంటైన్‌లో నీట్ ప్రశ్న పత్రాల తయారీదారులు

>> ఉంచి క్వారంటైన్ చేశారు. జూన్ 21న పరీక్ష ముగిసే వరకు ఈ కఠిన నిబంధనలు అమల్లో ఉంటాయి. ఈ భద్రతా వలయంలో భాగంగా, సంబంధిత అధికారులు తమ వెంట మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ వాచ్‌లు వంటి కమ్యూనికేషన్ పరికరాలను తీసుకెళ్లడం పూర్తిగా నిషేధించారు. ఇంటర్నెట్ సౌకర్యాలు కూడా అందుబాటులో లేకుండా చూస్తున్నారు. ఈ రహస్య కేంద్రంలో అధికారులు, సిబ్బంది కదలికలను నిరంతరం పర్యవేక్షి స్తున్నారు.

వచ్చేసింది.. 'నైరుతి'

>> నైరుతి రుతుపవనాలు నాలుగు రోజుల ఆలస్యంగా కేరళ తీరాన్ని తాకాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటకలోరుతుపవనాలు ఇప్పటికే విస్తరించాయి. తెలంగాణను జూన్11,12 తేదిన చేరుకొంటాయనీ వాతవర్ణశాఖ అధికారులు అంచనా వేసినప్పటికి అనుకున్న దానికంటే మూడు రోజుల ముందే గద్వాల జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి." పరిస్థితులు అనుకూలంగా ఉంటే.. రుతుపవనాలు తెలంగాణ వ్యాప్తంగా విస్తరించడానికి కేవలం 2 నుంచి 3 రోజులు చాలు" అని అధికారులు తెలిపారు. దక్షి ణ, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులు, ఉరుములతో కూడిన బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అక్కడక్కడా భారీ నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలో నైరుతి రుతు పవనాలు ఆగమనంకు ముందే గత పదిహేను రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అరేబియా సముద్రం నుంచి తేమతో కూడిన గాలులు ఈశాన్య దిక్కుకు కదులుతుండటం, బంగాళా ఖాతం ఉన్న ఆవర్తనం గాలిని తనవైపు లాకొంటుండంతో దట్టమైన మేఘాలు కమ్ముకొని తెలంగాణలో వర్షాలు కురుస్తుండటంతో వాతావర్ణం చల్లబడుతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం ఎనిమిదిన్నర వరకు రాష్ట్రంలో 30చోట్ల భారీ నుంచి ఓమోస్తారు వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటి గణాంకాలను విడుదల చేసింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ దత్తాంశం ప్రకారం సూర్యపేట జిల్లా మఠంపల్లి పెద్దవీడులో 11.1సెం.మివర్షం కురిసింది. మఠంపల్లి 8.7సెం.మి,రంగారెడ్డి జిల్లా కద్దనూరు రాచులూరులో 8.8సెం.మి,మహేశ్వరం, నల్లగొండ జిల్లా దామరచర్లలో 7.3సెం.మి, షాబాద్ చందనపల్లి, కందుకూరు6.7సెం.మి, రంగారెడ్డి జిల్లా కేశంపేట్‌లో ఓమోస్తారు వర్షం 5.7సెం.మి కురిసింది. ఖమ్మం మధిర సిరిపురంలో 5.4 నాగరకర్నూల్ తెలకపల్లి 4.1సెం.మి, ములుగు మల్లంపల్లి, నిజామాబాద్ సిరికొండ 3.8సెం.మి, వేములవాడ రూరల్ మండలం మల్లారం నల్లగొండ జిల్లా నిడమనూరు 3.2 సెం.మి, యాదాద్రిజిల్లాలో 3.01సెం.మి, జగిత్యాల మల్యాలలలో 2.83సెం.మి సిద్దిపేట దౌల్తాబాద్‌లో 2.6 సెం.మివర్షం కురిసింది.

వారం - వర్జ్యం

09-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
నవమి రా.2.32,
పూర్వాభాద్ర ఉ.9.36
వర్జ్యం : రా.7.05-రా.8.39
దు.ఉ.8.10-ఉ.9.02,
(2) రా.11.53-రా.12.45
రాహుకాలం - మ.3.00-4.30

వార్తాఫలం

మేషం: జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వివాహయత్నాలు జరుగుతాయి.

వృషభం: అప్రయత్నంగా కార్యసిద్ధి. పలుకుబడి హోదాలో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. బంధువుల కలయిక.

మిథునం: సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. తండ్రి నుండి ఆస్తి లాభం పొందుతారు. వాహనసౌఖ్యం.

కర్కాటకం: నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. బంధువులకు కలసి ఆనందంగా గడుపుతారు.

సింహం: ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. పారిశ్రామిక రంగాలలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

కన్య : పదే పదే మీ సహాయాన్ని అర్థించే కొందరినీ దూరంగా ఉంచుతారు. క్రీడల యందు ఆసక్తి చూపుతారు. వస్త్రలాభం.

తుల : శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆరోగ్య విషయంలో మెలకువ అవసరం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

వృశ్చికం: ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.

ధనుస్సు: నూతన తరహా ఆలోచనలు చేసి ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తారు. ఇంటా బయటా మీదేపై చేయిగా వుంటుంది.

మకరం: సాంకేతిక విద్యావకాశాలు లాభిస్తాయి. రెండు, మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. వస్త్రలాభం.

కుంభం: కీలక విషయాలలో స్వంత ఆలోచనలు తీసుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వాహనసౌఖ్యం.

మీనం: శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. పెద్దల నుండి సాయం అందుకుంటారు. శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

స్టీల్‌ప్లాంట్‌లో ఘోరకలి

>> పొందుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని తెలుస్తోంది. లాడిల్ ఓపెన్ చేస్తుండగా విపత్తు....సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఎస్ఎంఎస్1 లోని సీసీడీ2 వద్ద కార్మికులు విధుల్లో ఉన్నారు. ఎల్ అండ్ డి మీద లాడిల్ ఉంచి, స్లైడ్ గేట్ ఓపెన్ చేసిన వెంటనే సాంకేతిక లోపంతో 1600 డిగ్రీల వేడితో కూడిన ద్రవరూప ఉక్కు (లిక్విడ్ స్టీల్) ఒక్కసారిగా బయటకు దూసుకొచ్చింది. దీంతో అక్కడ భారీ పేలుడు సంభవించి, మంటలు వ్యాపించాయి. అక్కడ పనిచేస్తున్న 14 మంది కార్మికులపై ఆ వేడి ద్రవం పడిపోవడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే గుర్తుపట్టలేనంతగా కాలిపోయి మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు. మృతుల వివరాలు: ఉక్కు ఉద్యోగులు: గోల్డ్ కుమార్ (మేనేజర్ మెషిన్2 ఇంచార్జ్), గొంతిన భానుకుమార్ (టెక్నీషియన్), జి.వి. అప్పారావు (టెక్నీషియన్), ఎం.కృష్ణ నాగు (టెక్నీషియన్), కే.ప్రభాకర్ (జనరల్ ఫైర్ మెన్). కాంట్రాక్ట్ కార్మికులు: రమణ, త్రినాథ్, ఎం.అప్పలరాజు, (మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది). సహాయక చర్యలు దర్యాప్తుకు ఆదేశం....ప్రమాదం జరిగిన వెంటనే ఉక్కు రక్షణ సిబ్బంది రంగంలోకి దిగి మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా గాయపడిన మిగతా వారిని అత్యవసరంగా నగరంలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రులకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదానికి గల కారణాలపై ఉక్కు యాజమాన్యం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సాంకేతిక లోపమా లేక నిర్వహణలో నిరక్ష ్యమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్తతో ఉక్కునగరంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రధాని సాయం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదంపై ప్రధాని మోదీ సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపిన ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు పరిహారాన్ని ప్రకటించారు. అదే విధంగా క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రమాదంపై డి.సిఎం పవన్ దిగ్భ్రాంతి

విజయవాడ,ప్రభాతవార్తప్రతినిధి: విశాఖ స్టీల్ ప్లాంట్ లో చోటు చేసుకున్న ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రమాదం గురించి తెలిసిన విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. స్టీల్ ప్లాంట్ లో చేపట్టిన సహాయ చర్యలపై ఆరా తీశారు. విశాఖలో ఘటనా స్థలానికి డీసీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం బయలుదేరి వెళ్తున్నారు.

విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా

>> సమావేశం నిర్వహించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని తెలిపారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షి స్తున్నామని వివరించారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి గాంధీ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితులను గాంధీలో ఐసోలేషన్‌లో ఉంచి, వారి సాంపిల్స్‌ను టెస్టుల కోసం పూణేలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా.. అక్కడ చేసిన టెస్టుల్లో వారి ఇద్దరికీ వైరస్ నెగిటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. ఐసీఎంఆర్ సూచన మేరకు వారి సాంపిల్స్‌ను మరోసారి సేకరించి టెస్టుల కోసం పూణేలోని ఎన్ఐవీకి పంపించామని చెప్పారు. రెండోసారి నెగిటివ్ వస్తే, వారిని ఐసోలేషన్‌లో నుండి డిశ్చార్జ్ చేస్తామన్నారు. అనుమానిత సాంపిల్స్ సేకరణ, టెస్టులు చేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశాఖకు అవసరమైన సహకారం అందించాలని సీసీఎంబీ డైరెక్టర్‌ను మంత్రి కోరారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా టెస్టింగ్ కిట్లు వచ్చాయని, టెస్టులు చేయడం ప్రారంభించామని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. సాంపిల్ వచ్చిన వెంటనే టెస్టులు చేసి, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇస్తామని వెల్లడించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తమకు ఇచ్చిన అడ్రస్‌లో ఉండడం లేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై మంత్రి సీరియస్‌గా స్పందించారు. ఎబోల ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను కచ్చితంగా, సక్రమంగా అందించాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎబోలా వ్యాధి నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ సంతోష్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్, సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి, సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్

సిమ్లాలో సోమవారం హిమాచల్ ప్రదేశ్ సచివాలయం వద్ద తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

హిట్లర్ పట్టుదలనే సిఎం చెప్పారు

>> సిఎల్‌పి కార్యాలయంలో మాట్లాడుతూ కెటిఆర్, హరీష్‌రావులుఒకరు విదేశాలు, మరొకరు జిల్లాలు తిరుగుతు ముఖ్యమంత్రి నాజీ సిద్ధాంతంకు మద్దతు తెలుపుతున్నారనీ రాజకీయ విమర్శలు చేస్తున్నారనీ ఆవేదన చెందారు. చిరంజీవి హీరోగా హిట్లర్ అనే సినిమా వచ్చిందనీ హిట్లర్ సినిమా ప్రధాన ఉద్దేశం వేరు రెండో ప్రపంచ యుద్దానికి కారణమైన హిట్లర్ నియంత ఆయన వేరు అని వివరణ ఇచ్చారు. "జనభావుల్యంలో హిట్లర్ పేరు వేరు ఏదైనా పని చేపడితే దాన్ని ఎలాగైనా సాధించే వారిని హిట్లర్ అంటారు. మా ముఖ్యమంత్రి ఒక లక్ష ్యం, క్రమశిక్షణతో పోవాలని హిట్లర్ అనే పదాన్ని వాడారు. దాన్ని నాజీ హిట్లర్ తో పోల్చడం సరికాదు.. హిట్లర్ పాటించిన సిద్ధాంతాలను పాటిస్తామని మా ముఖ్యమంత్రి చెప్పలేదు." అని ఆయన వివరించారు. చెరువులను కబ్జా దారులనుంచి కాపాడాలంటే ఒక ఉక్కు సంకల్పం అవసరమనీ ఆ ఉక్కు సంకల్పం గురించి చెప్పడానికి హిట్లర్ అనే పదం వాడారనీ అన్నారు. తాపీ మేస్త్రీకి తలపోటు వస్తే గోడ కూల్చినట్లు కెటిఆర్ వ్యవహారశైలి ఉంది. కబ్జాదారుల గుండెల్లో భయం పుట్టిస్తుంటే ఓర్వలేక ఏం మాట్లాడో తెలియక కొందరు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారనీ అన్నారు. గురువింద గింజ తన కింద నలుపు ఎరుగనట్లే కెసిఆర్ కెటిఆర్ ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కెటిఆర్ అంబేద్కర్ గురించి మాట్లాడం అంటే శతాబ్దపు జోక్ అని, పదేళ్ల పాటు కెసిఆర్ సెక్రటేరియట్‌కు రాలేదనీ ప్రగతి భవన్ కు ఎవరిని రానివ్వలేదనీ ఆయన గుర్తుచేశారు. రెండున్నర యేళ్లకు కాంగ్రెస్ పాలన పైన ప్రజలు విసిగిపోయారని హరీష్ రావు కలలు కంటున్నారనీ వంద సీట్లు కాదు మీకు పది సీట్లు కూడా రావని మంత్రి తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో భూముల ధరలు తగ్గాయని హరీష్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నాడు.. భూముల ధరలు ఎక్కడైనా తగ్గుతాయా..? దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నాడనీ అన్నారు. బిఆర్ఎస్ హయాంలో కృత్రిమంగా భూముల ధరలు పెంచారనీ విమర్శించారు. పోలీసుల పేరు పెట్టి హరీష్ రావు సమావేశంలో బహిరంగంగా హెచ్చరిస్తున్నాడు. .మాజీ మంత్రి హరీష్ రావు హుందాతనానికి ఇది తగదనీ అన్నారు.

మృగశిర వేళ.. చేప ప్రసాదం

>> పంపిణి ప్రశాంతంగా జరుగుతుంది. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బత్తిని కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేసి పంపిణి చేసే చేపప్రసాదాన్ని బిసి సంక్షేమ ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంత్‌రావు, మత్స్య శాఖ చైర్మన్ మెట్టుసాయి కుమార్‌లు ప్రారంభించారు. చేప ప్రసాదానికి భారీ ఎతు_న్న ఉబ్బసం వ్యాధిగ్రస్థులు చేపప్రసాదం వేసుకునేందుకు తరలిరావడం కనిపించింది. బత్తిని సోదరులు తయారు చేసిన చేప ప్రసాదం వేసుకునేందుకుగాను క్యూలో నిల్చున్నారు. ప్రసాదం కోసం గత ఏడాదికంటే ఈయేడాది ఉబ్బసం వ్యాధి గ్రస్తుల స ఖ్యపెరిగే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల రంగంలోకి దిగి చేపప్రసాదం ఏర్పాట్లపై గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో తరుచుగా సమావేశాలు ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే రోగులతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. చేపప్రసాదం కోసం ఉత్తర భారతీయులు, అధికసంఖ్యలో తరలివచ్చారు. కాగా చేపప్రసాదం కోసం నగర ప్రజలు సాయంత్రం నుంచి చేప ప్రసాదం కోసం తరలిరావడం కనిపించింది. చేప ప్రసాదం కోసం దూర ప్రాంతాలనుంచి వేలాదిగా తరలివచ్చిన వారికి ఆహారపదార్థాలు అందించడంలో పలు స్వచ్ఛందసంస్థలు శక్తివంచన లేకుండా సహకరించాయి. విద్యుత్‌శాఖ, జిహెచ్‌ంసి, మత్స్య శాఖ, ఆర్ అండ్‌బి అధికారులు, జలమండలి, పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. 8వ తేది రాత్రి 9గంటలకు చేప ప్రసాదం ప్రారంభించిన ప్రసాదం 9వ తేది రాత్రి 9గంటలకు కొనసాగుతుందన్నారు. అనంతరం దూద్‌బౌలి, కవాడిగూడలో చేప ప్రసాదం వేస్తామన్నారు.

హౌసింగ్ భూమి స్వాహా

>> ఈ భూమిని సుబియా సుల్తానా మరొకరికి విక్రయించారు. ఈ మొత్తం వ్యవహారంపై కూడా ప్రభుత్వ పరంగా తగు విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. తీగలాగితే డొంక కదిలినట్లుగా రాము నాయిక్ అక్రమాలు ఒక్కొక్కటి బయటపడ్డాయని తెలిపారు. రాము నాయిక్ భూ దందాలకు సంబంధించి 2017 నుంచి పలు కేసులు ఉన్నాయని, అప్పట్లో బిఆర్ఎస్ పాలకులు, అధికారులు స్పందించలేదని మంత్రి తెలిపారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 చదరపు గజాలు, లక్ష్మి ్మగూడలో 130 చదరపు గజాలు, మహబూబ్‌గంజ్‌లో 497 చదరపు గజాల స్థలాలను రామునాయిక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని వీటిపై ఇప్పటికే లోతైన విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఈ కేసులలో సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రపైనా కూడా విచారణ జరపాలని స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఐజీని ఆదేశించామని తెలిపారు. ప్రభుత్వ అధికారిగా అక్రమాలకు పాల్పడిన రామునాయిక్‌ను తక్షణమే సస్పెండ్ చేశామని, యుద్ద ప్రాతిపదికన విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రకటించారు. రాము నాయిక్ భూ అక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్ రిటైర్మెంట్ మరో పది సంవత్సరాలు ఉండగానే విధుల నుంచి శాశ్వతంగా తొలగించామని, మరో సూపరింటెండెంట్ బోనా నాయిక్‌ను సస్పెండ్ చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వ్యక్తులే వాటిని దోచుకునే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వ భూములపై కన్నేసిన వారెవ్వరినీ వదిలిపెట్టం. వారు ఎంతటి హోదాలో ఉన్నా, ఎంతటి పలుకుబడి కలిగి ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే. ప్రజల ఆస్తులను కబ్జా చేయాలనే దురాలోచనతో వ్యవహరించే వారిపై నిర్దాక్షి ణ్యంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఉద్యోగి అనే పేరుతో అక్రమాలకు పాల్పడితే శిక్ష మరింత కఠినంగా ఉంటుంది అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

>> బహిరంగసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశ రాజధాని నగరమైన ఢిల్లీతోపాటు ఆర్థిక రాజధానిగా పేరుగాంచిన ముంబై, ఐటీలో పేరొందిన బెంగళూరు నగరాల్లో పెరిగిపోయిన ట్రాఫిక్, కాలుష్యం, వరదముంపు సమస్యలను దృష్టిలోవుంచుకొని హైదరాబాద్ నగరాన్ని ఒక బృహత్తర ప్రణాళికతో అభివృద్ధి చేసేందుకు తాము నడుంబిగించామన్నారు. గతంలో ఒకే నగరంగావున్న హైరాబాద్‌లో ఏర్పడ్డ పరిపాలనా సమస్యలను పరిష్కరించేందుకు నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కార్పొరేట్ సంస్థల కార్యాలయాలకు తలమానికంగా ఈకార్పొరేషన్ల కార్యాలయ భవనాలను నిర్మించనున్నామని తెలిపారు.

ఎంపీలు ఏంచేస్తున్నట్లు..?

తాను కేవలం ఎన్నికలకు ఆరు నెలల ముందే రాజకీయాల గురించి ఆలోచిస్తానని, మిగతా కాలమంతా రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమంపైనే దృష్టిపెడతానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఎన్నికైన ఎనిమిది మంది ఎంపీల కారణంగానే నరేంద్రమోడీ మరోమారు ప్రధాన మంత్రి అయ్యారని, అయినా తెలంగాణకు వారు సాధించింది శూన్యమన్నారు. రెండేళ్లలో తాను తెలంగాణకు ఏమి చెయ్యలేదని మాట్లాడుతున్నారని, గతంలో పదేండ్లు ముఖ్యమంత్రిగావున్న కేసిఆర్, 12 ఏండ్ల నుంచి ప్రధానిగా వున్న మోడీ రాష్ట్రానికి ఏంచేశారన్న విషయాన్ని అసెంబ్లీలో చర్చించేందుకు తాను సిద్ధమన్నారు.

మరోమారు కిషన్‌రెడ్డిపై సెటైర్లు

నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు రాకుండా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుపుల్ల వేస్తున్నారని ముఖ్యమంత్రి మరోమారు ఘాటు విమర్శలు చేశారు. తాను వివిధ ప్రాజెక్టులకోసం కేంద్ర పాలకులను కలిసివచ్చిన మూడోరోజే కిషన్‌రెడ్డి ఢిల్లీవెళ్లి సదరు పనులు మంజూరు కాకుండా ఉండేందుకు కుట్రలు చేసివస్తున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరిగితే మరోమారు కాంగ్రెస్‌పార్టీయే అధికారంలోకి వస్తుందంటూ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు సాగిస్తున్నాడని పేర్కొన్నారు. సబర్మతి, గంగా, యమున నదుల ప్రక్షాళన చేస్తే గొప్పగా చెప్పుకున్న బిజెపి నాయకులు ఇక్కడి మూసీ నది ప్రక్షాళనను అడ్డుకునేందుకు యత్నించడం సరికాదన్నారు.

పేదలకు నగరంలో లక్ష ఇండ్లు..

హైదరాబాద్‌ను విశ్వనగరమని గొప్పలు చెప్పుకుంటే సరిపోదని, అందుకు అనుగుణంగా అభివృద్ధి జరగాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందకే మెట్రో రెండోదశ విస్తరణను చేపడుతన్నామని, గాజుల రామారంలో వంద ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ బస్‌టెర్మినల్ నిర్మాణం, హైదరాబాద్ నగరంలో నివసించే పేదలకోసం వారు ఉంటున్న ప్రాంతాల్లోనే ఎల్ఐజి, ఎంఐజి తరహాలో లక్ష ఇండ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను విడిపించి పేదల ఇండ్లకోసం కేటాయించనున్నామన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు, శాసనమండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపిలు వేంనరేంద‌ర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్‌యాదవ్, ఎంబిసి చైర్మన్ జెరిపేటి జైపాల్, కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్‌తోపాటు తాజామాజీ కార్పోరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

జూలై చివరి నాటికి తొలివిడత వాణిజ్య ఒప్పందం

కేంద్రమంత్రి పీయూష్‌గోయల్

న్యూఢిల్లీ, జూన్ 8: ప్రతినిధి బృందాల చర్చల్లోనే నలుగుతున్న భారత్‌అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుంది. వచ్చే జులైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరు దేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తి స్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జులై మధ్య నాటికి ఇరు దేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలు చేసే స్థితికి చేరుకుంటామన్నారు. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ, వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరు దేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పినట్లు సజావుగా సాగితేజులై మధ్యకల్లా ఇరు దేశాల మధ్య తుది ఒప్పందం ఖరారవుతుంది.

అన్నదాతలకు సిఎం రేవంత్‌రెడ్డి మృగశిర కార్తె శుభాకాంక్షలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8: వానకాలం వ్యవసాయానికి శ్రీకారంచుట్టే మృగశిర కార్తె ప్రారంభమవుతున్న ఈ శుభ సందర్భంలో అన్నదాతలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయం పండుగగా, తొలకరి పలకరింపు రైతులు, రైతు కూలీల ఇళ్లల్లో ఆనందోత్సాహాలు నింపాలని ఆకాంక్షించారు. వాతావరణ శాఖ, రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకుని రైతులు పంటలకు సిద్ధం కావాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో వేగంగా వస్తున్న మార్పులు, కొన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ముందస్తు అంచనాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి రైతాంగాన్ని కోరారు. కొన్ని పరిమితమైన పంటల సాగుపైన దృష్టి సారించడం వల్ల పప్పుధాన్యాలు, వేరుశనగ, పెసలు, మినుములు, నువ్వులు వంటి పంటలను దిగుమతి చేసుకోవలసిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించడంతోపాటు వరుసగా ఒకే పంటను సాగు చేయడం వల్ల నేలసారం తగ్గి తెగుళ్ల సమస్యలు కూడా పెరుగుతున్నాయని, వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా పంట మార్పిడి వల్ల నేల సారం పెరగడమే కాకుండా దీర్ఘకాలంలో అధిక దిగుబడులు అందించే పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ మృగశిర కార్తె అన్నదాతలకు శుభారంభం కావాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పుష్కలమైన పంటలు పండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

ఎపి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు కస్టడీకి పోలీసుల పిటిషన్

గండిపేటలో ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసు

హైదరాబాద్ జూన్ 8, ప్రభాతవార్త: నగర శివార్లలోని గండిపేట్ మండలంలో గల పదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు నకిలీ పత్రా లు, తప్పుడు జిఓలు సృష్టించిన కేసులో అరెస్టయిన వైకాపా మాజీ ఎంఎల్ఎ బొల్లా బ్రహ్మానాయుడును వారంరోజులపాటు కస్టడీకి ఇవ్వాలని సైబరాబాద్ పోలీసులు సోమవారం రాజేంద్రనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 23న వెలుగుచూసిన ఈ కేసులో బ్రహ్మానాయుడు ఏ7గా వుండడం తెలిసిందే. ఆయన చంచల్‌గూడ జైల్లో రిమాండు ఖైదీగా వున్నారు. ఇప్పటి వరకు బ్రహ్మానాయుడుతోపాటు ఆరుగురు ఈ కేసులో అరెస్టవగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. బ్రహ్మానాయుడు కూడా కేసు వెలుగు చూసిన తరువాత పారిపోగా ఆయనను ఈ నెల 5న తమిళనాడులోని కాంచీ పురంలో అరెస్టు చేశారు. కాగా ఈ కేసులో అరెస్టయిన రాధాకృష్ణ, నిమ్మల రాజేష్ రా మస్వామి, వేణుగోపాల్‌ను పోలీసులు రెండు రోజులపాటు కస్టడీలోకి తీసుకుని కొంత సమాచారం సేకరించారు. దీంతోపాటు బ్రహ్మ నాయుడును కూడా కస్టడీలో తీసుకుని విచారిస్తే గండిపేట్ సర్కారు భూమి కబ్జా కుట్ర కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిని విచారణకు స్వీకరించిన కోర్టు విచారణను వాయిదా వేసింది.

ప్రభుత్వ ఆస్తుల రక్షణలో మరో మైలురాయి

రెండేళ్లలో లక్షల కోట్ల విలువైన ప్రభుత్వభూమికి రక్షణ

వచ్చే యేడాది నాటికి 2 లక్షల కోట్లు అధిగమిస్తాం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, జూన్ 8,ప్రభాతవార్త: ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా కీలక మైలురాయిని అధిగమించింది. అక్రమార్కుల చెర నుంచి గడిచిన రెండేళ్లలో రూ.లక్ష కోట్లకుపైగా

విలువ చేసే ప్రభుత్వ స్థలాలు, చెరువుల భూములు, నాలాలను రక్షించి ప్రభుత్వానికి అప్పగించినట్లు సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక్రపకటనలో తెలిపారు.వచ్చే ఏడాదికి రూ. 2 లక్షల కోట్లు అధిగమిస్తుందని తెలిపారు. భూమాఫియాను అడ్డుకోవాలంటే ప్రజలు, మీడియా భాగస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. రెండేళ్లలో నగర ప్రజల ప్రోత్సాహంతో రూ. లక్షా 10 వేల కోట్ల విలువైన భూములను కబ్జాదారుల నుంచి విడిపించినట్లు రంగనాథ్ చెప్పారు. నగరంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను క్లెయిమ్ చేయడం, వాటిని సంరక్షించడం, పునరుద్ధరించడమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తుందని వివరించారు. ఇటీవల కోకాపేట, పుప్పాలగూడ, నార్సింగిలో హైడ్రా సిబ్బంది రూ. వేలాది కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను రక్షించి వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాలుగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.

బ్రిడ్జిని ఢీకొని ప్రైవేటు బస్సు బోల్తా

ఖమ్మం జిల్లా సత్తుపల్లి వద్ద దుర్ఘటన

ఏలూరు జిల్లా నుంచి వెళ్తున్న బస్సు

12 మందికి తీవ్రగాయాలు

సత్తుపల్లి, జూన్ 8, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న కె.వి.ఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీప కొత్తలంక పల్లి రైల్వే బ్రిడ్జి సమీపానికి చేరగానే ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయే రైల్వే బ్రిడ్జిని ఢీ కొట్టి బోల్తా కొట్టిన సంఘటన ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో జరిగింది. బస్సులో దాదాపు 36 మంది ప్రయాణికులు ఉండగా ఈ ప్రమాదంలో 12 మందికి గాయాలవుగా అందులో నలుగురికి కాళ్లు చేతులు వీరికి తీవ్ర గాయాలు అవటంతో సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా ఎనిమిది మంది స్వల్ప గాయాలు అవటంతో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి అనంతరం పంపించారు. వీరంతా ఆదివారం రాత్రి ఏంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కె.వి.ఆర్ ట్రావెల్ బస్సులోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం, చింతలపూడి, ముసునూరు, తదితర గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లడానికి బస్సులో ఎక్కారు. బస్సు బయలుదేరిన అర్ధగంటలోనే సత్తుపల్లి సమీప కొత్తలంక పల్లి రైల్వే బ్రిడ్జికి రాగానే రైల్వే బ్రిడ్జిని ఢీకొని బోల్తా కొట్టడంతో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది.ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమవగా, ముందు చక్రాలు కూడా ఊడిపోయాయి.సమాచారం అందుకున్న వి.ఎం. బంజర్ పోలీసులు!! ఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో బస్సులోఉన్న ప్రయాణికులను బయటికి తీసి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉండగా, మిగతా వారు సురక్షితంగా బయటపడటం ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే బస్సు డ్రైవర్ మద్యం మత్తులో అతి వేగంతో ముందు వెళ్తున్నా వాహనాన్ని ఓవర్టేక్ చేస్తూ బస్సు నడపడం వల్లే బస్సు అదుపు తప్పి ప్రమాదం జరిగిందని బస్సులోని ప్రయాణికులు తెలిపారు..గాయాలైన ప్రయాణికులు... ప్రైవేట్ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తూ కొత్త లంకపల్లి సమీపం రైల్వే బ్రిడ్జి ఢీకొన్న ప్రైవేట్ బస్సులో గాయాలైన వారు పేర్లు, శ్రావణ శశి, మల్లిక, బాలాజీ, గణేష్, రామకృష్ణ, శిరీష, ప్రణీత, నరసింహ, స్వప్న, సీతరత్నం, సుస్మిత, తదితరులు చింతలపూడి ధర్మాజీగూడెం ముసునూరు తదితర గ్రామాల నుంచి బస్సులో హైదరాబాద్ బయలుదేరిన ప్రయాణికులు. బస్సు ప్రమాదం పై సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగం, వి ఎం బంజర్ ఎస్సై వెంకటేష్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్ష

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ఫీల్డ్ స్థాయిలో విధులు నిర్వహించే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు తగిన భద్రత, సహకారం అందించాలని, అలాగే సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ పోలీస్‌లు పెట్రోలింగ్‌ను నిర్వహించాలని సంబంధిత పోలీసు అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యా లయంలో సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఈనెల 25.06.2026 నుండి ప్రారంభం అవుతుందని, కావున బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, తిరిగి వాటిని సేకరించాలని ఆయన సూచించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనే బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్ల పేర్లను, ఫోన్ నెంబర్లను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా సమన్వయం చేసుకోవడానికి పోలీసు అధికారుల ఫోన్ నెంబ ర్లను కూడా ఎన్నికల అధికారులు సేకరించు కోవాలని సూచించారు. ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జగరకుండా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించుకోవాలని డీఈఓలను ఆదేశించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సౌత్ రేంజ్ అదనపు పోలీసు కమిషనర్ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొనే అన్ని బీఎల్ఓలు, ఇతర అధికారులకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ), గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు డీఈఓలు, ఆయా జిల్లాల పోలీస్ కమిషనర్లు, డిప్యూటీ సీఈఓ (ఎఫ్ఏసీ), నోడల్ అధికారులు, పీఎంఐటీ, ఇతర సంబంధిత అధికారులు కూడా పాల్గొన్నారు.

గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్‌కు తావులేకుండా చూడాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమీక్ష

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌కి తావులేకుండా చూడాలని, అడ్మిషన్ల నుంచి అకాడమిక్స్ వరకు పారదర్శకత పాటించాలని సంక్షేమ శాఖ మంత్రి గురుకుల అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో అడ్మిషన్ల నుంచి అకడమిక్స్ వరకు పూర్తి పారదర్శకత పాటించాలన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జోనల్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ గురుకులాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయన్నారు.

ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమన్నారు. సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, భద్రత వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చూడాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజన్ ఘటనలకు అవకాశం ఇవ్వొద్దన్నారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వంట ప్రక్రియ, నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అదనపు అకాడమిక్ సపోర్ట్ అందించాలని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్, క్లాట్, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని, అడ్మిషన్ల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం, అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు.

ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 8, ప్రభాతవార్త : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని తెలంగాణ ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించే సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల 2026 వార్షిక పరీక్షల టైమ్‌టేబుల్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ఎం.వి.ఆదిలక్ష్మి సోమవారం విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, సికిందరాబాద్, పాతబస్తీ, వరంగల్, నిజామాబాద్, మంథని ప్రాంతాల్లోని ప్రభుత్వ సంగీత, నృత్య విద్యాసంస్థల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల షెడ్యూల్ ప్రకారం జూలై 2న సర్టిఫికెట్ కోర్సు పేపర్-1, జూలై 3న డిప్లొమా పేపర్-1, జూలై 4న డిప్లొమా పేపర్-2 పరీక్షలు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయి. కర్ణాటక సంగీతం (ఓకల్, వీణ, వయోలిన్, ఫ్లూట్, నాదస్వరం), మృదంగం, డోలు, హిందూస్థానీ ఓకల్, సితార్, తబలా, కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, కథక్, పేరిణి నృత్యకోర్సులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు జూలై 6 నుండి ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. హాల్‌టికెట్లను పరీక్షల ప్రారంభానికి వారంరోజుల ముందు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. పిఎస్‌టియుసెట్.ఆర్గ్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

బొగ్గు, గనుల రంగంలో గణనీయమైన మార్పులు, సంస్కరణలు

పూర్తిగా సంస్కరించాం..

రూ.60వేల కోట్లు ఆదా చేశాం

ప్రత్యక్ష, పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: బొగ్గు, గనుల రంగంలో గడిచిన 12 సంవత్సరాల్లో గణనీయమైన మార్పులు తీసుకుని వచ్చిన సంస్కరణలు చేపట్టినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం ఎఫ్ఎస్‌సిసిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత 12 సంవత్స రాలలో తన శాఖలో అభివృద్ధి, సంస్కరణను వివరించారు. దేశంలో అత్యంత విప్లవాత్మకమైన సంస్కరణలను బొగ్గు, గనుల రంగం ప్రతీకగా నిలుస్తుందన్నారు. బొగ్గు రంగంలో 5 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి, 25 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నట్లు, దేశ ఆదాయం, ఉపాధికల్పన, సర్క్యులర్ ఎకానమీ విషయంలో బొగ్గు, గనుల రంగం పాత్ర అత్యంత కీలకంగా ఉందన్నారు. రైల్వేల్లో 51శాతం ప్రయాణికులకు సబ్సిడీ ద్వారా సేవలందిస్తున్నారు. రైల్వేలకు ఎక్కువ లాభం ఫ్రైట్ ట్రాన్స్‌పోర్టేషన్ ద్వారా చేకూరుతుందని వెల్లడించారు. ఇందులో 51శాతం బొగ్గు రవాణా ద్వారానే లభిస్తుందన్నారు. ఈ యేడాదికి దాదాపు 90వేల కోట్లు బొగ్గు రవాణా ద్వారా అందుతుందని, విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు పాత్ర కీలకం అన్నారు యుపిఏ హయాంలో విద్యుత్ కొరతలతో ఇందిరాపార్క్ వద్ద ధర్నాలు చేపట్టేవారని, కానీ ఇవాళ దేశవ్యాప్తంగా నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నాం అన్నారు. కాంగ్రెస్ హయాంలో కోల్ అంటే అవినీతి, అసమర్థతకి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేవన్నారు. అలాంటి పరిస్థితులనుంచి ఇవాళ బొగ్గు రంగాన్ని పూర్తిగా సంస్కరిం చామన్నారు. పొరపాట్లు, అక్రమాలు, అవినీతి జరగకుండా సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తూ బొగ్గు రంగాన్ని రీవ్యాంప్ చేశామన్నారు. గత 12 ఏళ్లలో ఒక్కటంటే ఒక్క అక్రమం, అవినీతి జరగకుండా ప్రధాని మోడీ నేతృత్వంలో మార్పులు తీసుకొచ్చామనారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద కోల్ ప్రొడ్యూసర్‌గా దేశం ఉందన్నారు. రెండో అతి పెద్ద వినియోగదారుగా ఉన్నామన్నారు. మన వద్ద బొగ్గు రిజర్వ్లు ఎక్కువగా ఉన్నాయని, ప్రపంచంలో 5వ అతిపెద్ద బొగ్గు రిజర్వ్లు మన దగ్గర ఉన్నాయని వెల్లడించారు. గెవరా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద కోల్ మైన్, పక్కనే ఉన్న కుస్ముందా ప్రపంచంలోనే 4వ అతిపెద్ద బొగ్గు గనిగా ఉందని, మన కోలిండియా కంపెనీ ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉందన్నారు. బొగ్గు దిగుమతి తగ్గుతుందని, గతేడాది 4శాతం బొగ్గు దిగుమతులు తగ్గాయని, గతేడాది బొగ్గు దిగుమతి తగ్గించడం ద్వారా రూ.60వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకోగలిగామన్నారు. బొగ్గు రవాణాతో ఖర్చు తగ్గించేందుకు ఫస్ట్ మైల్ కనెక్టివిటీని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ నెల 11న హైదరాబాద్‌లో కోల్ గ్యాసిఫికేషన్‌పై రోడ్ షో ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతవారం ఢిల్లీలో రోడ్ షో జరిగింది. వచ్చే వారం ముంబైలోనూ రోడ్‌షో నిర్వహించబోతున్నాం. ఒక కొత్త సప్లయ్ చైన్‌ను స్టార్ట్ చేయబోతున్నాం. క్రిటికల్ మినరల్స్‌లో మనం చాలా వెనకబడి ఉన్నాం. మోడీ ఆలోచ నల మేరకు రూ.32వేల కోట్ల నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభించాం.క్రిటికల్ మినరల్స్‌లో ఆత్మనిర్భరత సాధించడం చాలా అవసరం. 20వ శతాబ్దం ఆయిల్ ఎకానమీ అయితే.. 21వ శతాబ్దం క్రిటికల్ మినరల్స్ ఎకానమీ.క్రిటికల్ మినరల్స్ విషయంలో మనం 93 దిగుమతులు చేసుకుంటున్నాం. రీసైక్లింగ్ కోసం.. రూ. 1500 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. ఈవేస్ట్ ను సేకరించి.. వాటినుంచి క్రిటికల్ మినరల్స్ తీసే పనిలో ఉన్నాం. క్రిటికల్ మినరల్ మిషన్ ప్రారంభించిన 9 నెలల్లో .. ఈ బ్లాక్స్ ఆక్షన్‌ను వేగవంతం చేశామన్నారు. మైనింగ్ ద్వారా అందే లాభంలో 90శాతం రాష్ట్రాలకే అందుతుందన్నారు. కోలిండియాతో పాటుగా సింగరేణి ఉద్యోగస్తులకు ఇన్సూరెన్స్ పెంచామని, గతంలో 30 లక్షలు, 40 లక్షలుండే ప్రమాద బీమాను కోటి రూపాయలకు పెంచామన్నారు ప్రస్తుతం లెక్కల ప్రకారం కోటి 25 లక్షల వరకు వారికి ప్రమాద బీమా వస్తుందన్నారు. ఢిల్లీ నుంచి కోల్ మినిస్ట్రీ అధికారులను సింగరేణికి పెంచి.. ఖర్చు తగ్గించేందుకు ఏం చేయాలనే దానిపై సూచనలు చేశాను. సింగరేణి భవన్‌లో ఉన్నతాధికారు లందరినీ పిలిపించి మాట్లాడాను. కొన్ని సూచనలను అమలు చేస్తున్నాను. ఇంకా చాలా చేయాల్సిన అవసరం ఉంది. ఓపెన్ క్యాస్ట్ మైనింగ్‌ను తగ్గించేందుకు అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను ప్రోత్సహి స్తున్నామన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

జర్నలిస్టుల ఫోన్ల ట్యాపింగ్‌పై విచారణ షురూ

ఆంగ్ల పత్రిక ప్రతినిధిని విచారించిన సిట్ అధికారులు

హైదరాబాద్ జూన్ 8, ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బిఆర్ఎస్ హయాంలో జరిగిన పోన్ ట్యాపింగ్ వ్యవహారంలో 28 మంది జర్నలిస్టులు వున్నట్లు గుర్తించిన సిట్ అధికారులు వీరిని వరుసగా విచారించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ప్రతినిధిని కమాండ్ కంట్రోల్‌లోని సిట్ కార్యాలయంలో సిట్ అధికారులు గంటకుపైగా విచారించారు. అప్పట్లో మావోయిస్టులను పట్టుకుంటామని చెబుతూ వారి ఆచూకీ పేరిట జర్నలిస్టుల ఫోన్‌లు ట్యాపింగ్‌కు గురైనట్లు ఆరోపణలు రావడం తెలిసిందే. ఇందులో వాస్తవం వుందని ఈ కేసులో నిందితులుగా వున్న మాజీ పోలీసు అధికారుల్లో ఇద్దరు చెప్పడం సంచలనం రేపింది.

జర్నలిస్టుల్లో కొంద రిని టార్గెట్ చేసుకుని మరీ అప్పట్లో ఫోన్‌ట్యాపింగ్ జరిగిందనే దాంట్లో నిజం వుందని పోలీసుల విచారణలో వెలుగుచూడడంతో ఇందులో నిజా నిజాలను వెలికితీసేందుకు ఆంగ్ల దినపత్రిక ప్రతినిధిని సోమవారం విచారిం చిన సిట్ అధికారులు ఆయన నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. మొత్తం 28 మంది జర్నలిస్టులను సిట్ అధికారులు విచారించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ విచారణ వారం పదిరోజులపాటు కొనసాగే వీలుందని తెలిసింది.

హైదరాబాద్‌లో 90 టన్నుల చికెన్ వ్యర్థాల జప్తు

హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతోపాటు నల్లగొండ చేపల చెరువులకు అక్రమ రవాణా

బల్దియా, పోలీసుల సంయుక్త దాడులు

హైదరాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న చికెన్ వ్యర్థాలు పట్టుబడ్డ దృశ్యం.

హైదరాబాద్ జూన్ 8, ప్రభాతవార్త: జంట నగరాల నుంచి ఎపిలోని భీమవరం, ఏలూరు, బీమడోలు, ఉండితో పాటు నల్లగొండలోని మాల్‌లో గలగల చేపల చెరువుల్లో చేపలకు మేతగా వాడేందుకు అక్రమంగా ఏడు లారీలలో తరలిస్తున్న 90 టన్నుల చికెన్ వ్యర్థాలను బల్దియా, సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయు క్తంగా దాడిచేసి పట్టుకు న్నాయి. ఈ సందర్భంగా లారీల నిర్వాహకులతో పాటు వీటిని తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ సోమవారం మీడియాకు వెల్లడించా రు. ఎపిలోని భీమవరం, ఏలూరు, బీమడోలు, ఉండిలో అనేకచోట్ల గల చేపల చెరువులు వుండడం తెలిసిందే. దీంతో పాటు నల్లగొండలో గల కొన్నిచోట్ల చేపల చెరువుల్లో వీటిని వాడుతున్నారు. ఇందులో పెంచుత్ను చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను వాడుతుంటారు. అయితే వీటిని వాడడం వల్ల చేపలు అనారోగ్యానికి గురై చేపలను తినే వారి ఆరోగ్యం పాడవుతుందని వైద్యులు ఎప్పటినుంచో చెబుతున్నారు. అయితే దీనిని చాలామంది ఖాతరు చేయడం లేదు. ఈ క్రమంలో తెలంగాణలోని అనేక ప్రాంతాల నుంచి చికెన్ సెంటర్ల నుంచి చికెన్ వ్యర్థాలను ఈ చేపల చెరువులకు అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు నిఘా వుంచగా సంచలన విషయాలు వెలుగు చూశాయి. జంట నగ రాలు, శివార్లలో పలుచోట్ల చికెన్ వ్యర్థాలకు సంబంధించిన డంప్‌లు వున్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిని ఆయా ప్రాంతాలలో గల చికెన్ సె ంటర్ల నుంచి సేకరిస్తున్నట్లు తేలింది. దీనిపై పక్కా సమాచారం సేకరించి సోమవారం తెల్లవారుజామున అంబర్‌పేట్, కుల్సుంపురా, అత్తాపూ ర్, రాజేంద్రనగర్‌లలో వున్న డంప్‌లపై పోలీసులతో పాటు బల్దియా వెటర్నరీ విభాగం సిబ్బంది ఏక కాలంలో దాడులు చేశారు. ఈ సందర్భం గా ఏడు లారీలలో వున్న 90 టన్నుల చికెన్ వ్యర్థాలను తరలించేందుకు సిద్దంగా వుండగా పట్టుకున్నారు. వాస్తవానికి వీటిని చెంగిచర్లలోని రె ండరింగ్ కేం ద్రానికి తరలించాల్సి వుండగా కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరించారు. జప్తు చేసిన చికె న్ వ్యర్థాలను బల్దియా వెటర్నరీ అధికారుల పర్యవేక్షణలో వీటిని నిర్దేశిత ప్రాంతాలలో ధ్వంసం చేశారు.

కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం
ఫోన్ నం. 0878-2243438, ఫ్యాక్స్ నం. 0878-2240624, ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
NIT No. E1/DB/MCK/8201/270/MCK/2026-27, తేది: 06.06.2026
కరీంనగర్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల యొక్క 18 నం.లు. MGF/15వ FC క్రింద మొత్తం అంచనా ధర: రూ.234.96 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 12.06.2026 సా.04.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 22.06.2026 సా.04.00 గం. తదుపరి వివరాలు www.tender.telangana.gov.in వెబ్‌సైట్ వద్ద చూడవచ్చును.
సం/- కమిషనర్, కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్
DIPR.No.3826-PP/CL/Advt/1/2026-27, తేది: 08.06.2026

శ్రీ సిద్దేశ్వరస్వామి దేవస్థానం
గ్రా॥ కొడవటూరు, మం॥ బచ్చన్నపేట, జి॥ జనగామ.
టెండర్ / బహిరంగ వేలము ప్రకటన - 4
లేఖ నెం. 1/SSSD/K/2026/4 తేది: 08.06.2026
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, శ్రీ సిద్దేశ్వరస్వామి దేవస్థానం కొడవటూరు గ్రామము నందు ఈ క్రింది సుదహరించిన వేలములు తేది: 12-06-2026 శుక్రవారం రోజున మధ్యాహ్నం 12-00 గం॥ల నుండి శ్రీ సిద్దేశ్వరస్వామి దేవస్థానము, కొడ్వటూర్ వద్ద సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును.

క్ర.స.	వేలము వివరములు	టెండరు షెడ్యూలు రూ.లు	దరావత్తు రూ.లు	పాట తేది	సీల్డ్ టెండర్ బాక్స్‌లో వేయవలసిన సమయం	బహిరంగవేలం పాట సమయం	పాటకాలం
1.	టెంకాయలు అమ్ముకొను లైసెన్సు మరియు పూజా సామాగ్రి అమ్ముకొను హక్కువేలం	1000/-	2,00,000/- డి.డి./ నగదు	12-06-2026 శుక్రవారం	12.00	12.30	13.06.2026 నుండి 12.06.2027 వరకు 1సంవత్సరము
2.	శ్రీస్వామివారి లడ్డు, పులిహోర పలహారం తయారుచేయుట	1000/-	50,000/- డి.డి./ నగదు	12-06-2026 శుక్రవారం	1.30	2.00	03.07.2026 - 30.06.2027 వరకు
3.	తలనీలాలు ప్రోగు చేసుకొను	1000/-	1,50,000/- డి.డి./ నగదు	12-06-2026 శుక్రవారం	12.15	2.30	01-08-2026 నుండి 31.07.2027 వరకు 1సంవత్సరము
4.	కొబ్బరి ముక్కలు పోగు చేసుకొను హక్కు	1000/-	50,000/- డి.డి./ నగదు	12-06-2026 శుక్రవారం	3.00	3.20	

పైన తెలిపిన ప్రకారం తేది.09.06.2026 రోజు నుండి తేది.11.06.2026 మధ్యాహ్నం 3:00 గం॥ల వరకు మన దేవస్థాన కార్యాలయము నందు రూ॥ 1,000/- చెల్లించి షెడ్యూల్ పొందగలరు.
DIPR.No.3856-PP/CL/Advt/1/2026-27, తేది: 08.06.2026 సం/- కార్యనిర్వాహణాధికారి

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణ ముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.

న-ఇ. గిబ్బన్

ఈ పంథా ఏ 'మార్పు' కోసం!

'మా వ్యూహాలకు మేమే రాజులం. వ్యూహం చేశామంటే అవి పండి తీరాలంతే! అని ఎవరేనా అనుకుంటే వాళ్ల పప్పులో కాలేసినట్లే! ఎవరు వ్యూహం చేశారని అల నాడు విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలో ఆంధ్రప్రదేశ్ పీఠమెక్కగలిగారు. ఎవరి ప్రోత్సా హంతో ద్రవిడ నాట సినీ కథానాయకుడు దళపతి విజయ్ కొత్త రాజకీయ పార్టీతో ప్రజల్లోకొచ్చి ప్రజల కోసం, ప్రజల చేత ప్రజల పాలనకు తెరదీసే అవకాశమిచ్చారు. అదంతా ప్రజల చలువ వల్లనే. అదే దారిలో, అదే పోకడలో ద్రవిడ నాట రాజకీయాలు నడపాలన్న ధోరణిలో తమిళ నాడు మాజీ బిజెపి నేత అన్నామలై మరోసారి నడుం బిగించారు. తాను తమిళనాడు బిజెపి అధ్యక్షునిగా ఉన్నంతకాలం అక్కడ రాజకీయాల్లో కొత్త బాటలు వేసేం దుకు బిజెపి అధిష్ఠానం సహకారం పూర్తిస్థాయిలో దక్కలేదని ఆయనే స్వయంగా చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లోనైనా ద్రవిడ పార్టీలను దాటి విజయ పథంలోకి అడుగుపెట్టాలన్న ఆయన ప్రయత్నాలకు బిజెపి కలిసి రాలేదు. తమిళనాట ద్రవిడ పార్టీల అనుబంధం నుంచి బయటికొచ్చే ప్రయత్నమేవీ చేయకపోగా అన్నాడిఎంకెలో కలిసి సాగడంతో అన్నామలై కాస్త పక్కకు జరిగి మౌనంగా, దూరంగా జరిగి ఉండిపోయారు. ఎన్నికల ముందూ వ్యూహాలు, ప్రతివ్యూహాలు ఆనక ఓటమి చెందితే మరో ఎన్నికకు సిద్ధం కావడం మామూలుగా ఏ రాజకీయ పార్టీయేనా చేసే పని. కానీ ఒక్కసారిగా ద్రవిడనాట ద్రవిడ నేపథ్యం, భావజాలం ఉన్న పార్టీలు చతికిలపడిపోవడం, సంప్రదాయేతర పార్టీతో ద్రవిడేతర పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పుడక్కడ రాజకీయ కలకలం చోటు చేసుకొంది. ఇవే సమీకరణలతో ఐదేళ్ల పాటు పార్టీలు నడుపుకోవడం, ప్రజాబాహుళ్యంలోకి వెళ్లి మనుగడ సాధించడమూ కష్టమే. పార్టీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. అయితే ఐదేళ్ల వేచి ఉండాలా? పదేళ్ల వేచి ఉండాలా అనే విషయమై స్పష్టత లేని తమిళనాడు రాజకీయాలను ఎవరూ నమ్ముకునే పరిస్థితి లేదు. పార్టీల్లో ద్వితీయశ్రేణి నేతలు అటూ ఇటూ చెల్లాచెదుర వుతున్నాయి. ప్రథమ శ్రేణి నాయకత్వం కూడా పక్క చూపులు చూస్తున్నాయి. ఎంత వేచి చూసినా కను చూపు మేరలో భవిష్యత్ ఆశాజనకం లేదని ఎంచి మాజీ మంత్రులు అధికార పార్టీలో చేరిపోతున్నారు. అన్నాడిఎంకె నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన నేతలు ఎక్కువ కాలం అధికారంలో లేకుండా ఉండేట్లు లేరు. ఎమ్మెల్యేగా గెలిచిన వారు సైతం బేషరతుగా టి.వి.కె. పార్టీలోకి చేరిపోతున్నారు. టివికె అధినేత ముఖ్యమంత్రి పూర్తి మెజారిటీకి అతితక్కువ దూరంలో ఉన్నందున చాలా మంది దానిని అందిపుచ్చుకుంటే తృణమోప్రణమో ప్రజా సేవలో ఉన్నట్లుగా ఉంటుంది. మర్యాద దక్కించు కున్నట్లూ ఉంటుంది అనుకుంటూ జంప్‌లు చేసేస్తు న్నారు. ఐపిఎస్ ఉద్యోగంచేస్తూ సమాజంలోమార్పుకోసం తన వంతుగా రాజీనామా చేసి రాజకీయ జపం చేసిన అన్నామలై కిందపడ్డా మళ్లీ తన ప్రయత్నాలను, ఆలోచ నలను వీడలేదు. ఎప్పుడైతే భారతీయ జనతాపార్టీవదిలి సరికొత్త రాజకీయ ప్రయాణానికి అడుగులువేశారు.'వుయ్ ది పీపుల్' పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించా రు. స్పందన అనూహ్యం. త్వరలో ప్రజలే కేంద్రంగా ఓ రాజకీయ పార్టీని స్థాపించే పనిలో పడ్డారు. 'మారుదాం. మార్చుదాం' అనే నినాదంతో కొత్త రాజకీయ ప్రస్థానానికి నాంది పలికారు. 'నా మార్గం వేరు, నా లక్ష్యాలు విస్తృ తం. తమిళనాట ఒక సరికొత్త రాజకీయ సంస్కృతిని, సమున్నతమైన మార్పును తీసుకురావాలనుంది అని అన్నామలై స్పష్టం చేశారు. ఎవరెన్ని రాజకీయాలు చేసి నా, రాజకీయ పార్టీ లకు అంతిమ లక్ష్యం అధికారమే. ఒక ఉద్యమానికి పునాది వేస్తే 'మార్పు' అదే వస్తుందన్న ఆలోచనలతో ఆయన వ్యూహాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల తమిళ తంబి లో వచ్చిన మార్పు సినీ నటుడి పార్టీకి అధికారం కట్ట బెట్టిన తీరు చూస్తే 'మళ్లీ ఇంకేంకావాలి' అనిఎవరైనా ప్రశ్నిస్తే, అన్నామలై తన గమ్యానికి సరైన దారి వేసుకునే పనిలో ఉన్నారు. తమిళనాడు రాజకీయా ల్లో కాకావికలైన అన్ని పార్టీలు తమ రాజకీయమార్గాన్ని, రాజీ మార్గాన్ని కొత్త పుంతలు తొక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ముందు ఉద్యమంలా బయటికొచ్చి ఆపైన రాజకీయ ఆకాంక్షలు నెరవేర్చుకునే విధంగా ఆలోచనలు చేస్తున్నారు. తమిళునిగా కొనసాగుతూ బిజెపిలో ఉండ డం కష్టమైన పనిగా భావించిన అన్నామలై కొత్త పంథా లోకి అడుగు పెట్టారన్న మాట. కొత్తగా రాజకీయాన్వే షణ చేసే వారికి రాజకీయాలు నేర్పేందుకు సన్నద్ధమ య్యారు. కోయంబత్తూరులో ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ ప్రారంభించే ఏర్పాట్లు జరుగుతు న్నాయి. రాజకీయ నేతలు కొత్తగా పార్టీ పెట్టే సమయం లో చెప్పే మాటలే ఆయనా చెప్పారు. తమిళనాట రాజ కీయ కూటముల్లో మిత్రులెవరూ ఆనందంగాలేరు. బయ టికెళ్లి అధికార పార్టీలో మమేకమైపోయినా లోపలుండి చేసేదేమీ లేదని తదుపరి కార్యాచరణకు సందిగ్ధంలో ఉన్నారు. నెమ్మదిగా తమకున్న రాజకీయ అనుబంధాలను తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మొన్నటిఎన్నికల్లో చితికిపోయిన వారు సైతం ఏంచేయాలో తోచక, నలు గురులో నవ్వులపాలవకుండా ఉండేందుకు కొత్తగా ఉద్య మాలు నిర్మిస్తామంటున్నారు. ఇదిలాఉండగా సూపర్ స్టార్ విజయకాంత్ సతీమణి, సామాజిక కార్యకర్త ప్రేమాలతా రజినీకాంత్ ఎండిఎంకె తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ ద్రవిడ పార్టీల కూటమిలో ఉండిపోవడం తో తమిళనాడు రాష్ట్ర శ్రేయస్సు అభివృద్ధి కోసం 'నినా దంతో'మక్కల్ మేడ్రై' పేరిట సామాజిక ఉద్యమానికిపిలు పునిచ్చారు. ఆరాష్ట్రంలో రాజకీయ సామాజికపరిణామాలు ఎంతో మందికి ఎన్నో కొత్తదారులు చూపిస్తున్నాయి.

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.

స్వామి వివేకానంద

అనేక విత్తనాలు విత్తడం ద్వారా నేల ఏ విధంగా సారవంతమ వుతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.

జెఫర్‌సన్

ప్రజావాక్కు

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరీక్షలనిర్వహణ పేపర్ల మూ ల్యాంకనం సరిగాజరగడం లేదనేది చాలా కాలంగా విని పిస్తున్నవిమర్శ. ప్రతిష్టాత్మకసంస్థల్లో చేరడానికి నిర్వహిం చే ఎంట్రన్స్ టెస్టులు ఉద్యోగాల కోసం అభ్యర్థులకు నిర్వ హించే టెస్టులు కూడా సరిగా ప్రూఫ్ రీడింగ్ చేయడం లేదు. గ్రమెటికల్‌మిస్టేక్స్ ఉంటున్నాయి. ప్రింటింగ్ మిస్టేక్స్ కూడా ఉంటున్నాయి. యాడ్స్ స్కోర్‌ఇవ్వడంలేదు. తప్పు లు ఏమైనాఉంటే అప్పీల్ చేయండిఅని అడుగుతున్నారు. ఎక్కువమంది అప్పిల్ చేయడానికి ఫీజు కట్టడానికి భయ పడి అప్పీల్ చేయడం లేదు. తద్వారా తప్పులు తడకల తో కూడినకే పేపర్ ఆధారంగానే మార్కులు ఇస్తున్నారు. ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ వారు నిర్వహించిన ఏపీ సెట్ 2025 లో పేపర్ వన్‌లో ఎనిమిది బిట్లు తప్పుగా ఇచ్చారు. వాటికిపదహారుమార్కులు. మాస్టర్‌కీలో ఆ తప్పు లు ఆధారంగానే ఆన్సర్లుఉన్నవి. ఇలాంటి పరీక్షలు నిర్వ హించే టప్పుడు అభ్యర్థుల నుండి ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

పజాస్వామ్య వ్యవస్థలో ఓటరు తీర్పు అత్యంత పవి త్రమైనది. ప్రజలు ఒకసిద్ధాంతాన్ని నమ్మి తమ ప్రతినిధు లను ఎన్నుకుంటారు. అయితే ఇటీవల రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న ఫిరాయింపులు ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు గురై పక్షాలుమార్చడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు. ఈచట్టంలోని లొసుగులను వాడు కుని ప్రతినిధులు స్వార్థ ప్రయోజనాల కోసం పక్షాలు మారుతున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరో పక్షంలోకి వెళ్లడం ఓటర్లను మోసం చేయడమే. ఫిరాయింపులకు పాల్పడినప్పుడు సభ్యత్వం తక్షణమే రద్దు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

కర్షకులు అంటే విలువలేదా

నేటి భారతంలో అధిక పనుల పేరిట ఆదివారం కూడా ఆకలి మంటల కోసంఅహర్నిశలు కృషి చేస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ ఆఫీసులు, ఆసుపత్రుల బంధిఖానలో తీవ్రఅనారోగ్యానికి గురవుతున్న కార్మికులు ఎక్కువమందేఉన్నారు. జరఆరోగ్యం గురించినిన్ను నమ్ము కున్న కుటుంబం గురించి ఆలోచించి ముందుకు సాగు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

డబుల్ బెడ్‌రూమ్స్ ఇళ్లు ఇవ్వాలి

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డబుల్ బెడ్ రూమ్లు ను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పుడుఉన్న ప్రభుత్వం లబ్ధిదారులకు కేటా యించాల్సినవి కేటాయిస్తే తమకేమీనష్టం వాటిల్తుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేయుచున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలు చేకూర్చే, బాగోగులు చూసేపథకాలను ప్రణాళిక తీసుకు వచ్చి ప్రజలకులబ్ధిదారులకు న్యాయం చేయాలి. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలలో తీర్మానంచేసి లబ్ధిదారులను ఎంపిక చేసినారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఆ లబ్ధిదారులను కాకుండా వేరే లబ్ధిదారులను చాటు మార్గంగా ఎంపిక చేస్తు న్నారా? తమకు నచ్చిన వారినినకిలీల ఎంపిక చేసివారికి కేటా యించేవిధంగాఉందని ప్రజలుఅనుమానంతో భావిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి.

- సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

గ్రామాలలో జంతు బలి నిషేధించాలి?

గ్రామాలలో ఇండ్లవీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షా కాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబ రాలు, వ్యర్థ పదార్థాలను, రక్తం, మాంసం, ఎముకలు, కసరు, వంటి పదార్థాలు మురుగు వాసనతో అంటూ రోగాలు వస్తు న్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడు తున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలినినిషేధం చేయాలి. వారికీ నోటీసు ఇవ్వాలి. జరిమానావిధించాలి. కేసులు నమో దుచేయాలి. ఆరోగ్యమేమహాభాగ్యం కనుకశుభ్రత పాటించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తొమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. ప్రభుత్వంఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

-బి. కృష్ణ యాదవ్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

'పొల్లు మాట'లతో చేటు తేవొద్దు

తెలంగాణావారి హక్కులను ఇతరుల పాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి?

డా॥కొండలరావు వెల్చాల

ఇదేనా మన సభ్యత, సంస్కారం, సాంప్రదాయం? ఇదేనా మనకు మన విద్య ద్వారా లభించినవినయం, వివేకం, వికాసం? ఈ మధ్య హైదరా బాదులో చెలరేగుతున్న మాటల మాయాజాలం నన్నెంతో కలవరపరి చింది. ఇంకా కలవర పరుస్తూనే ఉంది. దేశ స్వాతంత్ర్య సమరంలో, హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడానికి ఆనాటి హైదరా బాదు వారు జరిపిన విలీన పోరాటం లో, అటు తదుపరి తెలంగాణ అస్తిత్వ పోరాటంలో చాలా చురుకుగా పనిచేసి కరవళ్లు మోసిన వాణ్ణి, కారాగారాల్లో బంధించబడినవాణ్ణి. నిజమైన, స్వచ్ఛమైన స్వాతంత్ర్య సమరయోధుణ్ణి. కనుకనే ఈనాటి అసభ్యకరమైన, ఆందో ళనకరమైన మాటల పోటీలను చూస్తుంటే, వింటుంటే తట్టుకోజాలడం లేదు. ఇదేనా మనం మన యువతకిస్తున్న సందేశం, వారసత్వం? ఇందుకొరకేనా మనం సకల త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించింది? అని అనుకుంటూ శాంతి ప్రశాంతతలు కోల్పోతున్నాను. ఒక దేశం లేక రాష్ట్రంవారు ఇంకొక దేశానికి, రాష్ట్రానికి అనేకానేక కారణాల వల్ల రావటం పోవటం జరగడం అనాదిగా మామూలే కదా! అది వ్యాపారం కొరకు కావచ్చు, విద్య కొరకు కావచ్చు. ఉపాధి కొరకు కావచ్చు, కాని నాకు తెలిసినంతవరకు అది రాజకీయాల కొరకు మాత్రం కాదు, కాకూడదు కూడా. కాని ఇప్పుడు మాత్రం తక్కినవాటికంటే రాజకీయ కారణాలే ఎక్కువేమోనని తెలంగాణావారు గాభరా పడుతున్నారు. అందుకేనేమో కొందరు అలజడులకు, అసభ్య పదజాలాలకు పాటుపడుతున్నారు. ఇది వారి విశ్వాసానికి చెందిన విషయం. దానికి గత చరిత్ర కారణం కదా! కాదనగలమా మరి! ఒకప్పుడు తెలంగాణాను ఆంధ్రా ప్రాంతంలో విలీనం చేస్తున్నప్పుడు 'జంటిల్మెన్ అగ్రిమెంట్' ద్వారా తెలంగాణా వారికి ఆంధ్రాప్రాంతపు నేతలు ఎన్నో వాగ్దానాలు చేశారు. వాటిని పట్టించుకోకపోవడం వలననే కదా ప్రత్యేక తెలం గాణా పోరాటం వచ్చింది. మరి ఇప్పుడుకూడా ఈనాటి ప్రభుత్వాలు అనేకానేక వాగ్దానాలు చేస్తూనే ఉన్నాయి. వాటిని అమలు చేయకుండా చేతులెత్తేస్తూనే ఉన్నాయి. వాటికి అనేకానేక కారణాలు ఉదహరిస్తూ. మరొకసారి తెలుగువారందరూ కలిస్తే రెండు రాష్ట్రాలు ఒకటైతే తెలం గాణా వారికి అదే గతి పడుతుందేమోననే అనుమానం రాకుండా ఉంటుందా? ఇంగ్లీషులో ఒక సామెత 'వి హాడ్ ద ఎక్స్‌పీరియన్స్ బట్ మిస్సెడ్ ద మీనింగ్' యనునది ఉంది. ఇంకొకటి 'హిస్టరీ టీచెస్ అజ్ దట్ మ్యాన్‌కైండ్ హార్డ్‌లీ లర్న్స్ ఎనీథింగ్ ఫ్రమ్ హిస్టరీ' యనునది. ఇప్పుడు హైదరాబాద్‌లో జరుగుతున్న కలహాలను చూస్తుంటే ఔను కదా! అంతే కదా! అని అనిపిస్తుంది. మనకు మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది. దానితో మనమేం నేర్చుకున్నాం. రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. మనమేం నేర్చుకున్నాం. ఇప్పుడు మూడో ప్రపంచయుద్ధం దాదాపు మొదలైంది. దానివలన మనమేం నేర్చుకుంటున్నాం? తెలంగాణ అస్తిత్వ పోరాటం వచ్చింది, దానితో మనం ఏం నేర్చుకున్నాం? ఇదీ అంతే కావచ్చునను భయాందోళన ఈనాటి తెలంగాణా వారి

అలజడికి, అప్రస్తుత, అసభ్య పదజాల వాడుకకు కారణం కాదని నిస్సందేహంగా అనగలమా? పవన్ కళ్యాణ్ జనసేన యను ఒక పార్టీని స్థాపించారు. ఆ పార్టీని తెలంగాణాలో కూడా పెట్టదలచుకున్నారు. దానికి అభ్యంతరమెందుకు? ఆయన హైదరాబాదులో ఒక సభ జరపాలనిఅనుకున్నారు. దానికి అనుమతి నిరాకరణ ఎందుకు? ఆ పార్టీ కాక ఇంకా ఎన్నో పార్టీలు హైదరాబాదులో లేవా? ఇంకా వస్తూనే ఉన్నాయి కదా? ఆయా పార్టీలు వారివారి సభలు సమావే శాలు జరుపుకోవడం లేదా? అసలు కారణం అది కాదు. అసలు కారణం ఆనాటి ఆంధ్రాప్రాంతపు ఆధిపత్యం తిరిగి మరొకసారి తెలంగాణాకి వస్తుందేమోనని, ఇది తెలంగాణా వారి విశ్వాసానికి చెందింది. ఎవరెన్ని అన్నా ఆ విశ్వాసం ఇంత త్వరగా పోదు, పోజాలదు. ఇది పవన్ కళ్యాణ్ అర్థం చేసుకొని ఇంత తొందరగా ఇచట వారి పార్టీకి చెందిన సన్నాహాలు ప్రారంభించకపోతే బాగుండేదేమో? కాస్త రాజకీయ వాతావరణం చల్లబడ్డాక మరికొంతకాలం ఓపిక పట్టి, ఈలోపల అచటి ఇచటి మేధావులతో సంప్రదించి కొన్ని సమిష్టి సభలు, సదస్సులు నిర్వహించి అనుకూల మైన వాతావరణాన్ని సృష్టించి ఇప్పుడు చేయదలచుకున్న వన్నీ అప్పుడు చేస్తే బాగుండేదేమో? కాస్త తొందరపాటు జరిగిందని అనిపిస్తోంది. ఒకనాటి హైదరాబాదు రాష్ట్రంలో 'ముల్కీరూల్స్' యనునవి ఉండేవి. వాటిద్వారా హైదరా బాదు రాష్ట్రంలోని విద్యావసతులు, ఉద్యోగాలు, భూమి పుత్రులు మున్నగునవి మొదట హైదరాబాదు వారికే చెందాలి అనే నిబంధన ఉండేది. వాటిని తూ.చ తప్పక అమలు చేసినన్ని రోజులు ఏ గొడవలూ రాలేదు. ఎపుడైతే వాటిని అమలు చేయలేదో, అమలు చేయుటకు ఎన్నో అవ రోధాలు కల్పించి, వాటిని ఇతర ప్రాంతాల వారు కాజేయు టకు వీలు కల్పించారో అప్పుడు వచ్చింది ప్రత్యేక తెలంగాణ పోరాటం, దీని గురించి'గిర్గలాని కమీషన్' సవివరంగా పేర్కొంది. అప్పటికీ ఇప్పటికీ అసలు గొడవంతా విద్యావస రాల కొరకు, ఉద్యోగాల కొరకు, భూములు, నీళ్ల వగైరాల కొరకే కదా? అలాంటప్పుడు ఆనాటి 'ముల్కీ రూల్స్' లాంటివి ఈనాడు కూడా తెలంగాణా వారికొరకు పెట్టుకో వచ్చు కదా! అలాంటి ముల్కీరూల్స్ లాంటివి కాశ్మీర్లో కూడా అమలులో ఉన్నాయి కదా. అప్పుడు ఈ గొడవంతా ఉండదు కదా! సోనియాగాంధీకి ఒకప్పుడు ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉండింది. ఆమెను అలా కానివ్వకుండా సుబ్రహ్మణ్యస్వామి రాష్ట్రపతి దగ్గరకు వెళ్లి ఈమె ఇటాలి యన్ దేశ పౌరసత్వం కలది, ఆ దేశ రాజ్యాంగంలో ఆ దేశపౌరులు కానివారు ఆ దేశానికి రావచ్చు. ఏ కార్యకలా పాలనైనా చేసుకోవచ్చు. కాని అత్యంత ప్రముఖమైన ప్రధానమంత్రిత్వాన్ని మాత్రం ఆ దేశ పౌరుడికే ఉంటుంది' యని రాసి ఉంది. అలాగే ఇక్కడ కూడా ఇక్కడి ప్రధాన మంత్రిత్వం ఇక్కడి వారికే దక్కాలి కాని మరొకరికి కాదు యని వాదించి ఆమెను ప్రధానమంత్రి కాకుండా చేశారు. అలాంటి నిబంధనను మనం కూడా 'ముల్కీరూల్స్' పెట్టుకోవడానికి ఉదాహరణగా తీసుకోవచ్చు. తెలంగాణావారి హక్కులను ఇతరులపాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి?

(రచయిత: సీనియర్ స్వాతంత్ర్య సమరయోధులు)

అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

సీహెచ్ వి ప్రభాకర్ రావు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా కాంగ్రెస్ సభ్యుడు మార్లిన్ స్టుట్మనక్కు పంపిన లేఖ అమెరికా–ఇజ్రాయెల్ సంబంధాలపై ఒక కొత్త చర్చకు తెర తీసింది. ఆ లేఖలో నెతన్యాహు అమెరికా ఇజ్రాయిల్ రక్షణ సహకారాన్ని 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మార్చాలి అని పేర్కొనడం, అమెరికా రాజకీయ, రక్షణ, ఇంటెలిజెన్స్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలకు దారితీసింది. అమెరికా మీడియా నివేదికల ప్రకారం, నెతన్యాహు 'ఇజ్రాయెల్ ఇక భాగస్వామి కావాలి' అని స్పష్టంగా చెప్పి నట్లు తెలుస్తోంది. దశాబ్దాలుగా అమెరికా ప్రతి సంవత్స రం ఇజ్రాయెల్‌కు సుమారు 3.8 బిలియన్ డాలర్ల సైనిక సహాయం అందిస్తోంది. కానీ ఇప్పుడు ప్రతిపాదన ఏమి టంటే, ఆ సహాయాన్ని క్రమంగా తగ్గించి, దాని స్థానంలో సంయుక్త రక్షణ ఉత్పత్తి, సంయుక్త పరిశోధన, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, డ్రోన్ సాంకేతికతలలో ఉమ్మడి పెట్టుబడులు పెట్టే భాగస్వామ్య నమూనాను రూపొందించడం. ఈ మార్పు పైకి చూస్తే అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాలను మరింత బలోపేతం చేసే చర్యలా కనిపిస్తుంది. అయితే లోతుగా పరిశీలిస్తే ఇది కేవలం ఆర్థిక సహాయం తగ్గింపు కాదు. ఇదిశక్తి సంబం ధాల పునర్వ్యవస్థీకరణ. గతంలో అమెరికా నాయకత్వం వహించే సంబంధం ఉండగా, ఇప్పుడు ఇజ్రాయెల్ సమాన భాగస్వామిగా గుర్తింపు కోరుతోంది. అమెరికా భద్రతా వ్యవ స్థలో కొందరు అధికారులు ఈమార్పును జాగ్రత్తగా గమని స్తున్నారు. కారణం సైనిక సహాయంకంటే సాంకేతికభాగస్వా మ్యం మరింత లోతైనది. ఒకసారిరెండు దేశాల రక్షణ పరి శ్రమలు, ఏఐ, వ్యవస్థలు, సైబర్ నెట్వర్కు, క్షిపణి రక్షణ వ్యవస్థలు పరస్పరం అనుసంధానమైతే, సమాచారం ప్రవా హం కూడా విస్తృతమవుతుంది. అప్పుడు ప్రశ్నకేవలం సహ కారం గురించే కాదు, సున్నితమైన సాంకేతికతపై ఎవరి ప్రభావం ఎంత అన్నది కూడా కీలకమవుతుంది. చరిత్రలో అమెరికా, ఇజ్రాయెల్ మధ్య సంపూర్ణ విశ్వాసం మాత్రమే ఉండలేదు. మిత్రదేశాల మధ్యకూడా గూఢచర్య ఆరోపణలు, ఇంటెలిజెన్స్ వివాదాలు చోటుచేసు కున్నాయి. అందువల్ల అమెరికా కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాల్లో కొందరు 'భాగస్వా మ్యం ఎంత వరకు?' అనే ప్రశ్నను లేవనెత్తడం సహజమే. నెతన్యాహు ప్రతిపాదనను మరో కోణంలోచూస్తే, ఇది ఇజ్రా యెల్ వ్యూహాత్మక ఆత్మవిశ్వాసానికి సంకేతం, గతంలో సహాయం పొందిన దేశం ఇప్పుడు 'మేము నిలబడగలుగు తాం, కానీ భాగస్వామ్యంగా ముందుకు వెళ్తాం' అని చెబు తోంది. ఇదిఅమెరికా సహాయంపై ఆధారపడే మోడల్ నుండి, అమెరికా సాంకేతిక రక్షణవ్యవస్థలో కీలక భాగస్వా మిగా మారే ప్రయత్నం. ఇక్కడ అమెరికా రాజకీయాల్లో మరో అంశం కూడా ఉంది. గత కొన్నేళ్లుగా అమెరికాలో విదేశీ సహాయంపై విమర్శలు పెరుగుతున్నాయి. అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బుఎందుకు విదేశాలకు వెళ్తోందనే ప్రశ్న రిపబ్లికన్ వర్గాల్లో బలపడుతోంది. ఈ నేపథ్యంలో 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మోడల్ రాజకీ యంగా కూడా ఆకర్షణీయంగా మారింది. ఎందుకంటే ఇది సహాయం కొనసాగించడం కాదువాణిజ్యం, ఉమ్మడి పెట్టు బడులు, ఉమ్మడి ఉత్పత్తి అనే కొత్తభాషనుఉపయోగిస్తోంది. అమెరికాకు ఇది ఒక అవకాశం. అత్యాధునిక సాంకేతిక రంగాల్లో విశ్వసనీయ భాగస్వామ్యాన్ని మరింతగా ఉపయో గించుకోవడం. ప్రపంచ అగ్రరాజ్యంగా తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని, సాంకేతిక ఆధిపత్యాన్ని, ఇంటెలిజెన్స్ భద్రత ను కాపాడుకుంటూనే ఆభాగస్వామ్యాన్ని నిర్వహించడం. రాబోయేదశాబ్దంలో అమెరికా ఇజ్రాయెల్ సంబంధాల భవి ష్యత్తు ఈ సమతుల్యతపైనే ఆధారపడి ఉండవచ్చు.

భూ ఆక్రమణదారులపై హైడ్రా కొరడా!

ఆర్.భాస్కర్ రెడ్డి

ఒక బృహత్తర లక్ష్యంతో భావితరాల ఉపయోగార్థం ముఖ్యంగా హైదరాబాద్ ప్రజల సంరక్షణార్థం కొరకు ఆస్తుల రక్షణ ,పర్యవేక్షణ విపత్తుల నిర్వహణ పకడ్బందీగా అమలు చేసే ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేసి త్వరిత గతిన ఆక్రమణలు తొలగించి ప్రభుత్వం హైడ్రా ద్వారా భూములను స్వాధీనం చేసుకుంటుంది .ఇది అన్ని వర్గాలు స్వాగతించవలసిన విషయం. కానీ ఎన్నో విమర్శలు, మరెన్నో విన్నపాల మధ్య దాదాపు ఎనభై ఆరు వేల కోట్ల రూపాయల విలువైన ,రెండు వేల తొంబై మూడు ఎకరాల భూములను స్వాధీనం చేసుకుంది. ఇందులో చెరువులు, కుంటలు, సరస్సులు, నాలాలు, ప్రభుత్వ భూములు, ప్రజల పార్కులు ఉన్నాయి. ఈ ఆక్రమణ నిర్మాణాలను గమనిస్తే ఎక్కువగా రాజకీయ నాయకులు చేసినవి లేదా వారి అధి నాయకులు చేసినవే ఎక్కువగాఉన్నాయని స్పష్టమవుతుంది. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలను నమ్మించి వారి ద్వారా సొమ్ముచేసుకున్న భూములు కనబడుతున్నాయి. విచిత్రంగా అన్ని రాజకీయ పార్టీల నుండి, అన్ని రకాల వర్గాల ప్రజల నుండి, మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా తీసుకునే చర్యలను స్వాగతిస్తున్నారు ఇది హర్షించదగిన సందర్భం. గతంలోనే తెలంగాణ హైకోర్టు మూసీ నది నాలాల వెంట దాదాపు 30 వేల నిర్మాణాలు వెలిశాయని వాటిని తొలగించి అక్కడ నివసించే ప్రజలకు పునరావాస చర్యలు తీసుకోవాలని ,అప్పుడే వరదలు తగ్గుముఖం పడ తాయని, నాళాలు సురక్షితంగా ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. కానీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం వాటిపై సరైన దృష్టి పెట్టిన దాఖలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే హైదరాబాదు నగర జీవనం అష్ట కష్టాలు పడుతూ జీవిం చాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోడ్లన్నీ జలాశయాలను తలపిస్తూ విపరీతమైన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. భారీ వర్షాలు పడిన సందర్భంలో ఎప్పుడూ ,ఎక్కడ, ఏ ప్రమాదం సంభవిస్తుందో అనే సందేహం, భయం ఉత్పన్న మవుతుంది. వీటన్నింటి అనర్థాలకు నాళాలు, చెరువులు, కుంటలు కబ్జా చేసిన పుణ్యఫలమే అని అందరికీ తెలుసు. ఈ మధ్యకాలంలో నాలాలలో పాఠశాల విద్యార్థులు పడి చనిపోయిన ఉదంతాలు చాలా జరిగాయి. కానీ ఏడు దశాబ్దాలుగా సినిమా సన్నివేశాల లాగా చూస్తూ ఉన్న ప్రభుత్వ పాలన శాఖలు కబ్జా కోరల నుండి రక్షణ కల్పిం చకపోగా, ఆక్రమణదారులకు రక్షణగా నిలిచి పర్యవేక్షణ చేశాయి. కానీ ఈ మధ్యే తెలంగాణ ప్రభుత్వం మూసి నాల అభివృద్ధి కార్యక్రమం పేరుతో మూసి నది పరివాహక ప్రాంతాన్ని అభివృధి చేయడానికి పథకాన్ని రూపొందించిం ది. ఆక్రమణలు, కబ్జాలే కాక అనేక సమస్యలకు నిలయంగా మారిన కూడా హైదరాబాద్ ఒక విశ్వనగరంగావర్ధిల్లుతుంది. అనేక రకాల మతాల, కులాల, ప్రాంతాల, భాషల, వివిధ

దేశాల ప్రజలు కలిసిమెలిసి బ్రతుకుతూ బహుళ సంస్కృ తిని ఏర్పరిచినారు. హైదరాబాద్ నగరానికి అనేక పేర్లు ఉన్నాయి. కానీ చెరువుల నగరం, తోటల నగరం అనే పేరు కూడా ఉండేదని చారిత్రకంగా అవగతం అవుతుంది. ఎన్వి రాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధ్యయనం ప్రకారం, హైదరాబాద్ నగరంలో సుమారు 140 పెద్దా చిన్న సరస్సులు ఉన్నాయి. మరో 834 నీటి ట్యాంకులు 25ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. కానీ హుడా సరస్సుల పరిరక్షణ ప్రణాళిక, క్రింద 2018 మే నాటికి కేవలం 169 సరస్సుల రికార్డులను మాత్రమే నిర్వహిస్తుంది. అనగా నగరంలోని నీటి వనరులు, ఇతర నీటి వనరుల ఉపరితల వైశాల్యం తగ్గుతూ వస్తుంది. అలాగే నగరంలో రియల్ ఎస్టేట్ లేదా పట్టణీకరణ వేగవంతమైన వృద్ధి వలన వేలాది ట్యాంకులు అంతరించిపోయాయి. ఉదాహరణకు అఫ్జల్ సాగర్, కుంట భవాని దాస్ ,మాసబ్ ట్యాంక్ ,మీరు జుమ్లా ట్యాంక్, నల్లకుంట ,నవాబ్ సాహెబ్ కుంట, సోమాజిగూడ ట్యాంక్, తీగలకుంట కను మరుగ య్యాయి. 1990లో హుస్సేన్ సాగర్ చెరువు 1375 ఎకరాలుగా ఉండేది. ఆక్రమణకు గురై ఈ ప్రాంతంప్రస్తుతం 825 ఎకరాలకు మాత్రమే పరిమితమై ఉంది. అలాగే నగరంలో 1973 నుండి 1996 కాలంలో పట్టణ ఆక్రమణ కాలుష్యం కారణంగా హైదరాబాద్ పది హెక్టార్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉన్న 18 నీటి వనరులను పది హెక్టార్ల కంటే తక్కువ పరిమాణంలో ఉన్న 80 చిన్న నీటి వనరులను కోల్పోయింది. అలాగే కేంద్ర జలవనరుల శాఖ సర్వే ప్రకారం, చిన్న నీటి వనరుల ఆక్రమణలలో దేశంలో నాలుగో స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉంది. బ్రాండ్ హైద రాబాద్ పేరును నిలబట్టుకోవడానికి కావలసిన మౌలిక సదు పాయాలను కల్పిస్తూ, ప్రభుత్వ భూమి ఆక్రమణలకు తావు లేకుండా చేసి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేలా, పరిశ్ర మలను నెలకొల్పేలా, ప్రజాపాలన అందించేలా, ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంగా నిర్ణయాలు తీసుకోవా లి. వీటిని నెరవేర్చడానికి హైడ్రా తోడ్పాటు అందిస్తుందని ఆశలు చిగురిస్తున్నాయి. కానీ ఇది వానాకాలం వరకే పరి మితం కాకుండా, రాజకీయ కోణంలో చూడకుండా, 365 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. అలాగే హైడ్రా ను తెలంగాణ మొత్తంపరిరక్షించే విధంగా చట్టంలో మార్పు తీసుకు రావాలి. గ్రామీణ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు జరుగుతున్న భూ కబ్జాలను గుర్తించి పేద వారికి న్యాయం చేయాలి. ఏడు దశాబ్దాలుగా ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించడానికి ఒక మంత్రివర్గ ఉప సంఘం నియమించి కబ్జాదారుల నుండి విడిపించుకోవాలి. అలాగే ఆస్తుల సంరక్షణకే పరిమితం కాకుండా విపత్తుల నిర్వహణ బాధ్యత కూడా హైడ్రా పై ఉన్నందున నగరంలో అనుమతుల్లేని నిర్మాణాల పైన ఉక్కుపాదం మోపాలి. ము ఖ్యంగా గత దశాబ్దకాలంగా వెల్లివిరిసిన అక్రమ నిర్మాణా లను వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి. అనుమతి లేని నిర్మాణాల వలన ఆ నిర్మాణాల సమయంలో అగ్ని ప్రమాదాలు తావు లేకుండా చేయాల్సిన అత్యవసర మార్గా లను ఏర్పాటు చేయని కారణంగా అనేకమంది అమాయ కులు ప్రాణాలు పోయిన సందర్భాలు ఈ మధ్యకాలంలో చాలా బయటపడినాయి. గత ప్రభుత్వం ప్రారంభించిన స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్‌ను ముందుకు తీసుకెళ్తూ, మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టును తక్షణమేప్రారంభించి, హైదరాబాదును అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించే నగరంగా, పర్యావరణహితంగా, సమగ్ర, సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకుం టూ, అభివృద్ధి వేగం పెంచితేనే ప్రభుత్వం చెప్పిన ప్రజా పాలనకు అర్థం చేకూరుతుంది.

చైనా, భారత్, పాక్ వద్ద మరిన్ని అణ్వాయుధాలు

'సిప్రి' నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 8: 2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్ హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపిఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతోపాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత యేడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వదనద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత యేడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే క్షిపణులు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలంతార్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు క్షిపణుల కోసం మరి కొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారుచేస్తున్నట్లు సిప్రి తన నివేదికలో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణలను కంటెయినర్లకు తరలిస్తున్నట్లు కూడా రిపోర్టులో చెప్పారు. స్టాక్‌హోమ్ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్ హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది.

ఇక 2 నెలలకోసారి 'ఇండియా కూటమి' భేటీ

కూటమి నుంచి వైదొలగినట్లు ఆప్, డిఎంకె ప్రకటన

23 పార్టీల ప్రతినిధులు హాజరు

తదుపరి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహణ

న్యూఢిల్లీ, జూన్ 8: 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఇండియా కూటమి పక్షాల నేతలు సమావేశమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి 23 పార్టీలకు సంబంధించి 27 మంది ప్రతినిధులు హాజరయ్యారు. డిఎంకె, ఆప్ పార్టీలు ఇండియా కూటమి సమావేశానికి దూరంగా ఉన్నాయి. రాజ్యసభ సభ్యుడు, మాజీ కాంగ్రెస్ పార్టీ నేత కపిల్ సిబల్ కూడా హాజరయ్యారు. శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే వర్చువల్‌గా ఇండియా కూటమి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించగా, ఆ పార్టీ తరపున అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్ హాజరయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, టిఎంసి అధినేత్రి మమతాబెనర్జీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వీ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, పిడిపి అధ్యక్షుడు మొహబూబా ముఫ్తీ, జెఎంఎం పార్టీ తరపున సర్ఫరాజ్ అహ్మద్, ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రియా సూలే, సిపిఎం తరపున జాబ్ బ్రిట్టాస్, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ ఎంఎల్ సీనియర్ నాయకుడు దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి నేత ఎన్‌కె ప్రేమచంద్రన్, ఐయుఎంఎల్ నేత సాధిఖ్ థంగల్, విసికె నేత తిరుమవలవన్, ఎండిఎంకె అధ్యక్షుడు డి.వైకో, కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.జార్జ్, కేరళ కాంగ్రెస్ (ఎం) నేత జోస్ కె మణి, ఆర్ఎల్‌పి హనుమాన్ బెనివాల్, లోక్ దల్ నేత సునీల్ సింగ్, ఫార్వార్డ్ బ్లాక్ కార్యదర్శి జి.దేవరాజన్, శెట్కారి కమ్‌గర్ పకాష్ నేత జయంత్ పాటిల్ ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతంలో దేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్‌డియే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించారు. ప్రధానంగా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని ఆయా పార్టీలను నిర్వీర్యం చేసే చర్యలను ఇండియా కూటమి తీవ్రంగా ఖండించింది. అంతకుముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ప్రారంభోపన్యాసంలో, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో అసమర్థత, లోపభూయిష్టమైన విదేశాంగ విధానం కారణంగా దేశాన్ని ప్రమాదకరమైన స్థితిలోకి నెట్టినందుకు కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారని ఖర్గే ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బలహీన వర్గాలపై అఘాయిత్యాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయని మండిపడ్డారు. అంతేకాదు రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటే ఎన్‌డియే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవచ్చన్నారు. తాజాగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులను ఓడించామని గుర్తు చేశారు. ఈ విషయంలో మన సంఘీభావం, ఐక్యతను ప్రదర్శించామన్నారు. ఇప్పుడు ఆ భావనను మరింత బలపరచాలన్నారు. మోదీ ప్రభుత్వం పాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు ఇండియా కూటమిని ముందకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా రాజకీయ, ఆర్థిక, సమాజిక విదేశంగా విధానాలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవచ్చన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన భారీ పరాజయం నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో, కూటమిని బలోపేతం చేసే మార్గాలపై కూడా చర్చించారు. ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. తదుపరి సమావేశం ఆగస్టులో హైదరాబాద్‌లో జరగనుంది. అంతేకాకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతి ఉదయం ఒక సమన్వయ సమావేశం జరుగుతుంది. అక్కడ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై అచంచలమైన దృష్టితో, ఐక్యంగా కేంద్రాన్ని ఎదుర్కోవడంపై ఇండియా బ్లాక్ చర్చించాలని తీర్మానించింది.

తమిళనాడులో టివికె నేతృత్వంలోని జోసెఫ్ విజయ్ సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ, ఇండియా కూటమి సమావేశానికి టివికెను ఆహ్వానించలేదు. దీంతో ఆ పార్టీ తరపున ఇండియా కూటమి భేటీకి ఎవరూ హాజరుకాలేదు.

మరోవైపు నిన్నటి వరకు ఇండియా కూటమిలో క్రియాశీలకంగా ఉన్న డిఎంకె, ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమి నుంచి డిఎంకె వైదొలగింది. ఈ మేరకు డిఎంకె ప్రకటన విడుదల చేసింది. అటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇండియా కూటమిలో తాము లేమని స్పష్టంగా వెల్లడించింది. దీంతో ఇండియా కూటమి సమావేశానికి డిఎంకె, ఆప్‌లు దూరంగా ఉన్నాయి.

సిఎం విజయ్ సర్కార్‌పై డిఎంకె స్టాలిన్ ధ్వజం

చెన్నై,జూన్ 8: తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ఈ ప్రభుత్వం మూడు నెలల కన్నా ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో గత 60 ఏళ్లలో డీఎంకే, అన్నాడీఎంకేయేతర పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మే నెలలో విజయ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మాజీ వీసీకే ఎమ్మెల్యే పనైయూర్ బాబు, ఆయన మద్దతుదారులు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గురించి తాను ఎక్కువగా చెప్పనవసరం లేదన్నారు.

బెంగాల్ 'పుష్ప' జహాంగీర్‌ఖాన్ అరెస్టు

కోల్‌కత్తా,జూన్ 8: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ సుదీర్ఘ పాలనకు తెరపడి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఒక సంచలన అరెస్ట్ నమోదైంది. పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ జరిపిన మెరుపు దాడిలో తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత, మాజీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ భారత్‌నేపాల్ సరిహద్దుల్లో అరెస్టయ్యారు. కలకత్తా హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ లేదా రక్షణ పొడిగించేందుకు నిరాకరించడంతో ఎస్టీఎఫ్ ఈ చర్య తీసుకుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయనపై ఐదు కొత్త పోలీస్ కేసులు నమోదయ్యాయని కోర్టు ఈ సందర్భంగా గుర్తుచేసింది. మమతా బెనర్జీ మేనల్లుడు, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి జహంగీర్ ఖాన్ అత్యంత ఆప్తుడు. డైమండ్ హార్బర్ పరిధిలోని ఫాల్తా నియోజకవర్గంలో జహంగీర్ ఖాన్ వర్గీయులు భయాందోళనలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి.

ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. నలుగురు మృతి

200 మందికి గాయాలు, సునామీ హెచ్చరికలు జారీ

మనీలా, జూన్ 8: ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఉదయం 7.37 గంటల సమయంలో 7.8 తీవ్రతతో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఈ భారీ భూకంపం వచ్చింది. దీని ప్రభావంతో నలుగురు మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఫిలిప్పీన్స్ భూకంపాలు రావడం సాధారణమే. అయితే, వాటి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి భూకంపం మాత్రం ఈ యేడాదిలోనే చాలా పెద్దది. ఈ భూకంప కేంద్రం ఫిలిప్పీన్స్, నైరుతి జనరల్ శాంటోస్ నగరానికి దక్షిణాన ఉన్న మిండానో ప్రాంతంలో కేంద్రీకృతమైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. భూకంప ప్రభావంతో సునామీకి కూడా అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భూకంపం తీవ్రతతో చాలా భవనాలు, రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. కొన్ని స్వల్పంగా ధ్వంసమైతే, ఇంకొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, జనజీవనం స్తంభించింది. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేసియా, మలేసియాకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లోని తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వాలు సూచించాయి. కూలిన శిథిలాల కింద ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జనరల్ శాంటోస్ నగరంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాలు రద్దయ్యాయి. భూకంపం కారణంగా జనరల్ శాంటోస్ నగరంలో స్కూళ్లలోని విద్యార్థులను ఉన్నట్లుండి తరలిస్తున్న క్రమంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అనేక ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుల్తాన్ కుదారత్, సారంగాణి వంటి ప్రాంతాల్లో మానిటరింగ్ సెంటర్లలో సునామీ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

నార్వే చెస్ ఛాంపియన్ ప్రజ్ఞానందకు సిఎం విజయ్

రూ.50 లక్షల నగదు బహుమతి అందచేత

చెన్నై,జూన్ 8: నార్వే చెస్ టోర్నమెంట్‌లో చారిత్రక విజయం సాధించిన యువ చెస్ సంచలనం, గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందను తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు రూ. 50 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. ప్రజ్ఞానందతో సీఎం విజయ్ కాసేపు సరదాగా చెస్ ఆడి ఆయన్ను ఉత్సాహపరిచారు. ఈ ఆసక్తికర ఘటన అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఓస్లోలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో టైటిల్ గెలిచిన మొట్టమొదటి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. టోర్నీలో భాగంగా ఆయన ప్రపంచ నంబర్ 1, సొంతగడ్డ ఆటగాడైన మాగ్నస్ కార్ల్‌సెన్‌పై క్లాసికల్ ఫార్మాట్‌లో రెండుసార్లు గెలిచి అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై కూడా కీలక విజయం నమోదు చేసి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ వేదికపై దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన ప్రజ్ఞానంద మేధస్సును, సంయమనాన్ని సీఎం విజయ్ ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ తరపున రూ. 50 లక్షల చెక్కుతో పాటు జ్ఞాపికను సీఎం విజయ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆధవ్ అర్జున, క్రీడాభివృద్ధి సంస్థ సభ్య కార్యదర్శి జె. మేఘనాథ రెడ్డి, ప్రజ్ఞానంద తల్లిదండ్రులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూన్ 1న విడుదలైన ర్యాంకింగ్స్‌లో 16వ స్థానంలో ఉన్న ప్రజ్ఞానంద, నార్వే చెస్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. టోర్నీలో ఆరో రౌండ్ ముగిసేసరికి చివరి స్థానంలో నిలిచి, అనూహ్యంగా పుంజుకున్నాడు. వరుసగా నాలుగు గేమ్‌లలో గెలిచి టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. చివరి రౌండ్‌లో విన్సెంట్ కీమర్‌పై గెలిచి మొత్తం 18 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 2021లో కార్ల్‌సెన్ తర్వాత ఒకే ఈవెంట్‌లో వరుసగా నాలుగు గేమ్‌లు గెలవడం ఇదే తొలిసారి.

మైనర్ బాలికపై సామూహిక లైంగిక దాడి

కోల్‌కత్తా,జూన్ 8: నగరంలోని దుర్గాపూర్ సిటీ సెంటర్ పరిధిలో ఎనిమిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో పోలీసులు స్పందించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు వారికి సహకరించిన ఒక మహిళను, నిబంధనలకు విరుద్ధంగా గదిని కేటాయించిన హోటల్ మేనేజర్‌ను కలిపి మొత్తం నలుగురిని అసంసోల్‌దుర్గాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. రెండురోజులక్రితం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో బాధితురాలి కుటుంబానికి తెలిసిన సిమ్రాన్ తమాంగ్ అనే మహిళ బాలికను మాయమాటలతో నమ్మించి ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చింది. ఆ తర్వాత నిందితులు బాలికను కారులో ఎక్కించుకుని, అందులోనే బలవంతంగా కూల్ డ్రింక్‌లో మత్తుమందు, మద్యం కలిపి తాగించారు. బాలిక స్పృహ కోల్పోగానే కవిగురు ప్రాంతంలోని ఒక హోటల్‌కు తీసుకెళ్లి రాజ్ మల్లిక్, షేక్ అజారుద్దీన్‌తోపాటు మరికొందరు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్టు బాధిత బాలిక తండ్రి ఆరోపించారు. ఈ ఘాతుకం తర్వాత రాత్రి 10:30 గంటల సమయంలో నిందితులు బాలికను బైపాస్ రోడ్డు పక్కన పడేసి పారిపోయారు. తీవ్ర అస్వస్థతతో రోడ్డుపై పడి ఉన్న బాలికను ఒక ఈ రిక్షా డ్రైవర్ గుర్తించి, మానవత్వంతో ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చాడు.

ఇరాన్ నుంచి వచ్చేయండి! - అక్కడి భారతీయులకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ,జూన్ 8: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నామని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి.

ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణలన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు.

హార్ముజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు!

నిబంధనలు యధాతథంగా అమలు చేస్తామన్న ఇరాన్

టెహ్రాన్,జూన్ 8: అంతర్జాతీయంగా ముడిచమురు, సహజ వాయువు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి భవిష్యత్తుపై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. కొన్ని నెలలుగా కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా పాక్షికంగా మూతబడిన ఈ జలసంధిని అంతర్జాతీయ నౌకల రాకపోకల కోసం తెరిచే ఉంచుతామని, అయితే కొత్త నిబంధనలు వర్తిస్తాయని ఇరాన్ స్పష్టం చేసింది. రష్యాలోని ఇరాన్ రాయబారి కాజెం జలాలీ సోమవారం రష్యా వార్తాపత్రిక ఇజ్వెస్టియాతో మాట్లాడుతూ ఇరాన్, ఒమన్ దేశాలు సంయుక్తంగా రూపొందించే సరికొత్త ఫ్రేమ్‌వర్క్ ఆధారంగానే ఈ జలసంధిలో రవాణా సాగుతుందని వెల్లడించారు. ఈ కొత్త నిబంధనలలో భాగంగా హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలపై ట్రాన్సిట్ ఫీజు విధించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు ఈ సముద్ర మార్గం నుంచే వెళ్తుంది. మార్చి 2026 లో ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్ తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు దీనిని పూర్తిగా పునరుద్ధరించడానికి సిద్ధమవుతున్నప్ప టికీ ఇరాన్, ఒమన్ దేశాలు అక్కడ అందించే రక్షణ, నిఘా, సెర్చ్ అండ్ రెస్క్యూ (సహాయక చర్యలు) సేవలకు గానూ ఈ ఫీజులను వసూలు చేయనున్నట్లు రాయబారి పేర్కొన్నారు. ఇరాన్ ప్రతిపాదిస్తున్న ఈ రవాణా రుసుములపై అంతర్జాతీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం హార్ముజ్ జల సంధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉచితంగా నౌకలు ప్రయాణించే హక్కు ఉందని అమెరికా వాదిస్తోంది. ఇరాన్‌కు ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని, ఈ వసూళ్ల దందాలో భాగస్వామి కావద్దని ఒమన్‌ను కూడా అమెరికా హెచ్చరించింది. యుద్ధ భయాలు, బీమా ప్రీమియంలు పెరిగిపోవడం, ప్రయాణంలో ఆలస్యం కావడం కంటే ఇరాన్‌కు కొంత ఫీజు చెల్లించి సురక్షితంగా వెళ్లడమే మేలని కొన్ని అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు భావిస్తున్నాయి. ఈ ఫీజులు నౌక పరిమాణం, మోసుకెళ్లే సరుకును బట్టి ఒక్కో నౌకకు గరిష్టంగా 2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 16 కోట్లు) వరకు ఉండే అవకాశం ఉంది. రష్యా వంటి మిత్రదేశాలకు మాత్రం ఇరాన్ ఇప్పటికే ఈ ఫీజుల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఏప్రిల్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత ఈ సముద్ర మార్గాన్ని శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ఇరాన్‌ఒమన్ సంయుక్త కమిటీ చర్చలు జరుపుతోంది. ఈ ప్రకటన గ్లోబల్ మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చినప్పటికీ కొత్తగా విధించే ఫీజుల భారం చివరకు వినియోగదారులపైనే పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా.

లాస్‌ఏంజిల్స్ మేయర్ రేసులో దూసుకెళ్తున్న నిత్యారామన్

లాస్ ఏంజిల్స్, జూన్ 8: అమెరికాలో భారతీయ సంతతి మహిళ నిత్యారామన్.. లాస్‌ఏంజిల్స్ మేయర్ ఎన్నిక రేసులో దూసుకెళ్తున్నారు. నవంబరులో జరిగే ఆ ఎన్నికల గురించి అప్పుడే యుద్ధం మొదలైంది. ఓ మీడియా సంస్థ నివేదిక ప్రకారం.. నిత్యారామన్ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. లాస్ ఏంజిల్స్ కౌంటీలో ఉన్న సుమారు 48 వేల ఓట్లలో ఆమె ఆదివారం నాటికి 40 శాతం ఓట్లను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి ప్రాట్ కన్నా 10 వేల అధిక ఓట్లను ఆమె కైవసం చేసుకున్నట్లు ఓ రిపోర్టు ద్వారా తెలిసింది. కేరన్ బ్రాస్, స్పెన్సర్ ప్రాట్‌పై జూన్ 2న జరిగిన ప్రైమరీలో అత్యధిక ఓట్లను సాధించింది. దీంతో నిత్యారామన్ ఓట్ షేర్‌లో 5 పాయింట్లతో ముందున్నారు. రిపబ్లికన్ పార్టీ తరపున ప్రాట్ పోటీ చేస్తుండగా, నిత్యారామన్ మాత్రం ప్రోగ్రెసివ్ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.

అయోధ్యలో కరుడు గట్టిన క్రిమినల్ ఎన్‌కౌంటర్

అయోధ్య,జూన్ 8: ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన క్రిమినల్ హతమయ్యాడు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. అయోధ్యలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భాను ప్రతాప్ సింగ్ అలియాస్ బబ్లూ హతమయ్యాడు. ఉత్తర ప్రదేశ్ పోలీసులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) సిబ్బంది కలిసి ఆపరేషన్ నిర్వహించారు. హతుడు భాను ప్రతాప్ సింగ్‌పై అనేక జిల్లాల్లో 40 వరకు కేసులున్నాయి. అతడిపై అనేక చోట్లా రూ2 లక్షల వరకు రివార్డ్ కూడా ఉంది. గోరక్‌పూర్ పరిదిలోని బిక్నీపూర్ గ్రామానికి చెందిన బబ్లూ అనేక నేరాలకు పాల్పడ్డాడు. అతడిపై యూపీలోని అనేక జిల్లాల్లో చాలా కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా అతడు పరారీలో ఉన్నాడు. అతడి గురించి ఇటీవల ఎస్టీఎఫ్ అధికారులకు సమాచారం అందింది.

ఇక కాల్పులు ఆపండి..ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్,జూన్ 8: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు ముగించాలనే తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ఈ శాంతి ప్రక్రియలో తనదే తుది నిర్ణయమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇక్కడ అన్ని నిర్ణయాలు నేనే తీసుకుంటాను. నెతన్యాహు కాదు. భవిష్యత్తులో అమెరికాఇరాన్ మధ్య కుదిరే ఒప్పందాన్ని ఆయన అంగీకరించి తీరాల్సిందే అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం రాత్రి ఇరాన్ భారీగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. అంతకుముందు లెబనాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దళాలు బీరుట్ శివార్లలో దాడులు చేశాయి. దీనికి ప్రతికారంగానే ఇరాన్ క్షిపణులతో విరుచుకు పడింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ ఆర్మీ సమర్థించుకుంది. ఇరాన్‌పై ఎదురుదాడి చేయొద్దని నెతన్యాహును ట్రంప్ కోరనున్నట్లు సమాచారం. ఇలాంటి సైనిక చర్యల వల్ల ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చాలు. ఇప్పుడైనా చర్చలకు వచ్చి ఒప్పందం చేసుకోండి అని పిలుపునిచ్చారు. అలాగే బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన ముందస్తు దాడులపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవేళ దౌత్యపరమైన చర్చలు విఫలమైతేపరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. చర్చలు ఫలించకపోతే ఇరాన్‌పై కమాండో దాడులు చేసే ఆలోచన కూడా ఉందన్నారు. మేం ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం.ఇరాన్ వినకపోతే వారిపై బాంబులతో విరుచుకుపడతాం అని ఎన్‌బీసీ ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఆగస్టునుంచి కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థ

న్యూఢిల్లీ,జూన్ 8: టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది. ఈ సరికొత్త అప్‌గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్‌కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్‌ను ప్రారంభించింది.

అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది. రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది జులైలో ప్రారంభించిన రైల్ వన్ యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాది లోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్‌లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్‌ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది. కొత్త సిస్టమ్‌తో పాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. గతంలో 53 శాతంగా ఉన్న ఖచ్చితత్వం ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది.

బలమైన గాలులకు ఎయిర్‌పోర్టులో దెబ్బతిన్న విమానాలు

న్యూఢిల్లీ, జూన్ 8: బలమైన గాలి వానకు ఎయిర్‌పోర్ట్‌లోని గ్రౌండ్ పరికరాలు వేగంగా కదిలాయి. పార్క్ చేసిన విమానాలను అవి ఢీ కొట్టాయి. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియాకు చెందిన మూడు విమానాలు దెబ్బ తిన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2 వద్ద ఉన్న ఎయిర్ ఇండియాకు చెందిన ఇంజినీరింగ్ పరికరం, ఇండిగోకు చెందిన గ్రౌండ్ సపోర్ట్ ల్యాడర్ బలమైన గాలులకు కదిలి ముందుకు దూసుకెళ్లాయి.

మాజీ సిఎం కుమార్తెపై ఇడి విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్!

వీణావిజయన్‌పై బిగుస్తున్న రూ.2.78 కోట్ల ఉచ్చు

తిరువనంతపురం, జూన్ 8: కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ వ్యవహారంలో మాజీసీఎం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు గట్టి షాక్ తగిలింది. ఈ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరుపుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తును సవాల్ చేస్తూ కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీల్‌ను కేరళ హైకోర్టు కొట్టివేసింది.

ఈడీ దర్యాప్తు యథావిధిగా కొనసాగవచ్చని స్పష్టం చేసింది. వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ అనేది స్కూల్, కాలేజీ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ తయారు చేసే ఒక చిన్న సంస్థ.

లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్

నింబోలిఅడ్డాలో బాబూజగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహం

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి స్థలాలను పరిశీలించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్, బాబూజగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ నిర్మా ణాలు మైలురాళ్లుగా నిలవనున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క అన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూ లన సాధ్యమవుతుందని, సమాజంలో అణగారిన వర్గాలు నాయకత్వ స్థానాలకు చేరుకోగలవని స్పష్టం చేశారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రతిపాదిత అంబే ద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణ స్థలాన్ని, అనంతరం నింబోలీఅడ్డాలో ఆధునికీకరించనున్న బాబూజగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతిగృహ స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అనం తరం ఉపముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఉపముఖ్య మంత్రి మాట్లాడుతూ.. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ కోట్లాది మంది దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విజ్ఞాన సౌధ మని పేర్కొన్నారు. 10 అంతస్తుల్లో నిర్మించనున్న ఈ టవర్‌లో డిజిటల్ లైబ్రరీలు, ఈ లెర్నింగ్ సెంటర్లు, పరి శోధన విభాగాలు, పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాలు, కాన్ఫరెన్స్ హాల్స్, కెరీర్ గైడెన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్‌లోని నిష్ణాతులైన అధ్యాపకుల బోధనను ప్రత్యక్షంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందించ నున్నట్లు వెల్లడించారు. విద్య కోసం హైదరాబాద్‌కు రాలేని విద్యార్థులకు వారి ప్రాంతాల నుంచే ఉన్నతవిద్య అవకాశాలను అందించే వ్యవస్థను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. నింబోలి అడ్డాలోని చారిత్రక విద్యార్థి వసతిగృహాన్ని ప్రస్తావిస్తూ ఇది కేవలం ఒక హాస్టల్ మాత్రమే కాదని, వేలాది మంది పేదవిద్యార్థుల కలలకు ఆశ్రయం కల్పించిన సామాజిక చరిత్రకు సజీవ సాక్ష్య మన్నారు. ఈ హాస్టల్‌లో ఉండి చదివిన వారు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, రాజకీయ నాయకులుగా, న్యాయవాదులుగా, విద్యావేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగి సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లా డుతూ .. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల విద్యా అభ్యున్నతికి లోయర్ ట్యాంక్‌బండ్‌లో రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, నింబోలీఅడ్డాలో సుమారు రూ.25 కోట్లతో అత్యాధునిక వసతులతో బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. తన హయాంలో ఈ రెండు చారిత్రాత్మక ప్రాజెక్టులకు నిధులు కేటాయించి కార్యరూపం దాల్చడం జీవితంలో గర్వకారణమైన ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్య క్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఆర్ అండ్ బి సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మనోహార్, ఆర్డీవో సాయిరాం, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టికి ఒప్పుకొన్న నిర్మాణంపై బిఆర్ఎస్ నిర్లక్ష్యం

ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును 150మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నా గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం దానిని పట్టించుకోలేదని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. సోమవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహా రాష్ట్ర గవర్నర్‌గా తెలంగాణకు చెందిన చెన్నమనేని విద్యాసాగర్ రావు ఉన్నారని ఆయన్ని కూడా నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఉపయోగిం చుకోలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన సమయంలో 600 ఎంజిడి వాటర్ సప్లై హైదరాబాద్ మహానగరానికి ఉందన్నారు. పదేళ్లలో ఒక్క ఎంజిడి వాటర్ కూడా హైదరాబాద్‌కు బిఆర్ఎస్ తీసుకు రాలేదని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి కెనాల్ నిర్మాణం చేయకుండా 90 శాతం పనులు పూర్తయ్యాయని బిఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తుందని యెన్నం ఆవేదన చెందారు. డిపిఆర్‌లో సగం బడ్జెట్ కూడా ఖర్చు పెట్టకుండా 90 శాతం పనులు చేయడం సాధ్యమా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. భూబకాసురల విషయంలో హిట్లర్‌గా సిఎం కఠినంగా ఉంటానని చెప్పారనీ దానికి పెడ అర్థాలు తీయడం తగదని అని యెన్నం అన్నారు. హిట్లర్ కంటే కఠినంగా ఉంటామని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ గతంలో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. ఆ సమయంలో బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. నాడు కెసిఆర్ మాట్లాడిన మాటలనే నేడు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారనీ స్పష్టం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం ప్రత్యేక పథకాలు రూపొందించాలి

16, 17 తేదీల్లో యువజన సమ్మేళనం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో యువజన సమ్మేళనాన్ని నిర్వ హించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యురాలు టి జ్యోతి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి యాదయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్య క్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం చంద్రమోహన్, జగదీష్‌తో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మా ట్లాడుతూ.. హైదరాబాద్ కొత్తపేటలోని బీజేఆర్ భవన్‌లో యువజన సమ్మేళనాన్ని ఈ నెల 16,17 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్‌పై దృష్టి పెట్టడం లేదనీ, యువ శక్తిని నిర్వీరం చేస్తున్నాయని విమర్శించారు. అందుకే యువత నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 60 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయనీ, ఒక్క రైల్వే శాఖలోని 10 లక్షల ఖాళీలున్నాయన్నారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవటం వల్ల దళితులు, ఆదివాసీ గిరిజనులు, బీసీలు నష్టపోతు న్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమూ ఉద్యోగాల భర్తీలో నిరక్ష ్యం వహిస్తున్నదనీ, అధికారం చేపట్టిన యేడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీని బుట్టదాఖలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 వేల పోస్టులను మాత్రమే భర్తీ చేసిందనీ, గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్లను క్లియర్ చేసి తన ఖాతాలో వేసుకుంటున్నదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీ విషయంలో యువతను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. యువత మానసిక, ఆర్థిక ఒత్తిళ్లకు తట్టుకోలేక వ్యసనాలకు అలవాటు పడుతున్న పరిస్థితి ఉందనీ, రాష్ట్రంలో రాజకీయ అండదండలతోనే డ్రగ్స్ దందా సాగుతున్నదని విమర్శించారు. దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాలసీలు లేవనీ, దీంతో ప్రపంచ క్రీడల్లో మన క్రీడాకారులు వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే యువత సమస్యలపై చర్చిం చేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో యువజన సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే సమ్మేళనంలో యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోలీసు విభాగాల సరిహద్దులు, స్టేషన్ల పరిధులపై ప్రణాళిక

నేపాల్ పనివాళ్లపై పూర్తి వివరాలు సేకరించాలి

పోలీసింగ్‌లో సాంకేతికతను మరింత వాడాలి

ఉన్నతాధికారుల సమావేశంలో డిజిపి ఆనంద్ ఆదేశం

పోలీసు ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న డిజిపి ఆనంద్. చిత్రంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖాగోయల్, పోలీసు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్ తదితరులు

హైదరాబాద్ జూన్ 8, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్లకు సంబంధించిన సరిహద్దులు, పోలీసు స్టేషన్ల పరిధులపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని డిజిపి సి.వి ఆనంద్ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో పాటు రాష్ట్రంలో నేపాల్‌కు చెందిన పని మనుషులు దొంగలుగా మారుతూ నేరాలకు పాల్పడుతున్న క్రమంలో వారికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలని, దీంతో పాటు పో లీసింగ్‌లో సాంకేతికను మరింత వాడాలని ఆయన కోరారు. డిజిపి కార్యాల యంలో కీలక అంశాలపై సి.వి ఆనంద్ సోమవారం నాడు ఉన్నతా ధికారు లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు చోట్ల జిల్లాలు, కమిషనరేట్ల సరిహద్దులు, పోలీసు స్టేషన్ల పరిధులపై తరచూ వివాదాలు వస్తుండడం సరికాదని, వీటికి వెంటనే ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆయన కోరారు. ఇటీవల జంట నగరాలు, శివార్లలో కొత్త జోన్లు రావడం, పాత జోన్లలోని కొన్నింటిని మరోదాంట్లో కలపడం వల్ల సమస్యలు వస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఈ క్రమంలో జి ల్లాలు, కమిషనరేట్ల సరిహద్దులు, పోలీసు స్టేషన్ల పరిధులపై వెంటనే సమగ్రంగా పరిశీలన చేసి పూర్తిస్థాయిలో ప్రణాళికను రూపొందించాలని ఆయన ఆదేశించారు.

ఇందులో సర్కిళ్లు, జోన్లు, గ్రామాల పునర్విభజన వంటి అంశాలు వివరంగా వుండాలని ఆయన ఆదేశించారు. ఈ విషయంలో పక్కా సమాచారం వుండాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ఇటీవల కాలంలో నేపాల్‌కు చెందిన పని మనుషులు పలుచోట్ల ఇళ్లలో పని చేస్తూనే దోపిడీలకు పాల్పడడం, కొన్నిచోట్ల హత్యలకు దిగడం వంటి ఘటనలు కలవరానికి గురిచేస్తు న్నాయని డిజిపి తెలిపారు. ఇందుకుగానూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల నేపాల్‌కు చెందిన పనివాళ్లు ఎంత మంది వున్నారు...? వీరంతా ఎక్కడ వున్నారు...? వీరి గత చరిత్ర ఏమిటీ...? నేపాల్‌లో ఏ ప్రాంతానికి చెందిన వారు...? అనే వివరాలు సమగ్రంగా తయారు చేయాలని డిజిపి ఆదేశించారు.

పోలీసింగ్‌లో సాంకేతికను మరింత వాడాలి

రాష్ట్రవ్యాప్తంగా పోలీసింగ్‌లో సాంకేతికను మరిం తగా వాడాలని డిజిపి ఆదేశించారు. టెక్నాలజి ఆధారిత పోలీసింగ్ ద్వారా కోర్ అప్లికే షన్లు, సిసిటిఎన్ఎస్ 2.0 అమలు, టిజి కాప్స్ వ్యవస్థ వినియోగంపై డిజిపి ఉన్నతాధికారులతో చర్చించి కీలక ఆదేశాలు జారీ చేశారు. డయల్ 100 , రౌడీ షీటర్లపై నిఘా, చోరీ వాహనాల ఆచూకీ కనుగొనడం, హిస్టరీ షీటర్ల డేటా వంటి అంశాలను టెక్నాలజి వాడడం ద్వారా వేగంగా చేబ ట్టవచ్చని డిజిపి తెలిపారు. దీంతో పాటు ఏఐ ఆధారిత పోలీసింగ్, డ్రోన్ల వాడకం, హెచ్‌ఆర్ఎంఎస్ డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ అప్లికేషన్ల విని యోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిజిపి సూచించారు. “తెలంగాణ స్మార్ట్ పోలీసింగ్ యూజింగ్... యూజింగ్ టెక్నాలజి“ అనే లక్ష్యంతో పోలీసులు ముందుకు సాగాలని ఆయన తెలిపారు. మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, వెహికల్ ఆడిట్, సిబ్బంది వినియోగం, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపైనా ఎలా వ్యవహరించాలనే దానిపై డిజిపి సూచనలు చేశారు. భవిష్యత్తులో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు బ్యూరోతో పాటు ఆహార కల్తీ నిరోధకానికి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని డిజిపి పేర్కొన్నారు. ఈ సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, పోలీసు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్, నిఘా విభాగం చీఫ్ విజయ్ కుమార్, టెక్నికల్ సర్వీస్ డిజి శ్రీనివాసరావు, హోంగార్డుల విభాగం డిజి స్వాతి లక్రా, సిటీ కొత్వాల్ సజ్జన్నార్, గ్రే హౌండ్స్ డిజి అనిల్ కుమార్, మల్టీ జోన్ 1 ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కొత్వాల్ డాక్టర్ తరుణ్ జోషి, పి అండ్ ఎల్ ఐజి డాక్టర్ గజారావు భూపాల్, సైబరాబాద్, మల్కాజిగిరి కమి షనర్లు రమేష్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పిఆర్‌సి నివేదిక ప్రకటించాలి

ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచనను విరమించుకోవాలి

టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: జూన్ నెలాఖరులోగా పిఆర్‌సి నివేదిక ప్రకటించాలని, ప్రభుత్వ పాఠశాలలను కుదించాలనే ఆలోచనను విరమించుకోవాలని టియస్‌యుటిఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జూన్ 2 లోపు ఇస్తామన్న పిఆర్సీ నివేదిక ఇంకా విడుదల కాలేదని, కనీసం జూన్ నెలాఖరులోపు పిఆర్‌సి నివేదిక తెప్పించుకొని పిఆర్‌సి ప్రకటించకపోతే జూలైలో పోరాటం చేస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన సోమవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశంలో చావ రవి మాట్లాడుతూ.. ప్రభుత్వం నియమించిన రెండో పిఆర్‌సి 35 నెలలు గడిచినప్పటికీ నివేదిక సమర్పణ కాలేదన్నారు. జూన్ నెలాఖరులోగా నివేదిక అమలు చేయకుండా తాత్సారం చేస్తే జులై నెలలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి.. పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక ప్రైవేటు ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 27 వేల పాఠశాల నుంచి 4 వేల పాఠశాలలకు కుదించాలన్న నిర్ణయం సరైంది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం కలిగించి ప్రభుత్వ బడులను కాపాడాలన్నారు. ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకట్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా స్పెషల్ టెట్ నిర్వహించాలని, క్వాలిఫై మార్క్స్ తగ్గించాలని డిమాండ్ చేశారు.

మీసేవ, టెలిఫోన్ ద్వారా కూడా బుకింగ్

అన్నిరకాల ఎరువులు యాప్ ద్వారా కేంద్రం

సరఫరా: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పారదర్శకంగా ఎరువుల పంపిణీ

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా సకాలంలో, పారదర్శకంగా ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష ్యమని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో యూరియా యాప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలంగాణలో విజయవంతంగా అమలవుతున్న రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు కూడా రూపొందించే దిశగా చర్యలు చేపడుతున్నా యన్నారు. దేశవ్యాప్తంగా ఎరువుల పంపిణీ వ్యవస్థను విస్తరించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ వానాకాలం నుండి పలు రాష్ట్రాల్లోని పైలట్ జిల్లాల్లో కేంద్ర ఎరువుల యాప్ ఎఫ్ఎస్ఎస్‌ను అమలుచేయనుందన్నారు. జిల్లా వారీగా డీలర్ల స్టాక్ నిర్ధారణకు షెడ్యూలింగ్ వ్యవస్థ, మండల మ్యాపింగ్ సదుపాయం, మీ సేవ కేంద్రాలు, టెలిఫోన్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానం, రైతుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఎరువుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితులు తగ్గాయని, రైతులు తమకు అనుకూలమైన సమయంలో ఎరువులు పొందగలుగుతున్నారని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా విషయంలో ఎప్పటికప్పుడు కేంద్రంతో సమన్వయం చేసుకుంటోందన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు 2 లక్షల టన్నుల చొప్పున మొత్తం 6 లక్షల టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశామని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి 3.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా చేరిందన్నారు. మిగిలిన యూరియా కూడా సకాలంలో చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

జనగణనలో కులగణన జరిగితే రాహుల్ తప్పక ప్రధాని

ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: జనగణనలో కులగణన అయితే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారు.. కేంద్రప్రభుత్వం సర్ గెజిట్‌లో మా కులాల పేర్లే లేవనీ వాటిని ప్రకటించకపోతే బిసిలకు వ్యతిరేకం బిజెపి అంటూ ప్రచారం చేస్తామని ప్రభుత్వ సలహాదారు వి.హను మంతరావు అన్నారు. గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీహార్ లో 60శాతం బిసి జనాభా ఉండగా,తెలంగాణ లో 55శాతం ఉందనీ దేశంలో 160కోట్లలో మా జనాభా ఎక్కువుందనీ కానీ సర్ గెజిట్ లో మా కులాల పేర్లే లేవనీ విమర్శించారు. బిసి ఓట్లతో గెలిచిన కిషన్ రెడ్డి బిసి లకు వ్యతిరేకంగా ఉన్నాడనీ ఆరోపించారు. రాహుల్ గాంధీ బిసిలకు అన్యా యం జరుగుతుందని గమనించారనీ సికింద్రాబాద్‌లో కిషన్ రెడ్డికి బిసి ల ఓట్లు ఇక పడవనీ జోస్యంచెప్పారు.రాష్ట్రమంతా తిరిగి బిసి వ్యతిరేకి బిజెపి అని ప్రచారం చేస్తాను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కూడా జనగణనలో కులగణన చెయ్యాలని చెప్పారనీ గుర్తుచేశారు. బిసిలం రాజకీయాల్లోకి పనికిరామా అనిఅడిగారు. రాహుల్ గాంధీ ప్రధాని కాలేరనీ పగటి కల కంటూ ఎక్కువమాట్లాడకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నువ్వు అప్పుడే పెద్దోడివి అయిపోయావా..?అని ప్రశ్నించారు.కేంద్రమంత్రి స్టేట్మెంట్లకే పరిమితం అయ్యాడు, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రమంత్రిగా నీ పాత్ర ఉండదా అని అడిగారు. ఒక్కసారి గెలుస్తావ్ ఇంకోసారి ఓడిపోతావ్, తెలంగాణ లో ఎప్పుడు గెలిచేది కాంగ్రెస్ పార్టీ యే అని అన్నారు. ముఖ్యమంత్రిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రధానమంత్రి మోదీ దగ్గరికి తీసుకెళ్లట్లేదనీ అన్నింటికి ఆయనే అడ్డుపడుతున్నాడనీ ఆవేదన చెందారు. అభివృద్ధికి అడ్డుపడుపడే కిషన్ రెడ్డి ఓటమి కాయమనీ జోస్యం చెప్పారు. బిసి లము ఓట్లేషే మిషన్లమా అగ్రకులాల ఓట్లతోనే బిజెపి గెలుస్తోందా? బిసిలం అవసరం లేదా? బిసిల ఓట్లతోనే కేంద్రంలోనూ బిల్లులు పాస్ అవుతున్నాయనీ అన్నారు.భారతదేశ మొత్తం తిరుగుతాను 60శాతం ఓట్లున్న మేము బిజెపికి బుద్ధి చెప్తా మనీ హెచ్చరించారు. బిసిలం తిరగబడితే బిజెపి ప్రభుత్వం కూలు తుందనీ హెచ్చరించారు. మూడుసార్లు ప్రధానమంత్రి పదవి చేపట్టినా మోడీ బిసి అంటూనే బిసిలకు న్యాయం ఎందుకు చెయ్యట్లేదనీ ప్రశ్నించారు.

బిసి గురుకుల జూనియర్ కాలేజీల అడ్మిషన్ల రెండోదశ మెరిట్ జాబితా విడుదల

10లోగా కాలేజీల్లో చేరాలి

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: రాష్ట్రంలోని బీసీ గురుకుల జూనియర్ కాలేజీల (ఆర్‌జేసీ) అడ్మిషన్లకు సంబంధించి రెండవ దశ మెరిట్ జాబితాను సోమవారం విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు సంబంధించి రెండవ దశ మెరిట్ జాబితాను విడుదల చేసినట్టు బీసీ గురుకుల సొసైటీ ఇన్‌చార్జ్ సెక్రటరీ డాక్టర్ మల్లయ్య బట్టు ఒక ప్రకట నలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తమ ఎంపిక వివరాలను గురుకుల సొసైటీ అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చన్నారు. 10వ తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం సీట్ల కేటా యింపు జరుగుతుందని తెలిపారు. రెండో దశలో ఎంపికైన విద్యార్థులు అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధిత కాలేజీల్లో ఈ నెల 10 వరకు అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మల్లయ్య బట్టు తెలిపారు.

భారీగా పెరిగిన టమోటా ధరలు

కిలో రూ.60కి చేరిన రేటు

వర్షాలతో దెబ్బతిన్న కూరగాయల తోటలు

మరోపక్క పెరిగిన రవాణా ఛార్జీలు

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: దేశంలో మరోసారి టమోటా ధరలు భగ్గుమంటున్నాయి. రుతు పవనాల ప్రభావంతో పలు రాష్ట్రాలలో వర్షాలు పడుతుండటంతో టమోటా సహా కూరగాయల తోటలు దెబ్బతింటుండం, దిగుబడి, రవాణా సమస్యల నేపథ్యంలో వాటి ధరలు పెరిగిపోతున్నాయి. తెలంగాణలో అయితే టమోటా ధరలకు రెక్కలొచ్చాయి. నిత్యం వంటల్లో వాడే టమాటా ధరలు ఒక్కసారిగా భారీగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజల పై పెను భారం పడుతోంది. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ధరలు రెట్టింపు కావడంతో మార్కెట్కు వెళ్లే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. బెంగళూరుతో పాటు దాని చుట్టుపక్కల జిల్లాల్లో గత రెండు వారాలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కూరగాయల పంటలు, ముఖ్యంగా టమాటా తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనికి తగినట్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. ప్రస్తుతం కేజీ టమాటా ధర రూ. 60 పలుకుతోంది. గుడిమల్కాపూర్ మార్కెట్లో రెండు వారాల క్రితం వరకు కిలో రూ. 20 నుంచి రూ.25 పలికిన టమాటా ధర, ఇప్పుడు ఏకంగా కిలో రూ. 40 నుంచి రూ. 55 కి చేరింది. ఇక నాణ్యమైన బెంగళూరు టమాటా ధరలు అయితే ఏకంగా రూ. 80 నుంచి రూ.100 వరకు పలుకుతుండటంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరల్లో టమాటా వేయాలంటేనే భయపడాల్సి వస్తోందని సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఇక గత రెండు వారాల నుంచి బెంగళూరు సహా చుట్టుపక్కల జిల్లాల్లో వానలు పడుతున్నాయి. ఇటు తెలంగాణలో వానలు పడుతుండటంతో టమాటా దిగుబడులపై ఎఫెక్ట్ పడుతుంది. టమాటా సహా కూరగాయల పంటలు దెబ్బతింటూ దిగుబడులు పడిపోతున్నాయి. వానాల కారణంగా ఆకు కూరలు, బజ్జి మిరప, దోస, అనప, కాకర, టమాటా, కొత్తిమీర ధరలు పెరిగాయి. అటు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో రవాణా చార్జీలు కూడా పెరిగాయి. హైదరాబాద్ వచ్చే టమాటాలలో బెంగుళూరు టమాటా కూడా కీలకం కావడంతో క్రమంగా స్థానిక మార్కెట్ లలోనూ టమాటా ధరలకు రెక్కలు వస్తున్నాయి. వానలు మరింత ముదిరితే టమాటా దిగుబడులు పడిపోయి ధరలు మరింత పెరుగవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక మిగిలిన కూరగాయల పరిస్థితి చూస్తే ప్రస్తుతం చిక్కుడు రూ.120, బీరకాయ రూ.105, బెండకాయ రూ.85, పచ్చిమిర్చి రూ.70, వంకాయ రూ.75, గోకర రూ.75, చామగడ్డ రూ.75, దొండకాయ రూ.60, క్యాబేజీ రూ.65, కీర రూ.60, టమాట రూ.54, దోసకాయ రూ.55కి కాస్తా అటుఇటుగా విక్రయిస్తున్నారు.

2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలి

టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య విజ్ఞప్తి

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) వర్తింపజేయాలి లని టీచర్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. డీఎస్సీ 2003 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు బేషరతుగా పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత అభ్యర్థుల డిమాండ్ నెరవేరే వరకు, వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానన్నారు. డీఎస్సీ 2003 నియామక ప్రక్రియ జనవరి 1, 2004 కంటే ముందే ప్రారంభమైనప్పటికీ, పరిపాలనా, విధానపరమైన జాప్యాల కారణంగా పలువురు అభ్యర్థుల నియామకాలు జనవరి 1, 2004 తర్వాత పూర్తయ్యాయని గుర్తుచేశారు. అందువల్లే వారి తప్పేమీ లేకపోయినా వారిని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి తీసుకువచ్చారన్నారు. బాధిత ఉపాధ్యాయుల నిరసనలతో ఏకీభవించి రాష్ట్ర హైకోర్టు కూడా వారి వాదనలను సమర్థించి, 20003 డీఎస్సీ అభ్యర్థులకు ఓపీఎస్ ప్రయోజనాలు కల్పించాలని ఆదేశించినప్పటికీ.. ఆ తీర్పును అమలు చేయకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేయడం విచారకరమని లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ విధానం అమలు చేయాలన్న కోర్టు తీర్పును గౌరవించాలన్నారు. ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అలాగే సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు స్పౌజ్, మ్యూచివల్ బదిలీలు, వేతనాల పెంపు, హెల్త్ కార్డులు, కనీస వేతనాల అమలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు.

విజయ డెయిరీ ముట్టడి

15 నుండి పాల సరఫరా బంద్

బిల్లులు చెల్లించాలని రైతుల డిమాండ్

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విజయ డెయిరీ పరిధిలోని రైతులు ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం హైదరాబాద్‌లోని విజయ డెయిరీ ప్రధాన కార్యాలయాన్ని పాడి రైతులు ముట్టడించారు. బకాయిలు చెల్లించకపోయినట్లయితే పాల సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు. బిల్లుల క్లియరెన్స్‌తో పాటు, ఇతర సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 15వ తేదీ నుంచి పాల సరఫరా నిలిపివేస్తామని అల్టిమేటం జారీ చేశారు. కాగా రైతులకు పాల బిల్లులు చెల్లించడంలో విజయ డెయిరీ తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఈ పాల బిల్లులు ఎప్పుడూ రెండు, మూడు పెండింగ్‌లో ఉంటున్నాయి. టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (టీఐబీ) ఫండ్ పంపిణీలోనూ తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో పాడి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు పాలు పోసే సమయంలో ప్రతి లీటర్‌పైనా రూ.1.50ని విజయ డెయిరీ కట్ చేస్తున్నది. ఆ డబ్బులను తిరిగి జిల్లాలకు తిరిగి పంపిణీ చేయాలి. ఆ డబ్బులతో పశువుల దాణాను రైతులకు సబ్సిడీ ద్వారా అందించాలి. కానీ ఇప్పుడు ఆ ప్రక్రియ ఆగిపోయింది. దీంతో రైతులు పశువుల దాణా కొనుగోలు కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముద్ర, తదితర లోన్ల ద్వారా పశువులను కొనుగోలు చేసిన రైతులు పాలరేట్లు సరిగా లేక, పాల బిల్లులు సకాలంలో అందక పాల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రుణాలు రెగ్యులర్‌గా కట్టడం లేదనే విషయంపై పలు జిల్లాల్లో బ్యాంకు అధికారులు న్యాయపరమైన చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ రేట్లు రోజురోజుకీ పెరిగిపోతుండటంతో మినరల్ మిక్చర్, కాల్షియం, తదితరాల దాణా ఖర్చులు పెరిగిపోయాయి. అయితే విజయ డెయిరీ మాత్రం రైతులకు చెల్లించే పాల ధర రేట్లను మాత్రం పెంచడం లేదని రైతులు చెబుతున్నారు.

టిఎంసి పార్లమెంటరీ పార్టీ చీలిక

ఎన్‌డియేకు మద్దతు, ప్రత్యేకంగా గుర్తించాలి

లోక్‌సభ స్పీకర్‌కు 20 మంది ఎంపిల లేఖ

కోల్‌కతా, జూన్ 8: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత మమతా బెనర్జీ నాయకత్వానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ చీఫ్ విప్ కకోలి ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో 20 మంది లోక్‌సభ

ఎంపిలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియేకు మద్దతు ప్రకటిస్తూ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని నిర్ణయించుకోవడంతో టిఎంసిలో సంక్షోభం మరింత ముదిరింది. ఈ పరిణామం పార్టీ పార్లమెంటరీ విభాగంలో చీలికకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో పార్టీ నాయకత్వానికి ఎదురు దెబ్బ తగిలిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అక్కడ, సీనియర్ నాయకుడు సోవన్‌దేబ్ చటోపాధ్యాయను ప్రతిపక్ష నాయకుడిగా నియమించాలన్న పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని 80 మంది ఎమ్మెల్యేలలో 58 మంది వ్యతిరేకించారు. అంతేకాకుండా, పార్టీ నుంచి బహిష్కరించబడిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ఆ పదవికి ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత టిఎంసిని చుట్టుముట్టిన రాజకీయ అస్థిరత ఇప్పుడు పార్లమెంటరీ స్థాయికి కూడా పాకినట్లు కనిపిస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా దేశవ్యాప్త వ్యూహాన్ని రూపొందించేందుకు ఇండియా కూటమి సమావేశంలో పాల్గొనేందుకు పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఢిల్లీలో ఉన్న సమయంలోనే, అసమ్మతి ఎంపిల బృందం విదీతికు మద్దతు ప్రకటించడం విశేషం.

ఎన్‌డియేకు మద్దతు ఇచ్చే తమ నిర్ణయాన్ని స్పీకర్‌కు తెలియజేసినట్లు ఘోష్ దస్తీదార్ మీడియాకు వెల్లడించారు. "నాతో సహా దాదాపు 20 మంది టిఎంసి ఎంపిలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసి, ఎన్‌డియేకు అధికారికంగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాము" అని ఆమె పేర్కొన్నారు. లోక్‌సభలో పార్టీకి తానే చెల్లుబాటు అయ్యే చీఫ్ విప్‌గా కొనసాగుతున్నానని, పార్టీ నాయకత్వం ప్రకటించిన తదుపరి మార్పులు అవసరమైన పార్లమెంటరీ విధానం ద్వారా పూర్తి కాలేదని స్పీకర్ ముందు వాదించాలని అసమ్మతి ఎంపిలు భావిస్తున్నట్లు సమాచారం.

కాలపరిమితితో పాలమూరు ప్రాజెక్టులకు కార్యాచరణ

సౌరశక్తి వినియోగంతో ఎత్తిపోతల విద్యుత్ వ్యయాల తగ్గింపు అధ్యయనం

ఫాస్ట్‌ట్రాక్ ఎగ్జిక్యూషన్ మోడ్‌లోకి కీలక ప్రాజెక్టులు

సిఎం సాగునీటి పర్యటనలో తీసుకున్న కీలక నిర్ణయాలపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్, జూన్ 8: మహబూబ్‌నగర్ జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రాజెక్టు వారీగా కాలపరిమితితో సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సౌరశక్తితో ఎత్తిపోతల విద్యుత్ వ్యయాలను తగ్గించేందుకు తగిన అధ్యయనం చేయాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఈనెల 4,5 తేదిల్లో మహబూబ్‌నగర్ పర్యటనలో సిఎం పరిశీలించిన ప్రాజెక్టులపై సమీక్ష చేశారు.నీటిపారుదల సామర్థ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా సంప్రదాయేతర విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా ప్రధాన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల దీర్ఘకాలంలో నిర్వహణ వ్యయాలు తగ్గడానికి పర్యావరణ హితంగా ఉంటాయనీ ఆయన అభిప్రాయపడ్డారు.

భూసేకరణ, పునరావాసం, భూనిర్వాసితుల జీవనోపాదుల కల్పన వేగవంతం చేయాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల విద్యుత్, కాంట్రాక్టర్ పనితీరుకు సంబంధించిన అన్ని అడ్డంకులను పరిష్కరించడానికి అత్యంత ప్రాధన్యత అంశంగా తీసుకోవాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి అన్నారు. ప్రాజెక్టల్‌లోని ప్రతి ప్రధాన కాంపోనెంట్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌లను సమర్పించాలని ఆయన చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు భూసేకరణను వేగవంతం చేయాలని నిర్వాసిత కుటుంబాలకు పునరావాస ప్యాకేజీలు జాప్యం లేకుండా చేరేలా చూడాలని కోరారు.మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మార్చి 2027 వరకుమోటార్లు అన్ని పనిచేయాలని పంపింగ్ స్టేషన్ల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని,ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

నార్లాపూర్ రిజర్వాయర్ కింద కాలువ పనులు చేపట్టడంతోపాటు, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తో సహ మొత్తం ప్రాజెక్టును 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్ధేశించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లాపూర్, ఏదుల, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల వల్ల నిర్వాసితులైన కుటుంబాలకు పునరావాసంతోపాటు డిసెంబర్ 2026 నాటికి కరివెన రిజర్వాయర్ వరకు మెయిన్ ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను పూర్తి చేయాలని సూచించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం పంప్ హౌస్‌లకు తక్షణమే విద్యుత్తు అనుసంధానం చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు.

మక్తల్‌నారాయణపేటకొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కోసం అవసరమైన దాదాపు 2,200 ఎకరాల సేకరణ ప్రక్రియను జూలై 2026 నాటికి ప్రారంభించాలని లక్ష్యం నిర్ధేశించారు. రాజీవ్ భీమా, కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలురాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను సమీక్షించిన మంత్రి, స్టేజ్1 పనులకు అవసరమైన మిగిలిన 80 ఎకరాల సేకరణను జూలై 2026 నాటికి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కోయిల్‌సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి అవసరమైన మిగిలిన 167 ఎకరాల సేకరణ ప్రక్రియను మార్చి 20 నాటికి పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

జవహర్ నెట్టంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద అదనంగా 58 వేల ఎకరాలకు సాగునీటిని అందించడానికి అవసరమైన 534 ఎకరాల సేకరణను వేగవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఆర్‌డిఎస్, తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఫేజ్2 కోసం 567 ఎకరాల భూమి సేకరణ చేసి వెంటనే నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభించాలని అన్నారు.

రేవంత్‌రెడ్డి ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు బయటపడ్డాయి

కేరళం మాజీ సిఎం విజయన్ ట్వీట్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8: హైడ్రాపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేరళం మాజీ సిఎం పినరయి విజయన్..ఎక్స్ వేదికగా స్పందించారు, రేవంత్ రెడ్డి తన హైడ్రాకు హిట్లర్ స్ఫూర్తి అని గర్వంగా ఒప్పుకోవడం దిగ్భ్రాంతికరం. ఇది ఆయన ఆర్‌ఎస్‌ఎస్ మూలాలను, ఫాసిస్ట్ మనస్తత్వాన్ని బట్టబయలు చేస్తుంది. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలి అని ట్వీట్ చేశారు. దీంతో ఎన్నికల వేళ రేవంత్ రెడ్డి, పినరయి విజయన్ మధ్య చెలరేగిన రాజకీయ మాటల యుద్ధం ఇంకా చల్లారలేదు అని అర్థం అవుతోందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే రేవంత్ రెడ్డి హైడ్రాను ఉద్దేశించి చేసిన హిట్లర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు సమర్థిస్తున్నారు.

10న కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు

పెట్రోల్, డీజల్, గ్యాస్, ధరలను వెంటనే తగ్గించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: పెంచిన పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బిజెపి పాలనలో సామాన్యుడి బతుకు భారంగా మారిందని, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు పప్పులు, నూనెలు, కూరగాయల వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈ నెల 10వ తేదీన నిరసన ధర్నాలు చేపడుతున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చే దిన్ వస్తాయని చెప్పి, సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నారని, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తుందన్నారు.

19 నుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

జూలై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు

ఆగస్టు 1 నుంచి క్లాసులు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్‌ను ఈ నెల 19 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 22 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభిస్తారు. జులై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. ఆగస్టు 1 నుంచి క్లాసులను ప్రారంభించాలని నిర్ణయించారు. ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించారు. మొదటిసారిగా కన్వీనర్ కోటా (కేటగిరీ-ఏ)సీట్ల కౌన్సెలింగ్‌తోపాటు మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరీ-బీ) సీట్ల కౌన్సెలింగ్ ఒకేసారి నిర్వహించబడుతుందని అధికారులు ప్రకటించారు. ఎప్ సెట్-2026 అడ్మిషన్ల కమిటీ సమావేశం సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగింది. కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన సమావేశం జరగగా.. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్ శ్రీదేవసేన, ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం అనంతరం ఎప్ సెట్-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను జారీ చేశారు. ఈ నెల 19 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించి స్లాట్ బుక్‌చేసుకోవాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తారు. ఈ నెల 25 నుంచి జులై 1 వరకు విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. జులై 4న మాక్ సీట్ అలకేషన్‌ను చేస్తారు. జులై 5 నుంచి 7 వరకు మాక్ సీట్ అలకేషన్‌లో మోడిఫికేషన్‌కు అవకాశం కల్పించారు. జులై 10న మొదటి విడత సీట్ల కేటాయింపు చేస్తారు. జులై 10 నుంచి 14 వరకు విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ జులై 17న ప్రారంభిస్తారు. జులై 18న సర్టిఫికెట్ వెరిఫికేషన్. జులై 18, 19 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం. సీట్ల కేటాయింపు జులై 22లోపుగా చేస్తారు. జులు 22 నుంచి 24 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కి అవకాశం కల్పించారు. జులై 25 నుంచి 28 వరకు కాలేజీల్లో నేరుగా చేరాల్సి ఉంటుంది. జులై 28 సీటు రద్దు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. కాలేజీలు తమ కాలేజీల్లో చేరిన విద్యార్థుల వివరాలను జులై 29న ప్రకటించాల్సి ఉంటుంది. జులై 31న ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్, ఆగస్టు 1 సర్టిఫికెట్ వెరిఫికేషన్. ఆగస్టు 1, 2 తేదిల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఆగస్టు 5లోపుగా ఫైనల్‌ఫేజ్ సీట్ల కేటాయింపు చేస్తారు. ఆగస్టు 5 నుంచి 7 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 8న కాలేజీలు విద్యార్థుల వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఇంటర్నల్ స్లైడింగ్‌కి ఆగస్టు 12, 13 తేదిల్లో అవకాశం కల్పించారు. ఆగస్టు 15లోపుగా సీట్ల కేటాయింపు చేస్తారు. ఆగస్టు 16, 17 తేదిల్లో స్లైడింగ్‌లో పొందిన సీటులో రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఏపీసీఈ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఆగస్టు 1 నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్టు కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో ప్రకటించారు.

బల్దియా ఎన్నికల కోసమే బిజెపిపై రేవంత్‌రెడ్డి బురద

మీడియాతో చిట్‌చాట్‌లో

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8: రాబోయే బల్దియా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజెపిని టార్గెట్ చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బల్దియాలో ఎన్నికలలో బిజెపి బలం ఏమిటో ముఖ్యమంత్రికి బాగా తెలుసు కాబట్టే, ఈ మధ్య పొద్దున లేస్తే బిజెపిపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఫిలిమ్ నగర్ కల్చరల్ క్లబ్‌లో సోమవారం కిషన్‌రెడ్డి మీడియా సమావేశం అనంతరం ఆయన చిట్ చాట్ చేశారు. తెలంగాణ పట్ల కేంద్రం ఎలాంటి వివక్ష చూపకపోయినప్పటికీ రాజకీయ కోణంలోనే సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని అన్నారు. నిన్నటికి నిన్న ఉత్తర తెలంగాణ జిల్లాలకు రోడ్ల విస్తరణతో పాటు వివిధ ప్రాజెక్టులకు వేలాది కోట్లు ఇచ్చిందని, అంతకు ముందు ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా దాదాపు పది వేల కోట్ల వ్యయం చేసే ప్రాజెక్టులకు నిధులు ప్రకటించారని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు.

ఒక్క నెల రోజుల వ్యవధిలో కేంద్రం తెలంగాణకు రూ. 20 వేల కోట్ల మేరకు వివిధ ప్రాజెక్టులకు నిధులు ప్రకటించిందని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. దొడ్డు వడ్ల బియ్యాన్ని ఎవరు తినడం లేదనే పౌర సరఫరాల శాఖ ద్వారా సన్న బియ్యం ఇస్తున్నామని ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం చెబుతూనే, కేంద్రాన్ని దొడ్లు వడ్లు కొనాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఎవరు తినని దొడ్డు వడ్లను కేంద్రం మాత్రం కొని ఏమి చేసుకోవాలని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కేంద్రం ధాన్యం కొనుగోలు చేయడం లేదని విమర్శించే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్నవడ్లకు ఇస్తామన్న రూ. 500 బోనస్సు మాత్రం ఇవ్వడం లేదన్నారు.

ఏదో ఆరంభశూరత్వంగా గొప్పగా బోనస్సు ఇస్తామని ప్రకటించి ఆ తర్వాత ఎగబెట్టిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో బిజెపి ఒంటరిగానే పోటి చేస్తుందా? అని మంత్రిని అడిగిన ప్రశ్నకు పక్కనే ఉన్న బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు స్పందిస్తూ, ఆ విషయంలో ఇప్పటికీ అదేమాట మీద ఉన్నామన్నారు. అయితే అంతిమంగా తమ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడక తప్పదన్నారు. పార్టీలు మారడంలో, ఢిల్లీకి డబ్బుల సంచులు మోయడంలోనూ, ప్రజలను తప్పుదోవ పట్టించడంలోనూ రేవంత్‌రెడ్డికి మించినవారు లేరని కిషన్‌రెడ్డి వ్యంగ్యంగా అన్నారు.

మృగశిర ఎఫెక్ట్.. కళకళ్లాడిన చేపల మార్కెట్లు

భారీగా ధర పెంచేసిన వ్యాపారులు

అదనంగా రూ.100 నుండి రూ.300 వరకూ పెంపు

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: మృగశిర కార్తె రోజున చేపలు తినడం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక ఆనవాయితీగా వస్తోంది. ఈ రోజున చేపలు తింటే ఆస్తమా, శ్వాసకోశ సమస్యలు దూరమవుతాయని, ఆరోగ్యం బాగుంటుందని ప్రజల బలమైన నమ్మకం. దీంతో మృగశిర కార్తె ప్రవేశించిన సోమవారం చేపల మార్కెట్లలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. దీంతో వ్యాపారులు సాధారణ రోజుల కన్నా రెట్టింపు ధరలకు పెంచి విక్రయించారు. చేపల మార్కెట్లకు ఆదివారం నుండి రద్దీ పెరిగింది. మృగశిర పర్వదినం సందర్భంగా స్థానిక చేపల మార్కెట్లలో కొనుగోలుదారుల తాకిడి ఎక్కువగా ఉండి కిటకిటలాడాయి. మార్కెట్ అంతటా కొనుగోలుదారుల సందడి నెలకొంది. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. ఉదయం నుంచే ప్రజలు వచ్చి చేపలు కొనుగోలు చేస్తున్నారు.

పెద్ద చేపలకు కూడా మంచి ఆదరణ లభించింది. దీంతో చేపలకు భారీ డిమాండ్ ఏర్పడింది. హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ చేపల మార్కెట్లు కిక్కిరిసిపోయాయి. నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డుతో పాటు, సూర్యాపేటలోని చేపల మార్కెట్, ఖమ్మం బొమ్మ, కుడకుడ రోడ్లలోని చేపల విక్రయ కేంద్రాలలో మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం ఒకరోజు ముందుగానే సందడి నెలకొన్నది. హైదరాబాద్‌లోని రాంనగర్,

ముషీరాబాద్ వంటి ప్రముఖ మార్కెట్లలో టన్నుల కొద్దీ చేపలు అమ్ముడయ్యాయి. రవ్వ, బొచ్చె తదితర రకాల నాటు చేపలు మొదలుకొని, కొరమీను, రొయ్యలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల సాధారణ రోజులతో పోలిస్తే చేపల ధరలు భారీగా పెరుగుతాయి. సాధారణంగా కిలో రూ.120 నుండి రూ.130 ఉండే రవ్వ చేపలు రూ.230 నుండి రూ.350 వరకు, రూ.450 ఉండే కొరమీను రూ.650 పైబడి పలికాయి. బొమ్మ చేపను రూ.450 చొప్పున విక్రయించారు. అరకిలో నుంచి ఐదు కిలోల వరకు బరువున్న చేపలను వ్యాపారులు మార్కెట్‌కు తీసుకువచ్చారు. చేపల కోసం ప్రజలు పోటీపడి కొనుగోలు చేయడంతో వ్యాపారులు కూడా మంచి అమ్మకాలు జరిగాయని ఆనందం వ్యక్తం చేశారు.

పంటల్లో వైవిధ్యం అనివార్యం

నీటి వనరుల రక్షణే ధ్యేయం

వరికి బదులు లాభదాయక ప్రత్యమ్నాయం

సుస్థిర సాగుకు తప్పని పంటల మార్పిడి

ప్రభుత్వానికి రైతు సంక్షేమ కమిషన్ నివేదిక

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: ఈ యేడాది ఖరీఫ్ సీజనులో రైతులకు మరింత కష్టాలు ఎదురయ్యే పరిస్థితులు తలెత్తనున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పులు పంటల సాగుకు ముప్పును కలించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎన్‌లినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజనులో వర్షా భావ పరిస్థితులు ఏర్పడనున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ నీటిని వినియోగించే పంటలకు బదులు ప్రత్యమ్నాయ పంటలవైపు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ సైతం సూచించింది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు సంబంధించి రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఒక నివేదికను రూపొందించి ప్రభుత్వానికి తాజాగా సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం రాష్ట్రంలో వ్యవసాయం సుస్థిరంగా ఉండాలంటే రైతులు తాము పండించే పంటలను వైవిధ్యపరచాలి. వరి సాగు నుండి వైదొలగే ఈ మార్పును ప్రోత్సహించడానికి ప్రభుత్వ మద్దతు అవసరమని, దీనివల్ల నీటి వనరులను పరిరక్షించడం కూడా సాధ్యమవుతుంది. పంటల వైవిధ్యీకరణపై ప్రభుత్వానికి సమర్పించిన కమిషన్ నివేదిక, రైతులు వరి పంటకు అధికంగా ప్రాధాన్యత ఇవ్వడానికి గల కారణాలలో కనీస మద్దతు ధర హామీ అని పేర్కొంది. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సాగు విస్తీర్ణం 2013-14లో 49,28,000 ఎకరాల నుండి 2024-25 నాటికి 1,27,03,000 ఎకరాలకు పెరిగింది. దీనికి అదనంగా, రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు బోనస్ ఇస్తామని కూడా వాగ్దానం చేసింది. దీంతో రైతులు వీటినే అత్యధికంగా సాగు చేస్తున్నారు.

రాష్ట్రంలో వరి, పత్తి రెండు ప్రధాన పంటలుగా ఆవిర్భవించినప్పటికీ, దీర్ఘకాలంలో వాటిపై ఆధారపడటం ఆర్థికంగా గానీ, పర్యావరణపరంగా గానీ సుస్థిరం కాదు. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యవసాయం దారి తప్పిందని ప్రకటిస్తూ, వరి నుండి ప్రత్యామ్నాయ పంటలకు మారడం వల్ల నీటి సంరక్షణ కూడా సాధ్యమవుతుందని, అలాగే ప్రత్యామ్నాయ పంటలకు లాభదాయకమైన ధరలు లభించడం ద్వారా రైతులు లబ్ధి పొందగలరని నివేదికలో స్పష్టం చేసింది.

రాష్ట్ర స్థాయి ధరల నిర్ధారణ కమిటీ సిఫార్సుల ఆధారంగా చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలకు కనీస మద్దతు ధరను ప్రకటించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపింది. ఒక సీజన్‌లో వరి పండించాలనుకునే రైతులను తర్వాతి సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటకు మారేలా ప్రోత్సహించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి ప్రణాళిక వాతావరణ, నీటి, నేల పరిస్థితుల ఆధారంగా ప్రభుత్వం ఒక జిల్లాకు ఒక ఉత్పత్తి విధానాన్ని ప్రవేశపెట్టి, ఆయా జిల్లాలకు అత్యంత అనువైన పంటను పండించడంపై దృష్టి పెట్టేలా రైతులను ప్రోత్సహించాలి.

పాత సింగరాయకొండ బావిలో లభ్యమైన మృతదేహం

హైదరాబాద్‌లో బిటెక్ విద్యార్థి రాహుల్‌గా గుర్తింపు

ర్యాగింగ్ అనుమానాలు.. రాహుల్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు

సింగరాయకొండ, జూన్ 8, ప్రభాతవార్త: మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలో వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన పూలతోటలోని వాడుకలో లేని బావిలో ఇటీవల లభ్యమైన గుర్తుతెలియని యువకుడి మృతదేహం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి రాహుల్‌గా మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించినప్పటికీ, డీఎన్‌ఏ పరీక్షల అనంతరమే పూర్తి నిర్ధారణకు వచ్చే అవకాశ ముందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రాహుల్ హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 27న ఇంటికి వెళ్తున్నానని చెప్పి స్నేహితుడు బైక్ మీద కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులైన ఇంటికి రాకపోతే అంత గాలించి ఎక్కడ ఆచూకీ కనపడక పోవడంతో మే 31 కాచిగూడ పోలీస్ స్టేషన్ లో తండ్రి రాజేష్ పిర్యాదు చేయడం తో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనితో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రైల్వే స్టేషన్‌లో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించినట్లు సీసీటీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. ఇదిలా ఉండగా, మే 30న సింగరాయకొండలోని స్వామివారి తోట బావిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభించింది. మృతుడి వద్ద ఉన్న ఎర్రటి టీషర్ట్, మెడలోని ఆంజనేయస్వామి లాకెట్ తదితర ఆధారాలను పోలీసులు సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రచారం చేశారు. ఈ సమాచారం రాహుల్ కుటుంబ సభ్యులకు చేరడంతో వారు సింగరాయకొండకు వచ్చి ఆధారాలను పరిశీలించి మృతుడిని తమ కుమారుడిగా గుర్తించారు. సోమవారం తెలంగాణ, సింగరాయకొండ పోలీసులు కుటుంబ సభ్యులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన బావితో పాటు ఖననం చేసిన ప్రదేశాన్ని కూడా వారికి చూపించారు.

ర్యాగింగ్ కోణంపై కుటుంబసభ్యుల అనుమానం..

రాహుల్ తండ్రి అంకం రాజేష్ మాట్లాడుతూ, తన కుమారుడు హాస్టల్ నుంచి అదృశ్యమైన తర్వాత మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. వందల కిలోమీటర్ల దూరంలోని సింగరాయకొండకు రాహుల్ ఎలా చేరుకున్నాడనే విషయంపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఇది ఆత్మహత్యా, హత్యా అన్నది తేల్చాలని, కాలేజీలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని పోలీసులను కోరారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ మే 30న బావిలో గుర్తించిన మృతదేహాన్ని యువనేస్తం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం, ఫోరెన్సిక్ అనంతరం ఖననం చేసినట్లు తెలిపారు.

మృతుడి వద్ద లభించిన ఆధారాల ఆధారంగా ప్రచారం చేయడంతో కుటుంబ సభ్యులు స్పందించారని చెప్పారు. మృతదేహం వద్ద లభించిన టీషర్ట్, లాకెట్ తదితర వస్తువులను కుటుంబ సభ్యులకు చూపించగా, వారు రాహుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. మృతికి గల కారణాలపై ఆత్మహత్య, హత్యతో పాటు ఇతర అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

సిఎం రేవంత్ హిట్లర్ కన్నా ఎక్కువ: కల్వకుంట్ల కవిత

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 8: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్ మాత్రమే కాదు అంతకన్నా ఎక్కువ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఆడపిల్లలు, పేదలకు చదువును దూరం చేస్తున్న ఆయన తాలిబాన్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదిస్తామన్న సిఎం రేవంత్ రెడ్డిపై ఆమె ఫైర్ అయ్యారు. తాలిబాన్‌లు ఆడబిడ్డలకు చదువు దూరం చేశారని.. అదే తరహాలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ స్కూళ్లను మూసేసి ఆడపిల్లలు, పేదలకు చదువులు అందకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27 వేల స్కూళ్లలో పని చేస్తున్న 3 లక్షలకు పైగా ప్రభుత్వ టీచర్లను ఏం చేస్తారో చెప్పాలని నిలదీశారు. క్రమేణ విద్యను పేదలకు దూరం చేసి ప్రైవేటీకరించడానికి సిఎం తెరతీస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖపై రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారని ఆరోపించారు. స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ వరకు అన్నింటా వైఫల్యాలే అని పేర్కొన్నారు. విద్యాశాఖను రేవంత్ రెడ్డి సర్కస్ లెక్క మార్చేశారని విమర్శించారు. ఈ యేడాది నుంచే ఇంటర్మీడియట్ ఉండదు.. ప్లస్ 2 విధానం తెస్తానని సిఎం ప్రకటించిన మరుసటి రోజే ఇంటర్ బోర్డు అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు.

కాంగ్రెస్‌ది హిట్లర్ మనస్తత్వం

ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ కోసం

రేవంత్ కార్యాలయం నుంచి అభ్యర్థన వెళ్లలేదు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ మనస్తత్వమే హిట్లర్ మనస్తత్వమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాల యంలో మీడియాతో మాట్లా డారు. రాజ్యాంగం, రా జ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వా మ్య సంస్థల మీద కాంగ్రెస్ పార్టీకి నమ్మకం లేదని, అందుకే ఇందిరా గాంధీ ఆనాడు దేశంలో ఎమర్జెన్సీ విధించారని అన్నారు. ఈరోజు కూడా కాంగ్రెస్ పార్టీని ఒకే కుటుంబం నడుపుతుందని, అధ్యక్షుడు ఎవరైనా కావచ్చు, కానీ నిర్ణయాలు మాత్రం ఒకే కుటుంబం చుట్టూ

తిరుగుతున్నాయన్నారు. అదే నియంతృత్వ ధోరణిని తెలంగాణలో కూడా అమలు చేయాలని చూస్తున్నారి అన్నారు. కాంగ్రెస్ పార్టీ హిట్లర్ మనస్తత్వంతో వ్యవహరిస్తుందని, వారి తీరు చూస్తే 'జో హిట్లర్ కి చాల్ చలేగా, ఓ హిట్లర్ కి మోత్ మరేగా' అనే నినాదం గుర్తుకు వస్తుందన్నారు. ఓబిసి వర్గానికి చెందిన ప్రధానమంత్రి, గిరిజన మహిళ అయిన రాష్ట్రపతికి గౌరవం ఇవ్వడం కూడా ఇబ్బందిగా భావించడం సరైంది కాదన్నారు. మోడీ సభ విజయవంతమైన తర్వాత వచ్చిన నివేదికలతో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడుతోందనే విషయం కాంగ్రెస్‌కు స్పష్టమైంది. అందుకే బిజెపిపై అసహనం, ఆందోళన పెరిగింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఫుడ్ గ్రెయిన్స్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా సేకరించిన ధాన్యంలో 104.41 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటే, అందులో తెలంగాణ నుంచే 55.31 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించబడ్డాయి. అంటే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యంలో సగానికి పైగా తెలంగాణ నుంచే ఉంది. ఎంఎస్పీ కింద దేశవ్యాప్తంగా రైతులకు చెల్లించిన మొత్తం సుమారు రూ.21,243 కోట్లు కాగా, అందులో తెలంగాణ రైతులకు మాత్రమే రూ.13,171 కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయి. ఎంఎస్పీ ప్రయోజనం పొందిన రైతుల సంఖ్య దేశవ్యాప్తంగా 11.69 లక్షల మంది కాగా, అందులో 7,79,358 మంది తెలంగాణ రైతులే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ విషయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారు. నేను స్వయంగా ఫడ్నవీస్ కార్యాలయానికి ఫోన్ చేశాను. నెల రోజుల క్రితం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తరఫున ఏదో ఒక అభ్యర్థన వెళ్లిందని చెప్పారు. కానీ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అపాయింట్‌మెంట్ అభ్యర్థన రాలేదని స్పష్టం చేశారు.

యూరియా కొనుగోలుపై దృష్టి

రాష్ట్రంలో 2.15 లక్షల టన్నుల నిల్వలు

జిల్లాలకు 18 నుండి 23 వేల టన్నుల కేటాయింపు

హైదరాబాద్, జూన్ 8, ప్రభాతవార్త: రాష్ట్రంలో వానాకాలం సీజను ప్రారంభమైన నేపథ్యంలో రైతులు యూరియా కొనుగోళ్లపై దృష్టిసారించారు. రానున్న రోజుల్లో యూరియాకు కొరత, సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశ్యంతో పంటల సాగు చేపట్టకుండానే యూరియాను కొనుగోలు చేస్తున్నారు. తొలకరి జల్లు కురిసిన తరువాత కొనుగోలు చేయాలంటే కొరత వస్తుందని ముందుగానే నిల్వలు సిద్ధం చేసుకుంటున్నారు. గత వానాకాలం, యాసంగి సీజన్లలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని చేతిలో డబ్బులు లేకపోయినా, అప్పులు తెచ్చి మరీ యూరియాను ఫెర్టిలైజర్స్ యాప్‌లో బుక్ చేసుకుని తద్వారా కొనుగోలు చేస్తూ వాటిని ఇంట్లో భద్రపరుచుకుంటున్నారు. విత్తనాలు వేసే సమయంలో కొనుగోలు చేయాలంటే అంతా ఎగబడటంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగి రద్దీ ఏర్పడుతుందని పలువురు రైతులు భావిస్తున్నారు. అంతే కాకుండా ఒకటి రెండు రోజులు క్యూలైన్లలో నిలబడి అవస్థలు పడాల్సి వస్తోందని అంటున్నారు. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో 2.15 లక్షల టన్నులు యూరియా నిల్వలు ఉండగా, ఆయా జిల్లాలకు 18 వేల టన్నుల నుంచి 23 వేల టన్నుల వరకు జిల్లాలను బట్టి వ్యవసాయ శాఖ కేటాయింపులు చేసింది. యూరియా రాగానే రైతులు కొనుగోలు మొదలు పెట్టారు. గత వారంరోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూరియా నిల్వలలో 1.24 లక్షల టన్నులు కొనుగోలు జరిగింది.

నాలుగైదు రోజుల నుంచి పెద్దసంఖ్యలో రైతులు తీసుకుంటున్నారు. మే, జూనెలలకు కేంద్రం కేటాయించిన 4 లక్షల టన్నుల యూరియా దిగుమతి అయితే రైతులందరికీ పంపిణీ చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఇప్పటివరకు మే నెలకు రాష్ట్రానికి రావాల్సిన 2 లక్షల టన్నులు యూరియా పూర్తిస్థాయిలో రాలేదు.

మూడు రోజుల్లోనే ఖేల్ ఖతమ్

ఇన్నింగ్స్ 300 రన్స్‌తో ఘన విజయం *ఏకైక టెస్ట్ సిరీస్ భారత్ కైవసం

స్పిన్‌కు అఫ్ఘానిస్థాన్ విలవిల *డెబ్యూ టెస్ట్‌లోనే మానవ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్

న్యూచండీఘర్, జూన్ 8: ముల్లన్‌పూర్ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో టీమిండియా అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో చెలరేగుతూ క్రికెట్ కూనను దెబ్బ తీసింది. ఏకంగా ఇన్నింగ్స్ 300పరుగుల తేడాతో ఘన విజయం అందుకుని చరిత్ర సృష్టిం చింది. టెస్ట్‌ల్లో భారత్‌కిదే అత్యంత భారీ విజయం. భారత్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌటై ఫాలోఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ మరింత ఘోరంగా 112 పరుగులకే కుప్పకూలింది. ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసింది. ఏకైక టెస్ట్ సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది.

మానవ్ స్పిన్ ఉచ్చుకు ఆఫ్ఘనిస్థాన్ విలవిల

ఓవర్‌నైట్ స్కోరు అయిదు వికెట్ల నష్టానికి 113 పరుగులతో మూడో రోజు ఆటను కొనసాగించిన ఆఫ్ఘనిస్థాన్.. భారత బౌలర్ల ముందు క్రీజ్‌లో నిలవలేకపోయారు. టాప్ ఆర్డర్ లాగే మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చేతులెత్తేవారు. లంచ్‌కు ముందే ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్‌లో 152 రన్స్‌కు ఆలౌటైంది. అజ్మతుల్లా ఓమర్‌జాయ్‌ను ఆరంభంలోనే డకౌట్‌గా ప్రసిద్ధ్ కృష్ణ పెవిలియన్‌కు పంపాడు. డెబ్యూ బౌలర్ మానవ్ సుతార్ చక్కని స్పిన్‌తో షరఫుద్దీన్(11)ను ఔట్ చేశాడు. ఇక 43 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన రహత్ షా(135 బంతు ల్లో 60) అర్ధసెంచరీ పూర్తిచేశాడు. చివరకు అతన్ని మానవ్ సుతార్ క్లీన్ బౌల్డ్ చేశాడు. అదే ఊపులో సలీమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని ఎల్బీగా ఔట్ చేశాడు. రహ్మద్‌ను వాష్టింగ్టన్ సుందర్ అవుట్ చేయడంతో ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. భారత స్పిన్నర్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. ప్రసిధ్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు.

ఫాలోఆన్‌లోనే చతికిల

తొలి ఇన్నింగ్స్‌లో 412 పరుగులు వెనకబడ్డ ఆఫ్ఘనిస్తాన్‌ను టీమిండియా ఫాలోఆన్ ఆడించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. తొలి వికెట్ కు 42 పరుగులు జోడించాక పతకం మొదలైంది. మహ్మద్ సిరాజ్... ఓపెనర్ మాలిక్(8)ను ఔట్ చేసి ఆఫ్ఘన్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. ముగింపు బాధ్యత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్ తీసుకున్నారు. వీరి స్పిన్ బంతులను ఆడలేక ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్ అటల్ (42), గుర్బాజ్ (24) మాత్రమే కాస్త క్రీజ్‌లో నిలిచారు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌ను కేవలం 35.3 ఓవర్లలో 112 రన్స్ చేసి ఆలౌట్ చేశారు. మూడో రోజు ఆటలో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు. మూడోరోజుఆటలో ఏకంగా 14వికెట్లు పడ్డాయి. డెబ్యూ టెస్ట్‌లోనే ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి మానవ్ సుతార్ అరుదైన ఘనత అందుకున్నాడు.

స్కోర్ బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 564/8 (శుభ్‌మన్ గిల్ 126, కేఎల్ రాహుల్ 100); **ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 152 ఆలౌట్(58.4 ఓవర్లలో)** (రషమత్ షా 60, మానవ్ సుథార్ 6/33); **ఆఫ్ఘని స్థాన్ రెండో ఇన్నింగ్స్(ఫాలోఆన్): 112 ఆలౌట్(35.5 ఓవర్లలో)** (అటల్ 42, వాషింగ్టన్ సుందర్ 4/36, కుల్‌దీప్ 3/30)

ఫలితం: భారత్ ఇన్నింగ్స్ 300రన్స్ విజయం

93 యేళ్లలో ఇదే ఫస్ట్

ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో నెగ్గిన గిల్ సేన అరుదైన ఘనతను ఖాతాలో వేసుకుంది. 93 ఏళ్ల కిందట మొదలైన భారత టెస్ట్ ప్రయాణంలో.. న్యూ చండీగర్ లోని ముల్లన్‌పూర్‌లో సాధించిన ఈ విజయం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. భారత్ చరిత్రలోనే ఇదే అత్యంత అతి పెద్ద విజయం. ఆఫ్ఘనిస్థాన్‌ను ఫాలోఆన్ ఆడించి మరీ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఓడించి టీమిండియా ఈ నయా రికార్డును సెట్ చేసింది.

టెస్ట్ క్రికెట్‌లో భారత్ టాప్-5 విజయాలు

2026: ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 రన్స్ విజయం
2018: వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 272 రన్స్ గెలుపు
2018: ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 262 రన్స్ విజయం
2007: బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ 239 రన్స్ గెలుపు
2017: శ్రీలంకపై ఇన్నింగ్స్ 239 రన్స్ విజయం

విండీస్‌పై వామప్ మ్యాచ్‌లో టీమిండియా మహిళల విక్టరీ

కార్డిఫ్, జూన్ 8: మహిళల టీ20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 26 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత విమెన్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 179పరుగులు చేయగా.. విండీస్ 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 153రన్స్‌కే పరిమితమైంది. భారత ఇన్నింగ్స్‌లో భారతి ఫుల్మాలి (56 నాటౌట్) అర్ధ సెంచరీతో రాణించగా.. షఫాలీ వర్మ (29), స్మృతి మంధన (39), యస్తికా భాటియా (36) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. మిగతా ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్ (7), రిచా ఘోష్ డకౌట్, రాధా యాదవ్ (1), శ్రేయాంక పాటిల్ (2), క్రాంతి గౌడ్ (4)నిరాశ పరిచారు. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్ 4 వికెట్లతో సత్తా చాటగా.. కరిష్మ రామ్హరాక్, ఆలియా అలెన్, డియాండ్రా డొట్టిన్ తలో వికెట్ తీశారు.

అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో ఓపెనర్లు డొట్టిన్ (49), షెర్మైన్ క్యాంప్‌బెల్ (25) శుభారంభం అందిచారు. అయితే రాణించిన శ్రేయాంక పాటిల్ నాలుగు వికెట్లు, రాధా యాదవ్ మూడు వికెట్లు తీసి కట్టడిచేశారు. దీంతో విండీస్‌కు ఓటమి తప్పలేదు. భారత్ జూన్ 10న ఇంగ్లండ్‌తో మరో వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

భారత్, ఇంగ్లండ్ సిరీస్ వేళల్లో మార్పు

లీడ్స్: భారత్‌తో జరుగబోయే 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ వేళల్లో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు మార్పులు చేసింది. బ్రాడ్‌కాస్టర్లతో చర్చల అనంతరం మ్యాచ్‌లను సాయంత్రం 5.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు) ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణం భారత ప్రేక్షకులే. భారత్‌లో క్రికెట్‌కు ఉన్న విపరీతమైన ఆదరణ దృష్ట్యా, మ్యాచ్‌లు మరింత ఎక్కువ మంది వీక్షించేలా టైమింగ్‌ను మార్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బ్రిటన్‌కు చెందిన స్కై స్పోర్ట్స్, భారత్‌కు చెందిన సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లతో నిదితీ సంప్రదింపులు జరిపింది.

కాగా, జూలై 1 నుంచి 19 వరకు భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటనుంది. ఈ పర్యటనలో 5 టీ20లు, 3 వన్డేలు జరుగనున్నాయి. టీ20 సిరీస్ కోసం భారత జట్టును తాజాగా ప్రకటించారు. శ్రేయస్ అ య్యర్ సారథ్యంలో భారత జట్టు ఈ సిరీస్‌కు సిద్ధమవుతోంది. 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ తొలిసారి సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవడంతో ఈ పర్యటనపై మరింత ఆసక్తి నెలకొంది.

హెచ్‌సిఎ అధ్యక్షుడికి తెలంగాణ హైకోర్టు షాక్

హైదరాబాద్, జూన్ 8(ప్రభాతవార్త క్రీడా ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు షాకింగ్ తీర్పు ఇచ్చింది. అతడిని వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని, స్పెషల్ ఏజీఎం నిర్వహించి కొత్త అధ్యక్షుడిని వెంటనే ఎన్నికోవాలని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 2023 అక్టోబర్ 20న జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో అమర్‌నాథ్ ఒకే ఒక్క ఓటు తేడాతో జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. అయితే, జగన్‌మోహన్.. శ్రీ చక్ర క్లబ్ పేరుతో సమర్పించిన పత్రాలు నకిలీవని బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు అమర్‌నాథ్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా 2018లోనే అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి.. గౌలీపురా పేరును శ్రీ చక్ర సీసీగా మార్చడం చట్టవిరుద్ధమని తీర్పునిచ్చారని కాబట్టి ఆ క్లబ్ ఉనికిలో లేదని అమర్‌నాథ్ వాదించారు. దీంతో హెచ్‌సీఏ కార్యకలాపాలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఓడిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా ప్రకటిస్తూ జస్టిస్ కైత్ ప్రకటించారు. అయితే, తాజాగా అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. కేసులో ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం ఆయన ఎన్నిక చెల్లదని తీర్పును వెలువరించింది.

ఎర్రమట్టి చాంపియన్‌గా జ్వెరెవ్

తొలి జర్మనీ ప్లేయర్‌గా ఘనత

పారిస్: ఎర్రమట్టి కోర్టులో కొత్త ఛాంపియన్ వచ్చాడు. రొలాండ్ గారోస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కొబోలీతో హోరాహోరీగా అయిదు సెట్లపోరులో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్6-1, 4-6, 6-4, 6-7, 6-1 తేడాతో నెగ్గి పురుషుల సింగిల్స్ టైటిల్ అందుకున్నాడు. ఈ మ్యాచ్ 4 గంటల 16 నిమిషాలపాటు సాగింది. కొబోలి గట్టిపోటీనివ్వడంతో జ్వెరెవ్ గెలుపు కోసం చెమటోడ్చాడు. నాలుగుసార్లు ఫైనల్‌కు దూసుకొచ్చిన జ్వెరెవ్‌కు ఇదే తొలిగ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్. చివరి సెట్‌లో పాయింట్ సాధించి గెలుపొందడంతో జ్వెరెవ్.. రొలాండ్ గారోస్‌లో ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. మట్టి నేలపై పడుకొని ఇన్నాళ్లు పడిన కష్టానికి కన్నీళ్లు కార్చాడు.

ఈ భావోద్వేగం వెనకాల చాలా కథే ఉంది. సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న అనారోగ్య సమస్యపై 29 ఏళ్ల జ్వెరెవ్ నెగ్గాడు. నాలుగేళ్ల పసిప్రాయంలోనే టైప్ 1 డయాబెటిస్ బారిన పడిన జ్వెరెవ్.. 25 ఏళ్లుగా ఎన్నో కఠిన సవాళ్లు ఎదుర్కొన్నాడు. ఎంతోమంది నిరుత్సాహపరిచినా వెరవకుండా తల్లి దండ్రుల సాయంతో కఠోర పరిశ్రమ చేశాడు. అతడు ఎప్పుడు కోర్టులో అడుగుపెట్టినా.. ఇద్దరితో పోరాటం చేయాల్సి వచ్చేది. ఒకటి ప్రత్యర్థి కాగా, మరొకటి తన శరీరంతో. ఎందుకంటే గంటల తరబడి సాగే సుదీర్ఘ ర్యాలీల్లో ఆటగాళ్లు తీవ్రంగా అలసిపోవడం సహజం. అలాంటిది తను మధుమేహ బాధితుడు. ఆట మధ్యలో షుగర్ లెవెల్స్ పడిపోకుండా జాగ్రత్త వహించాలి. లేదంటే ఆరోగ్యం సహకరించక మ్యాచ్ మధ్యలోనే ఇంటికి వెళ్లే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఆటగాడైనా అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో రాణించాలంటే అంత సులువు కాదు. అయినా ఏనాడు వెనక్కితగ్గని జ్వెరెవ్.. తన అత్యున్నత ఆటతో అదరగొట్టాడు. తన సమస్యను సమాజంతో పంచుకుంటే ఎవరేమనుకుంటారో అని తొలుత భావించిన జ్వెరెవ్.. చాన్నాళ్లపాటు ఈ విషయాన్ని గోప్యంగానే ఉంచాడు. అయితే తనలాంటి వాళ్లు చాలామంది ఉన్నారనే విషయం తెలుసుకున్న అతడు.. టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు అవగాహన కల్పించడానికి హెల్త్‌కేర్ టెక్నాలజీలో గుర్తింపు పొందిన మెడ్‌ట్రానిక్‌తో జట్టు కట్టాడు. ఈ సమస్యతో నిరాశలో కూరుకుపోయిన వారికి ఓ దిక్సూచిగా నిలిచేందుకు, వారిలో సంకల్ప బలం పెంచేందుకు ముందుకువచ్చాడు. తన సోదరుడితో కలిసి 2022లో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫౌండేషన్‌ను సైతం స్థాపించాడు. టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఇన్సులిన్ ఇంజక్షన్లు, ఇతర మందులు అందిస్తున్నాడు.

ఇక ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మ్యాచ్ మధ్యలో జ్వెరెవ్ విరామం తీసుకుని ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. టెన్నిస్‌లో తీవ్రపోటీ ఉన్నప్పటికీ ఏనాడు తన సమస్యను సాకుగా చూపి వెనక్కితగ్గని జ్వెరెవ్ ఎందరికో ఆదర్శంగా నిలిచాడు.

ఎఐ రంగంలోకి రిలయన్స్ ఇన్‌ఫ్రా

ముంబయి, జూన్ 8: పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఆర్ఇన్ఫ్రా) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర కొత్త టెక్నాలజీల రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. తన వ్యాపార కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత సేవలను భాగం చేసే వ్యూహంలో భాగంగా ఈ అడుగు వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ మేరకు తమ అనుబంధ సంస్థల ద్వారా ఈ కొత్త వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో రిలయన్స్ ఇన్ఫ్రా పేర్కొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, సంబంధిత టెక్నాలజీ విభాగాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. రిలయన్స్ ఏఐ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ అపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ వన్ ప్రైవేట్ లిమిటెడ్ అని కొత్త పేర్లతో ఈసంస్థలు వస్తున్నాయి. రిలయన్స్ ఇన్ఫ్రా ఏఐ రంగ ప్రవేశ ప్రకటన మార్కెట్లో తక్షణమే సానుకూల ప్రభావం చూపింది. బీఎస్ఈలో కంపెనీ షేరు 5 శాతం పెరిగి రూ.86.17 వద్ద ఎగువ సర్క్యూట్‌ను తాకింది. గత ఏడాది కాలంలో సుమారు 80 శాతం నష్టపోయినప్పటికీ, గత నెల రోజుల్లో 20 శాతానికి పైగా లాభపడింది. ఆరు నెలల్లో 40 శాతం పతనం కాగా, గత ఐదేళ్లలో మాత్రం 3 శాతానికి పైగా లాభాలను అందించింది. కంపెనీ ఆర్థిక ఫలితాలను పరిశీలిస్తే, 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ. 918 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కార్యకలాపాల ద్వారా రూ. 4,001 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 2,900 కోట్ల లాభాన్ని, రూ. 20,440 కోట్ల రాబడులను నమోదు చేసింది.

పశ్చిమాసియా వార్ ఉద్రిక్తతలతో..

ఈక్విటీ సూచీలకు నష్టాలు

ముంబయి, జూన్ 8: దేశీయ ఈక్విటీసూచీలు వారం ప్రారంభంలో నష్టాలు చవిచూసాయి. ఆసియా మార్కెట్లలో భారీ ఎత్తున అమ్మకాలు కొనసాగడం, ముడిచమురు దరలు పెరుగుతుండటం, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో మార్కెట్ల సూచీలు దెబ్బతిన్నాయి. అలాగే ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు పెంచుతుందన్న వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మార్చింది. మెటల్, ఆటోమొబైల్ స్టాక్స్ ఎక్కువ దెబ్బతీసాయి. హెల్త్‌కేర్‌స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు కొనసాగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 719.08 పాయింట్లు క్షీణించి 73,524.26 పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 పాయింట్ల వద్ద ముగించింది. వరుసగా రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 1.38శాతం చొప్పున క్షీణించాయి. రిలయన్స్ 2.18శాతం, ఎల్‌అండ్‌టి 2.09 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.21శాతం చొప్పున నిఫ్టీలో ఎక్కువ నష్టం చవిచూసాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 1.70శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.88శాతం చొప్పున దిగజారాయి.

మార్కెట్ల పరంగా 1181 షేర్లు పెరిగితే 3192 షేర్లు క్షీణించాయి. 180 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.74గా కొనసాగింది. అంతకుముందురోజు 95.18కంటే స్వల్పంగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు ఆగస్టు 6వ తేదీనాటి సెటిల్‌మెంట్లు 1.33శాతం క్షీణించి రూ.1,53,529కి చేరాయి. కమొడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు సెటిల్‌మెంట్ ధరలు3.92డాలర్లు పెరిగి 97.01కి చేరాయి. యూరోప్, ఆసియా షేర్లు కూడా దిగువ స్థాయిలో ట్రేడింగ్‌జరడంతో ఈ ప్రభావం భారత్ మార్కెట్లపై చూపించింది. వివిధ కంపెనీల పరంగా చూస్తే ఇఎంఎస్ 10.35శాతం పెరిగింది. హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ 2.84శాతం, జీ ఎంటర్‌టైన్‌మెంట్ 1.05శాతం డౌన్ అయ్యాయి. క్యాపిట్ బ్రూవ రీస్ డిస్టిలరీస్ 4.96శాతం, లీ ట్రావెన్యూస్ టెక్నాలజీ ఇక్సిగో 2.49శాతం క్షీణించాయి.

సిగ్మా అడ్వాన్సుడ్ సిస్టమ్స్ 4.39శాతం, ఆదాని పోర్టులు సెజ్ 1.05శాతం, వారి రెన్యువబుల్ టెక్నాలజీస్ 2.36శాతం, లూపిన్ 0.58శాతంచొప్పున క్షీణించాయి.

భారత్ డీమ్యాట్ రంగంలో 77శాతం ఖాతాలు నిర్వీర్యం

అసలు ఖాతాలు ఐదు కోట్లే

న్యూఢిల్లీ: భారతదేశంలో రిటైల్ ఇన్వెస్టింగ్ విప్లవం భారీగా విస్తరించినట్లు కనిపిస్తున్నప్పటికీ, డీమ్యాట్ ఖాతాల వాస్తవ వినియోగం తక్కువగానే ఉంది. గత ఏడాది డిసెంబర్ నాటికి దేశంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య 21.6 కోట్లకు చేరగా, వాటిలో కేవలం 5 కోట్ల ఖాతాలే పనిచేస్తున్నట్లు తేలింది. మిగిలిన 16.6 కోట్ల ఖాతాలు నిర్వీర్యంగా లేదా క్రియాశీలత లేకుండా ఉన్నట్లు తెలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2026 ఆర్థిక సంవత్సరంలో యాక్టివ్ ఇన్వెస్టర్ల సంఖ్య 7శాతం తగ్గి 4.58 కోట్లకు చేరింది. 2025లో ఈ సంఖ్య 4.92 కోట్లుగా ఉండగా, ఏడాదిలోనే దాదాపు 35 లక్షల యాక్టివ్ ఖాతాలు తగ్గిపోయాయి. ఈ తగ్గుదలలో 70 శాతం కంటే ఎక్కువ భాగం జీరోధా, ఏంజెల్ వన్, అప్స్టాక్స్ వంటి ప్రముఖ డిస్కౌంట్ బ్రోకర్ల ఖాతాదారుల నుంచే నమోదైంది. మార్కెట్ నిపుణులు దీనికి మూడు ప్రధాన కారణాలను గుర్తిస్తున్నారు. బుల్ మార్కెట్ సమయంలో అనేక మంది పెట్టుబడిదారులు కేవలం ఐపీఓలలో పాల్గొనడానికి మాత్రమే డీమ్యాట్ ఖాతాలు తెరిచారు. షేర్ల కేటాయింపు రాకపోవడం లేదా లిస్టింగ్ అనంతరం వెంటనే విక్రయించడం వల్ల ఆ ఖాతాలను తరువాత ఉపయోగించలేదు.

డిజిటల్ బ్రోకరేజ్ సేవలు, పేపర్‌లెస్ ప్రక్రియల కారణంగా ఒకే వ్యక్తి అనేక బ్రోకర్ల వద్ద డీమ్యాట్ ఖాతాలు తెరవడం సులభమైంది. వాటిలో ఒక ఖాతాను మాత్రమే వినియోగిస్తూ మిగిలిన ఖాతాలను నిర్వీర్యంగా వదిలేస్తున్నారు. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఎఫ్అండ్‌ఓ విభాగంలో ఎక్కువ మంది రిటైల్ ట్రేడర్లు నష్టాలను ఎదుర్కొంటున్నట్లు నియంత్రణ సంస్థల అధ్యయనాలు వెల్లడించాయి. నప్రైవేట్ వెల్త్ వ్యవస్థాపకుడు హిమాన్షు పాండ్యా మాట్లాడుతూ, ఖాతాల సంఖ్య పెరగడం మాత్రమే నిజమైన మార్కెట్ భాగస్వామ్యానికి సూచిక కాదన్నారు.

దూకుడుగా ఖాతాలు తెరవడం ద్వారా మార్కెట్లో స్థిరమైన పెట్టుబడిదారులు పెరగరని ఆయన అభిప్రాయపడ్డారు. మనీలాండరింగ్, మోసపూరిత లావాదేవీలకు ఇటువంటి ఖాతాలు ఉపయోగపడే అవకాశం ఉందని హెచ్చరించారు. 21.6 కోట్ల డీమ్యాట్ ఖాతాల సంఖ్య కనిపిస్తున్నప్పటికీ, బహుళ ఖాతాల కారణంగా దేశంలో నిజమైన ప్రత్యేక పెట్టుబడిదారుల సంఖ్య 12 నుంచి 13 కోట్ల మధ్య మాత్రమే ఉండొచ్చనిఅంచనా. రిటైల్ పెట్టుబడిదారుల భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, యాక్టివ్ ఖాతాల తగ్గుదల భారత పెట్టుబడి సంస్కృతిలో ఉన్న వాస్తవ పరిస్థితిని బయటపెడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

గ్లోబల్ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్

న్యూయార్కు, జూన్ 8: టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా నిలిచే అవకాశం ఉంది. ఒక ట్రిలియన్ డాలర్ల సంపదను కలిగిన మొట్టమొదటి వ్యక్తిగా మస్క్ రికార్డు సృష్టించబోతున్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్న మస్క్ సంపదలో అధిక భాగం టెస్లా కంపెనీ షేర్ల రూపంలో ఉంది. దీని విలువ సుమారు 273 బిలియన్ డాలర్లు. మరో సంస్థ స్పేస్ఎక్స్ త్వరలో స్టాక్ మార్కెట్‌లో అడుగుపెడితే (ఐపీఓ), ఆయన సంపదకు అదనంగా మరో 841 బిలియన్ డాలర్లు జతయ్యే అవకాశం ఉంది. అప్పుడు ఆయన నికర సంపద 1 ట్రిలియన్ డాలర్ల మార్కును సులభంగా దాటుతుంది. ఒక ట్రిలియన్ డాలర్లంటే భారత కరెన్సీలో సుమారు 95 లక్షల కోట్ల రూపాయలు. ఈ సంపద విలువ ప్రపంచంలోని చాలా దేశాల వార్షిక ఆర్థిక వ్యవస్థల (జీడీపీ) కంటే ఎక్కువ కావడం గమనార్హం. తైవాన్ (977 బిలియన్లు), ఐర్లాండ్ (779 బిలియన్లు), స్వీడన్ (760 బిలియన్లు), సింగపూర్ (660 బిలియన్లు) వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీ కంటే కూడా మస్క్ సంపదే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ ఆర్థిక కేంద్రమైన మాన్‌హట్టన్ వార్షిక ఆర్థిక ఉత్పత్తి (1 ట్రిలియన్)తో ఇది సమానంగా ఉంది. మస్క్ తోటి టెక్ బిలియనీర్లతో పోల్చినప్పుడు ఈ సంపద స్థాయి తెలుస్తోంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్, గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్ వంటి పలువురు అగ్రశ్రేణి కుబేరులందరి మొత్తం సంపద కలిపితే సుమారు1.09 ట్రిలియన్లు ఉంటుంది. వీరందరి సంపద కేవలం మస్క్ ఒక్కడి సంపద కంటే కొంచెమే ఎక్కువ. అమెరికాలోని ప్రధాన నగరమైన హ్యూస్టన్‌లోని నివాస, వాణిజ్య ఆస్తులన్నింటి మొత్తం విలువ (879 బిలియన్లు) కంటే కూడా మస్క్ సంపద ఎక్కువ.

వాటాల విక్రయానికి ఎన్‌ఎల్‌సీ ఓఎఫ్ఎస్?

న్యూఢిల్లీ, జూన్ 8: ప్రభుత్వరంగంలోని నైవేలి లిగ్నయిట్ కార్పొరేషన్ ఆఫర్‌ఫర్‌సేల్ ప్రకటించింది. మూడుశాతం ఈక్విటీ వాటాలను విక్రయించనున్నట్లు తెలిపింది. ఇన్వెస్టర్లు ప్రభుత్వరంగంలోని ఒక నవరత్న కంపెనీ షేర్లు కొనుగోలుకు ఇపుడు మంచి తరుణం వచ్చింది. ప్రభుత్వ పరిధిలోని పెట్టుబడుల ఉపసంహరణ పథకం పరిధిలో ఈ ఓఎఫ్ఎస్ ఉంటుందని కంపెనీ ప్రకటించింది. ఓఎఫ్ఎస్ ఇష్యూధర రూ.303గా ప్రకటించింది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు మంగళవారంనుంచే ప్రారంభిస్తారు. రిటైల్ ఇన్వెస్టర్లకు ఈనెల పదోతేదీనుంచి బిడ్లు తెరుస్తారు. ఇష్యూధర ప్రస్తుత మార్కెట్‌ధరకంటే 10శాతం డిస్కౌంట్‌కు లభిస్తున్నది. రెండుశాతం అధీకృత మూలధనంలో వాటాగా ఈ షేర్‌సేల్ ఉంటుంది. అదనంగా ఒకటిశాతం వాటా గ్రీన్‌షూ ఆప్షన్‌కింద అందుబాటులో ఉంచుతుంది. పవర్‌బిజినెస్‌లను పెంచుకోడం, సామర్థ్యం విస్తరణ వంటివదటికి ఈనిధులు వినియోగిస్తారు. ఇటీవలికాలంలో ఎన్ఎల్‌సీ మంచి పనితీరుచూపించింది. స్థిరంగా రిటర్నులు వస్తున్నాయి. వాటాదారులకు క్రమం తప్పకుండా డివిడెండ్లు ప్రకటిస్తోంది. ఇన్వెస్టర్ల స్పందనను ట్రేడర్లు నిశితంగా గమనిస్తున్నారు.

రెండునెలల్లో 15% పెరిగిన ఎగుమతులు

ముంబయి, జూన్ 8: భారత వాణిజ్య ఎగుమతులు ఏప్రిల్ మేనెలల్లో 15శాతం పెరిగినట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. అదనంగా పెట్రోలియమేతర ఉత్పత్తుల ఎగుమతులు పటిష్టమైన వృద్ధిని నమోదుచేసాయి. 10నుంచి 11శాతం ఎగుమతులు పెరిగినట్లు కేంద్రం వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం పెరుగుతున్నప్పటికీ వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నప్పటికీ భారత్‌నుంచి ఎగుమతులు మాత్రం పటిష్టంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. 2027 ఆర్థికసంవత్సరం ప్రారంభంనుంచే పటిష్టంగా ఉన్నాయి. ఏటికేడాది 13.6శాతం వృద్ధిని నమోదుచేస్తూ ఏప్రిల్ 2026లో 80.8 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు జరిగాయి. వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌మాట్లాడుతూ ప్రాంతీయ సవాళ్లు ఎన్ని ఎదురయినా ఎగుమతులకు విఘాతం కలగలేదని, విభిన్న మార్కెట్లకు ఎగుమతులుచేయడంవల్ల పటిష్టమైన వృద్ధిని సాధించామన్నారు. ఉత్పత్తుల ఎగుమతులు ఏప్రిల్‌లో 43.56 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇదేనెలలో 38.28 బిలియన్ డాలర్లవరకూ మాత్రమే ఉన్నాయి. సేవలరంగ ఎగుమతులు 32.8 బిలియన్ డాలర్లనుంచి 37.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దిగుమతులు కూడా పెరిగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.